ఆదివారం
ప్రజాశక్తి
18 నవంబర్, 2001

కాలుష్యం కోరల్లో దాల్‌లేక్

కార్మిక, కర్షక
దినపత్రిక సామాన్యుల
ప్రియపుత్రిక

ప్రజాశక్తి
దినపత్రిక

విరోధం

ఒక ఆసామి. పేరనవసరం. పొరుగూర్లో చుట్టాన్ని పలకరించేందుకు బస్సు దిగేడు. ఊళ్లోకెళ్లేందుకు చేల గట్టుమీద నడుస్తున్నాడు. ఆ ఊరు వెళ్లడం అతనికదే మొదటిసారి! అంచేత ఊళ్లో గొడవలు అతనికి బొత్తిగా తెలీవు. అతని చేతిలో చుట్ట వుంది. జేబులో అగ్గిపెట్టి లేదు. అగ్గిపెట్టి వుండి చుట్ట లేకపోతే సరిపెట్టుకోవచ్చు. చుట్ట వుండి అగ్గిపెట్టి లేనప్పుడు మాత్రం చెడ్డ చిరాగ్గా వుంటుంది. అంచేత ఆ ఆసామి గొప్ప చిరాగ్గానే నడుస్తున్నాడు. ఎదురుగా ఒక రైతు రావడం చూసేడు. రైతు తన కళ్ల పడగానే అమ్మయ్య అనుకున్నాడు. రైతు దగ్గిర ఖచ్చితంగా అగ్గిపెట్టి వుంటుందనే ఆశకొద్దీ - బాబు అగ్గిపెట్టి వుందాని అడిగేడు. అగ్గిపెట్టి మాట వినగానే రైతు ఉగ్రుడయ్యేడు. నేను కొంపలంటించే మనిషిని కానని కళ్లెర్ర చేసి గాండ్రించేడు!

ఆఫ్టరాల్ అగ్గిపెట్టి అడిగినందుకు అపాటి ఆవేశమెందుకో ఆసామికి అర్థం కాలేదు. అంచేత ఆసామి వళ్లు మండిపోయింది. నేను మీ నేచర్ గురించి అడగలేదు. అగ్గిపెట్టి అడిగేను. అగ్గిపెట్టి వున్న ప్రతి మనిషీ కొంపకి నిప్పంటించే రకమని నేననుకోను. అగ్గిపెట్టితో కొంపలే కాదు - చుట్ట కూడా ముట్టించుకోవచ్చు. ఆ పని మీదే మిమ్మల్ని అగ్గిపెట్టి అడిగేనన్నాడు. ఆ వివరణ విన్న రైతు చల్లపడలేదు. నేను చుట్టలు కాల్చనన్నాడు. నేనే కాదు - మా ఇంటో కుక్కలు కూడా కాల్చవన్నాడు. కుక్కమాట వినగానే ఆసామి హీటెక్కి పోయేడు. కుక్కలు చుట్టలు కాల్చవని సమస్తమైన వాళ్లకీ తెలుసు. మనుషులే చుట్టలు కాలుస్తారు! పొరపాటున మిమ్మల్ని అగ్గిపెట్టి అడిగినందుకు క్షమించండని ఆసామి చురక తగిలించేడు. ఆ చురకని తట్టుకోలేక నేను మనిషిని కానా అన్నాడు రైతు. వివరాలడక్కండన్నాడు ఆసామి!

మనలో మాట

మందేవూరు అన్నాడు రైతు. మీ ఊరు మాత్రం కాదన్నాడు ఆసామి. అందుకే తిక్కతిక్కగా మాటాడుతున్నావన్నాడు రైతు. మాటలు తిన్నగా రానివ్వండన్నాడు ఆసామి. మా ఊళ్లో ఎవ్వరూ అగ్గిపెట్టి ముట్టుకోరన్నాడు రైతు. ఆ మాట వినగానే ఆసామి ఆశ్చర్యపోయేడు. మీకు నిప్పుతో పని లేదా అని అడిగేడు ఆసామి. నిప్పుకోసం మేము అగ్గిపెట్టి ఉపయోగించం అన్నాడు రైతు. ఏమి ఉపయోగిస్తారని కుతూహలంగా ప్రశ్నించేడు ఆసామి. పచ్చగడ్డి అని సమాధానమిచ్చేడు రైతు. పచ్చగడ్డితో నిప్పా అని ఆసామి మరింత ఆశ్చర్యపోతూ వుంటే - రైతు కొంత పచ్చగడ్డిని ఆసామి ముందుంచేడు. మీరు చుట్ట కాల్చుకోవాలి అంతేగా అని అడిగేడు రైతు. అవునంతె అని అమాయకంగా తలూపేడు ఆసామి. అందుకు నిప్పు చాలా అవసరం అంతేగా అన్నాడు రైతు. అవునవునని రెండుసార్లు తల ఊపేడు ఆసామి!

రైతు పచ్చగడ్డి ముందు నిలబడి "రామయ్యా రంగయ్యా" అని మంత్రం చదివేడు. అంతే! ఆ పేర్లు అతని నోటి నుంచి రాగానే - పచ్చగడ్డి భగ్గున మండింది. ఆ ఫీటుకి ఆసామి షాకు తిన్నాడు. ఇప్పుడు చుట్ట ముట్టించుకోండి అన్నాడు రైతు. పచ్చగడ్డి మంటలో ఆసామి చుట్టముట్టించుకుని తాపీగా దమ్ము లాగి రైతుకి థేంక్స్ చెప్పేందుకు లేచి నించున్నాడు. అప్పటికే ఆ రైతు తనకేం పట్టనట్టు చేలగట్టు దాటి వెళ్లిపోతున్నాడు. ఇదొక పిట్టకథ. కొంచెం అతిశయోక్తి జతచేసి చెప్పిన కథ. ఇద్దరు బద్ధ విరోధుల గురించి చెప్పాలనుకున్నప్పుడు - ఆ ఇద్దరి మధ్యా పచ్చగడ్డి వేస్తే భగ్గున మండుతుందనే మాటని డ్రమిటైజ్ చేసిన సందర్భమిది! సినిమాల్లో టైటిల్స్ ముందు ఈ ఒక్కసీను నడిపిస్తే చాలు. బోలెడు నిడివి కలిసొస్తుంది. సామెతను దృశ్యం చేసి కథ నడిపించడం మేలు రకం పద్ధతి! నేటి రాజకీయం పుణ్యమాని ఇల్లాంటి ఫీట్లు ఈ మధ్య చాలా విరివిగా పేపర్లలో కనిపిస్తున్నాయి! అందుకు మనం సంతోషించాలి!

సామాజిక ప్రయోజనాన్ని ఆశించేదే నిజమైన నాటకం ...9

పంజాబ్ జాతీయ క్రీడల్లో మన స్థానం ఎక్కడ? ...17

ఇంకా...

ఆరోగ్యం 6, 7

బాలవికాసం 10

బాలల కథ 11

బాల నేస్తాలు 12, 13

కచేరి 14

టూరిస్ట్ గైడ్ ... 16

కథ 18, 19

పలుకుబడి 24

వగైరా.......

ఆమె జీవితమే ఒక పోరాటం ...21, 22, 23

నువ్వు తిన్నావా? ...15


నిజాం
ఆభరణాల...
ప్రదర్శన
మార్గం
గమనిక
ఆభరణాలు తిలకించండి
తాకట్టు పెట్టాలని
మాత్రం...
అనుకోకండి!
GANGADHAR

మనవాళ్ల 'బాడీ కండిషన్' నార్మల్‌గానే ఉందట
కానీ.. మెంటల్ కండిషన్ మాత్రం ఇప్పట్లో తేల్చి..
చెప్పలేమంటున్నారు సార్.. డాక్టర్లు...


ప్రపంచ శాంతి
PEACE
ఉగ్రవాద వ్యతిరేకం
ANTI-TERRORISM



కాలుష్యం కోరల్లో డాల్‌లేక్

పోతుకూరు శ్రీనివాసరావు

కాశ్మీర్ కిరీటంలో కలికితురాయిగా కవులచే కీర్తించబడిన డాల్ సరస్సు ఇప్పుడు పర్యావరణ ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నది. అక్కడి పర్యావరణ పరిరక్షణ కోసం పలు సంస్థలు రేయింబవళ్ళు పాటుపడుతున్నాయి. ఐరోపాకు స్విట్జర్లాండ్ ఎలాంటిదో భారతదేశానికి కాశ్మీర్ అలాంటిదని అంతర్జాతీయ పర్యాటకులు అభివర్ణిస్తుంటారు. సుందరమైన కాశ్మీర్‌లో డాల్‌లేక్, శ్రీనగర్, పహల్గావ్, గుల్‌మార్గ్, సోనామార్గ్ వంటి అంతర్జాతీయ పర్యాటక కేంద్రాలున్నాయి. పర్యాటక కేంద్రాల్లో వేటి ప్రత్యేకత వాటిదే అయినా డాల్ సరస్సుకు ఇంకా విశిష్ట స్థానం వుంది. కాశ్మీర్‌లో పర్యటించడం అంతా ఒక ఎత్తయితే ఒక్క డాల్ సరస్సులో జరిపే బోటు షికారు ఒక ఎత్తు.

కాశ్మీర్ వేసవి రాజధాని శ్రీనగర్‌కు అరకిలో మీటర్ దూరంలో డాల్ సరస్సు వుంది. సర్ వాల్టర్ లారెన్స్ మాటల్లో చెప్పాలంటే "ప్రపంచంలో ఇంత సుందరమైన సరస్సు ఇంకెక్కడా లేదు. అద్భుతమైన సరస్సు". శతాబ్దాల క్రితం డాల్ సరస్సు అందాలకు ముగ్ధులైన మొఘల్ పాలకులు దాని తీరాలలో 'మౌంటెన్ గార్డెన్స్' నిర్మించారు.



ఆ తర్వాత రెండు శతాబ్దాల అనంతరం బ్రిటీష్ వారి హయాంలో డాల్ సరస్సు మరిన్ని కొత్త అందాలను సమకూర్చుకున్నది. 1989లో జమ్మూకాశ్మీర్ ఉగ్రవాదుల దుందుడుకు పోకడలు ఊపందుకోవడంతో విదేశీ పర్యాటకులకు రాష్ట్ర ప్రభుత్వం తలుపులు మూసేసింది.

హౌస్‌బోట్స్‌లో షికారు

డాల్ లేక్ గురించి ప్రధానంగా చెప్పుకోవలసి వస్తే ముందుగా చెప్పుకోవలసింది అక్కడి 'హౌస్‌బోట్స్' గురించే. డాల్ సరస్సులో అన్ని కేటగిరీల వారికి డీలక్స్ నుండి 'డి' క్లాసు వరకూ విడివిడిగా బోటులున్నాయి. బోటులోని సౌకర్యాలను బట్టి రేటుంటుందన్న మాట! నాగిన్ అనే మరో సరస్సులో అయితే ఒక్క లగ్జరీ క్లాసు వారికే బోటు షికారు అవకాశముంటుంది. డాల్ సరస్సులో అలాకాదు. అందరికీ అందుబాటులో ఉండే బోట్లు కూడా ఉంటాయి. ఇక బోటులో సౌకర్యాల సంగతికొస్తే ఒక్కొక్క బోటులో

ప్రైవేట్ బోట్లతో స్కయింగ్



డాల్‌లేక్‌లో స్కయింగ్

శ్రీనగర్‌లోని డాల్, నాగిన్ సరస్సుల్లోనూ, శ్రీనగర్‌కు 32 కిలోమీటర్ల దూరంలోని మనాస్‌బాల్ సరస్సులోనూ అరుదుగా వాటర్ స్కయింగ్ వంటి జలక్రీడలు కూడా జోరుగా సాగుతుంటాయన్న విషయం ఎక్కువ మందికి తెలియదు. డాల్ సరస్సులో స్కయింగ్ చేసే ఆసక్తి వున్న వారికి అక్కడి 'బొడ్డాల్' అనే ప్రైవేట్ బాతింగ్ బోట్లను అద్దెకిస్తుంది. అక్కడ కొత్తవారి కోసం శిక్షకులు కూడా అందుబాటులో వుంటారు. నాగిన్ సరస్సులో బాతింగ్ బోట్లు అధికం. అక్కడ వాటర్ స్పోర్ట్స్ కోసం ప్రభుత్వమే ఒక సంస్థను నడుపుతున్నది.

రెండు నుండి నాలుగు బెడ్‌రూములు, కామన్ సిట్టింగ్ రూమ్ లేదా లాబీ ఉంటాయి. భోజనం, టీ , టిఫిన్ అన్నిటికీ బోటులో ఏర్పాట్లుంటాయి. బోటులో డాల్‌పై తిరగడాన్ని అక్కడ 'షికారా' అని పిలుస్తారు. వందలాది కుటుంబాలు ఇక్కడ హౌస్‌బోట్‌లలో శతాబ్దాలుగా నివసిస్తున్నాయి. సెలవు రోజుల్లో డాల్ అందాలను వీక్షిస్తూ అలలపై కదులుతున్న ఇంటిలో గడుపుతున్న ఫీలింగ్... ఓహ్... పర్యాటకులకు ఎన్నో మధురానుభూతులను మిగుల్చుతుంది. ఆహ్లాదకరమైన వాతావరణం, స్వచ్ఛమైన నీళ్ళు, చుట్టూ అందమైన పరిసరాలు, చెట్లు, దూరంగా వెండి కొండల వంటి హిమాలయాలు పర్యాటకుల మనసులను దోచుకుంటాయి. బోటు షికారులోనే షాపింగ్‌కూ అవకాశముంది. బోటు షికారు గంట నుండి రోజంతా చేసేందుకు వీలుంది. డాల్ సరస్సులో బోటు షికారు చేస్తూ శ్రీనగర్‌లోనే అనేక ముఖ్యమైన స్థలాలను సందర్శించేందుకు వీలుండడంతో సందర్శకులు బోటు షికారుకే అత్యంత ప్రాధ్యాతనిస్తుంటారు.

రంగుమారుతున్న నీళ్ళు

ప్రపంచ ప్రసిద్ధి పొందిన ఢడాల్‌లేక్ ఇప్పుడు పర్యావరణ సమస్యలతో సతమతమవుతున్నది. ఉగ్రవాద సమస్య ఒకవైపు, కాలుష్య సమస్య మరోవైపు ముంచుకురావడంతో అసలే అంతంతమాత్రంగా వున్న పర్యాటకుల సంఖ్య మరింత తగ్గిపోతున్నది. అరుదుగా కన్పించే 'యాగ్లెనైనే' అనే ఒకరకమైన పాకుడు (ఆల్గే) ఢడాల్ సరస్సులో విపరీతంగా పెరిగిపోతున్నది. ఫలితంగా ఎంతో స్వచ్ఛంగా అడుగు కూడా కన్పిస్తున్నదా అన్నట్లుండే ఢడాల్ నీరు ఇపుడు రంగు మారిపోతున్నది. డాల్ సరస్సులో విపరీతంగా వచ్చి చేరుతున్న నైట్రేట్లు, ఫాస్ఫేట్లు, పొటాషియం వంటి అర్గానో ఫాస్ఫేట్లు ఈ ఆల్గే పెరగడానికి కారణమవుతున్నాయి. సరస్సు పైనా, పరిసరాల్లో నివశిస్తున్న 48 వేల కుటుంబాలు కాలుష్యానికి కారణమవుతున్నాయి. ఈ ఆల్గే పెరిగే కొద్దీ దాని పరిసరాల్లో ఆక్సిజన్ శాతం తగ్గిపోతుంటుందని ఫలితంగా ఇతర జీవులకు, చెట్లకు విపరీతమైన హాని జరుగుతుందని పర్యావరణ వేత్తలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే అసలు సైజులో సగానికి సగం తగ్గిపోయిన డాల్

'గ్రీన్ కాశ్మీర్' కృషి ప్రశంసనీయం

సంచుల్లో చెత్త నింపి మున్సిపాలిటీ వాహనం కోసం చూస్తున్న గ్రీన్ కాశ్మీర్ కార్యకర్తలు

శ్రీనగర్‌లోని కాలుష్యం డాల్ సరస్సును కబళించి వేస్తుండడం, దానిని పరిరక్షించడం ప్రభుత్వాలకు తలకుమించిన భారం కావడంతో దక్షిణాఫ్రికా జాతీయుడు ఛార్లెస్ హెర్మన్ గోషన్ నడుం బిగించారు. 1984 నుండి ఏటా కాశ్మీర్‌ను సందర్శిస్తున్న గోషన్ అక్కడి అందాలకు ముగ్ధుడయ్యాడు. అదే సమయంలో డాల్ సరస్సు కాలుష్యం బారిన పడడం ఆయనను ఎంతగానో బాధించింది. ఉగ్రవాదుల నుండి వచ్చిన హెచ్చరికలను ఖాతరు చేయకుండా దాల్ సరస్సు శ్రేయస్సే తనకు ముఖ్యమని గోషన్ ప్రకటించాడు. "కాశ్మీర్ ఏ దేశంలో భాగమైతే నాకెందుకు ప్రకృతి రమణీయమైన డాల్ సరస్సును పరిరక్షించడం ప్రాథమిక విధిగా భావిస్తున్నాను" అని గోషన్ పేర్కొన్నాడు. 'గ్రీన్ కాశ్మీర్' అనే స్వచ్ఛంద సంస్థను నెలకొల్పి అందుకు కృషి చేయడం ప్రారంభించారు. 1996లో ప్రారంభించబడిన ఈ సంస్థకు వందలాది మంది మద్దతుదారులు, ప్రచారకులు వున్నారు. వీరు కాక 10 మంది ఉద్యోగులు, ఐదుగురు కార్యకర్తలు, నలుగురు ట్రస్టీలు, 10 మంది సలహాదారులు వున్నారు. ఈ సంస్థ శ్రీనగర్‌లోని టన్నుల కొద్దీ చెత్తను స్వచ్ఛందంగా సేకరించడం ప్రారంభించింది. ప్రారంభంలో జమ్మూ కాశ్మీర్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు గ్రీన్ కాశ్మీర్‌కు కొంత ఆర్థిక సహాయం అందించేది. 97లో జమ్మూకాశ్మీర్ లేక్స్ అండ్ వాటర్‌వేస్ డెవలప్‌మెంట్ అథారిటీ 96 వేల రూపాయలను అందజేసింది. 56 వేల హౌస్‌బోట్లకు, ఇళ్లకు డస్ట్‌బిన్లను అందించి ప్రతిరోజూ వాటి నుండి చెత్తను సేకరిస్తున్నారు. ఈ చెత్తను మున్సిపాలిటీ ట్రక్కులో చేర్చి శ్రీనగర్‌కు దూరంగా గల అచన్ ప్రాంతానికి తరలిస్తున్నారు. అయితే ప్రభుత్వం ఈ సంస్థకు సహాయాన్ని అర్థాంతరంగా నిలిపివేసింది. తొమ్మిది నెలలుగా జీతాలు లేకున్నా గ్రీన్ కాశ్మీర్ ఉద్యోగులు తమ పనిని నిలిపివేయకుండా సాగిస్తూనే వున్నారు. హౌస్‌బోట్ యజమానులిచ్చే చిన్న మొత్తాలతోనే జీవనం గడుపుతున్నారు. గత ఏడాది జనవరిలో గోషన్ మరణించడం గ్రీన్ కాశ్మీర్‌ను మరింత కృంగదీసింది. అయినా ఆ సంస్థ కార్యదర్శి గౌహర్ ఫిజిల్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు కొనసాగిస్తోంది.

పార్ట్‌టైం 'షికారా'

బోటులో పర్యాటకులతో ముదసిర్

డాల్ సరస్సులో 'బోటు షికారు'పై ఆధారపడి జీవించే వారి సంఖ్య అధికమే. అక్కడ చిన్న పిల్లలు సైతం బోట్లను నడుపుతుంటారు. చదువుకుంటూనే సెలవు రోజుల్లో తమ బోట్లను షికారుకు నడుపుతూ పార్ట్‌టైం ఉద్యోగం చేస్తుంటారు. ఏడవ తరగతి చదువుతున్న ముదసిర్ రోజుకు 100 నుండి 150 రూపాయలు సంపాదించి సెలవు రోజుల్లో తన కుటుంబానికి అదనపు ఆదాయాన్ని సమకూరుస్తున్నట్లు చెబుతున్నాడు. అనేకభాషలు మాట్లాడే టూరిస్టులతో నిత్యం ఉండే సంబంధ బాంధవ్యాలు అక్కడి వారిపై విశేష ప్రభావం చూపిస్తున్నాయి. వారి ఆహారపు అలవాట్లలోనూ మార్పులు వస్తున్నాయి. ముదసిర్ అనేక భాషల్లో మాట్లాడగలడు. తాను డాక్టర్‌ను కావాలనుకుంటున్నట్లు అతను చెప్పాడు. ఇలా డాల్ సరస్సులో బోటు నడిపే చిన్నపిల్లల సంఖ్యే 500కు పైగా ఉంటుందంటే ఆశ్చర్యం కలగక మానదు. ఉగ్రవాద పీడిత రాష్ట్రమైనందున అక్కడ ఉపాధి అవకాశాలు దాదాపు మృగ్యమే. పెద్దలు కష్టతరమైన పనుల్లో ఉంటారు. పిల్లలు కూరగాయలు, పూలు అమ్మడం వంటి పనులు చేస్తుంటారు. కుటుంబంలో అందరూ ఏదో ఒక పని చేస్తే గానీ పూటగడవని పరిస్థితి ఉందని ముదసిర్ తెలిపాడు. ఇతర పనుల మాటెలా వున్నా బోటు నడుపుతున్న పిల్లల విషయంలో మాత్రం తల్లిదండ్రులు నిశ్చింతగా ఉంటారని ముదసిర్ పేర్కొన్నాడు. అందుకే సెలవు వచ్చిందంటే తాను తన తోటి వాళ్లంతా బోట్లపై చేరి టూరిస్టుల కోసం ఎదురు చూస్తుంటామని, లేదంటే కబుర్లతో కాలక్షేపం చేస్తామని అతను చెప్పాడు.

సరస్సులో కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుకున్నదని, ఫలితంగా అతిసార, కలరా వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలే ప్రమాదమున్నదని వారు చెబుతున్నారు.

సమస్యను గుర్తించే ప్రయత్నాలు

డాల్‌లేక్ పరిరక్షణ కోసం, వాస్తవ పరిస్థితిని అధ్యయనం చేయడానికి గాను 1997లో జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. ఇందుకోసం వియన్నా టెక్నికల్ యూనివర్సిటీకి చెందిన పర్యావరణ నిపుణుడు క్రోయిస్‌ను రప్పించింది. సాయుధుల రక్షణ మధ్య ఆయన డాల్‌లేక్‌పై అధ్యయనం సాగించారు. ప్రముఖ పర్యావరణ కన్సల్టెన్సీ సంస్థ 'ఐఆర్‌వి మెకన్ సల్'కు చెందిన కన్సల్టింగ్ ఇంజనీర్ అబ్దుల్లా ఖాన్ కూడా క్రోయిస్‌కి సహకరించారు. డాల్‌లేక్ పర్యావరణం దెబ్బతినడానికి మూడు కారణాలను వారు గుర్తించారు.

1. సరస్సు చుట్టూ వున్న పంటపొలాల నుండి వాడిన నీటి ద్వారా సరస్సులో వచ్చి చేరుతున్న రసాయనాలు ఆల్గే పెరగడానికి కారణమవుతుండడం.
2. సరస్సుకు నీరందిస్తున్న నదుల ద్వారా వచ్చి చేరుతున్న ఇసుక మేటలు పెరుగుతుండడం, ఫలితంగా సరస్సు విస్తీర్ణం, నీటి శాతం తగ్గుతుండడం.
3. పరిసరాలలో చెట్ల నరికివేత విపరీతంగా పెరుగుతుండడం.

వీటికి తోడు సరస్సు పైనా, పరిసరాల్లో నివసిస్తున్న వారు విచక్షణా రహితంగా వ్యర్థాలను సరస్సులోకి వదులుతుండడం కూడా మరో కారణమని అబ్దుల్లాఖాన్ చెబుతున్నారు.

పర్యాటకుల కోసం అలంకారాలతో ఎదురు చూస్తున్న బోట్లు

నివారణా చర్యలు

ఇప్పటివరకు కాశ్మీర్ ప్రభుత్వం పిచ్చిమొక్కలు తీయించడం, పాకుడు తొలగించడం వంటి పైపై పనులపైనే దృష్టి పెట్టింది తప్ప సమస్య మూలాలను వెదికే ప్రయత్నం చేయలేదు. డాల్‌లేక్ పరిక్షణ కోసం 45 కోట్ల రూపాయలు వెచ్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే కేంద్ర ప్రభుత్వాన్ని అర్థించిన 297 కోట్ల రూపాయలు వస్తే గానీ ఈ ప్రాజెక్టు పని ప్రారంభించలేనని చేతులెత్తేసింది. డాల్ సరస్సు పరిరక్షణ ప్రాజెక్టు కోసం కేంద్ర సాయమే అక్కరలేదని 66 కోట్ల డాలర్లున్నా సరిపోతుంది కనుక రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని అబ్దుల్లా అంటున్నారు. ఓవర్‌సీస్ డెవలప్‌మెంట్ ఏజన్సీ బృందం పర్యటించి తయారు చేసిన నివేదికపై బ్రిటిష్ ప్రభుత్వం స్పందించి సహాయానికి వాగ్దానం చేసినప్పటికీ కాశ్మీర్‌లో ఉగ్రవాదం పెరిగిన తర్వాత ఆ ఆలోచన విరమించుకున్నది. డాల్ సరస్సు పరిరక్షణ ప్రాజెక్టును ప్రారంభించాల్సిందిగా ఇటీవల ఒక ప్రజా ప్రయోజనాల వ్యాజ్యంపై సుప్రీంకోర్టు సూచించింది కూడా. శ్రీనగర్ ప్రజల ప్రత్యక్ష ప్రమేయం, రాష్ట్ర ప్రభుత్వ కృతనిశ్చయం. తోడై డాల్ సరస్సు పునర్వైభవాన్ని పుణికి పుచ్చుకుంటుందని ఆశిద్దాం. ★



సులభంగా కంటి సమస్యల పరిష్కారం

డా॥ బి.సుబ్బారావు,
ఎస్.కె.సూపర్ స్పెషాలిటీ లేజర్ హాస్పిటల్, విజయవాడ

యాగ్‌లేజర్ అనేది ఒక క్రిష్టల్ లేజర్. ఇట్రియమ్, అల్యూమినమ్, గార్నెట్ అనే మూడు రకాల మిశ్రమంతో తయారైన స్ఫటికమును విద్యుత్‌తో ప్రేరేపించటం వలన మన కంటికి కనిపించని రీతిలో పరారుణ కిరణాలు వస్తాయి. వీటిని ఒకే దిశలో ప్రయాణింప చేసి కావలసిన చోట, కటకాల ద్వారా కేంద్రీకరింప చేస్తాము. ఇందులో కొన్ని సెకనుల సమయం అనంతమైన శక్తి విడుదలవుతుంది. ఈ శక్తి వలన పొర విచ్ఛిన్నమై ప్లాస్మా లాంటి పదార్థంగా మారుతుంది. ఆ లేజర్ పడిన చోట షాక్ వేవ్స్ కూడా ఉద్భవించి ఆ పొర చిట్లిపోతుంది. చుట్టుపక్కల వున్న కణజాలానికి దెబ్బ తగలకుండా లేజర్ ఫోకస్ అయిన చోట మాత్రమే దాని ప్రభావం వుంటుంది. అందువలననే ఈ లేజరును 'ఫొటో డిజరప్టర్' టైప్ లేజర్ అంటాము. ప్రస్తుతం ప్రపంచ మంతటా వీటిని విరివిగా వాడుతున్నారు.

యాగ్‌లేజర్ వలన కంటికి వచ్చే అనేక రకాలైన సమస్యలను సరిదిద్దవచ్చును. మామూలుగా అయితే ఆపరేషన్ చేయించుకొని హాస్పిటల్‌లో ఉండవలసిన కంటి సమస్యలకు ఆపరేషన్ లేకుండానే ఒక నిమిషంలోనే సమస్యను ఈ యాగ్ లేజర్‌తో సరి చేయవచ్చును. దీనినే యాగ్ లేజర్ సర్జరీ అంటాము. దీనిని ముఖ్యంగా ఈ దిగువ సమస్యల పరిష్కారానికి ఉపయోగిస్తారు.

1. పోస్టీరియర్ కాప్స్యూల్ ఒపాసిటీని కరిగించుటకు:

సాధారణంగా ఇపుడు కాటరాక్ట్ (శుక్లము) ఆపరేషన్ అయిన తరువాత కంటి లోపల ప్లాస్టిక్ అద్దాన్ని అమర్చుతాము. దీనిని ఐ.ఓ.ఎల్. ఇంప్లాన్‌టేషన్ అంటాము. శుక్లము తీసిన తరువాత శుక్లము యొక్క లోపలి పొరను అలాగే వుంచి మిగతా శుక్లము భాగాన్ని తీస్తాము. ఈ పొరమీద కంటికి సరిపోయే ఐ.ఒ.ఎల్. (ప్లాస్టిక్ అద్దాన్ని) అమర్చుతాము. ఈ పొర లేకుంటే అద్దాన్ని అమర్చడం కష్టతరమవుతుంది. ఈ పొర నూటికి 90 మందికి పారదర్శకంగానే ఉంటుంది. అందువలన ఇమేజ్ (ప్రతిబింబము) కంటి లోపలి చూపు కేంద్రానికి చేరి అచట నుంచి కంటి నరము ద్వారా మెదడులో విశ్లేషించబడుతుంది. ఈ పొర పారదర్శకత కొంత మందిలో అంటే నూటికి 20 నుండి 35 మందిలో క్రమక్రమంగా తగ్గిపోయి చూపు మసకబారుతుంది. దీనినే పోస్టీరియల్ కాప్స్యూల్ ఒపాసిటీ వల్ల దృష్టి మందగించడం అంటాము. దీనికి చికిత్స రెండు విధాలుగా చేయవచ్చు. ఒకటి శస్త్ర చికిత్స ద్వారా ఆ పొరను కత్తిరించడం. చాలా పలుచగా వుంటే వాడి పారేసే సూదిని కంటిలోనికి చొప్పించి పొరను చిరిగేటట్లు చేస్తాము. దీనిని డెస్సిషన్ ఆఫ్ పోస్టీరియర్ కాప్స్యూల్ అంటాము. ఒక్కోసారి దీనివలన కంటిలోని ఐ.ఓ.ఎల్.కు ప్రమాదం జరగవచ్చు. అంతేకాకుండా ఆపరేషన్ థియేటర్‌లో అన్ని రకాల అస్పెటిక్ ప్రికాషన్స్ తీసుకొని మామూలు కంటి ఆపరేషను లాగా బెడ్ మీద, మైక్రోస్కోపు సహాయంతో చేయవలసి వుంటుంది. అలాగే ఏ మాత్రం సరిగా చేయకుంటే అనేక రకాల ఆపరేటివ్ కాంప్లికేషన్స్ వచ్చే అవకాశమున్నది. పొర చాలా మందంగా వుంటే నీడిల్‌తో చేయలేము. అపుడు దీనికి 'విట్రియాక్టమీ' అనే మిషన్‌ను ఉపయోగించి 'మెంబ్రానెక్టమీ' అనే చికిత్స చేసి ఆ పొరను తొలగిస్తాము. ఈ చికిత్స చాలా ఖరీదు, ఎక్కువగా కంటికి కాంప్లికేషన్స్ వచ్చే అవకాశమున్నది. ఈ సమస్యలన్నీ లేకుండా కొద్ది నిముషాలలోనే ఈ పొరను అనుకున్నంత సైజులో ఖచ్చితంగా ఈ లేజరుతో కరిగించవచ్చు. అందువలన కంటికి వచ్చే కాంప్లికేషన్స్ చాలా వరకు తగ్గిపోతాయి. అంతేకాకుండా కంటికి ఏ మాత్రం గాయం వుండదు. చేసిన రెండవ నిముషములోనే ఇంటికి వెళ్ళవచ్చును. అదే ఆపరేషన్ చేస్తే కంటి లోపలి విట్రియస్, లెన్స్ ఎక్కువ డిస్టర్‌బెన్స్ జరిగి కంటి చూపు కేంద్రం వీక్ అయిపోవుట (దీనినే సిస్టాయిడ్ మాక్యులార్ ఎడెమా) అంటాము. అందువలన చూపు మరీతగ్గే అవకాశమున్నది. యాగ్‌లేజరు వలన చాలా చాలా తక్కువగా ఇలాంటి సమస్యలు వచ్చే అవకాశమున్నది. అంతేకాకుండా 2 నుండి 3 మీ.మీ. ఏరియాలో మాత్రమే లేజరు ద్వారా ఈ పొరను కరిగిస్తాము. అది కూడా సెంట్రల్ ఏరియాలో చేస్తాము. మిగతా పొర అంతా సక్రమంగా ఉండటం వలన కంటి లోపలి అద్దానికి డిస్టర్‌బెన్స్, డామేజ్ జరగదు. యాగ్‌లేజర్ సహాయంతో ఐ.ఓ.ఎల్.కు ఏ మాత్రం డామేజ్ కాకుండా పొరను కరిగించవచ్చు. అలాగే కంటి ఐ.ఓ.ఎల్. మీద ఏమైనా పిగ్మెంట్ డస్ట్ లాగా వుంటే దానిని కూడా ఈ లేజరుతో శుభ్రము చేసి చూపు ఇంప్రూవ్ చెయ్యవచ్చు.

ఈ పొర కరిగించిన వెంటనే చూపు తేడా వుంటుంది. అలాగే లేజర్ అయిన తరువాత 4 లేక 5 రోజులు మందులు వాడితే ఆ కరిగించిన ముక్కల వలన కంటి లోపల సమస్యలు రాకుండా ఉంటాయి. సాధారణంగా టిమోలాల్ మాలియేట్ 0.50 శాతం కంటి చుక్కల మందును లేజర్ చెయ్యక ముందు ఒక చుక్క వేస్తాము. అలాగే నొప్పి లేకుండా ఉండేందుకు నిములాసైడ్ ఒక టాబ్లెట్ కూడా ఇస్తాము. లేజర్ అయిన వెంటనే టిమోలాల్ చుక్కల మందు మరొక చుక్క వేసి, డైమాక్స్ అనే టాబ్లెట్ ఇస్తాము. ఈ టాబ్లెట్‌ను ఉదయం ఒకటి, సాయంకాలం ఒకటి చొప్పున మూడు రోజులు వాడవలసి ఉంటుంది. అలాగే బెట్నెసాల్-ఎన్ అనే చుక్కల మందును రోజుకు మూడుసార్లు నాలుగు రోజులు వాడితే చాలా మంచిది. లేజర్ ట్రీట్‌మెంట్ అయిన తరువాత మరుసటి రోజు ఒకసారి వచ్చి పరీక్ష చేయించుకుంటే చాలా మంచిది. అలాగే కంటి అద్దాల పవరు పరీక్ష కూడా చేయించుకొని అవసరమైతే కళ్ళజోడు మార్చుకుంటే చూపు స్పష్టత మరింత పెరిగే అవకాశమున్నది.

2. యాగ్‌లేజర్‌తో నీటి కాసులకు చికిత్స :

ముఖ్యంగా రెండు రకాల నీటికాసులు ఉంటాయి. వీటిలో ఆంగిల్ క్లోజ్డ్ గ్లాకోమా అనే జబ్బు వస్తే విపరీతమైన తలనొప్పి వస్తుంది. కన్ను

ఎర్రపడిపోతుంది. చూపు అకస్మాత్తుగా తగ్గిపోతుంది. లైటును చూస్తే వలయాలుగా కన్పిస్తాయి. కంటిపాప పెద్దది అయిపోయి వెలుతురుకు కూడా స్పందించదు. దీనిని ఆక్యులార్ ఎమర్జెన్సీ క్రింద భావించి అర్జంటుగా ట్రీటుమెంటు ఇవ్వాలి. ఎందుకంటే మామూలుగా 16 మిమి ప్రెషర్ ఉండాల్సింది ఉన్నట్లుండి 70 లేక 80 మిమికి పెరుగుతుంది. అలా వదిలేస్తే 24 గంటల నుంచి 48 గంటలలో చూపు పూర్తిగా పోయే అవకాశమున్నది. దీనిని ముందుగా కంట్లో ఫిలోకార్పైన్ 2 లేక ప్రొపైన్ హెచ్‌సిఎల్ కంటి చుక్కల మందు మరియు టిమొలాల్ చుక్కల మందు వేసి ఐ.వి. 20 శాతం మన్నిటాల్ ద్రవము ఇచ్చి నోటిద్వారా దయామాక్స్ టాబ్లెట్స్ యిచ్చి కంటిలోని ప్రెజర్‌ను తగ్గించి వెంటనే ఐరిడెక్టమీ అనే ఆపరేషన్ చెయ్యాలి. కాని ఇదే ట్రీట్‌మెంటును యాగ్‌లేజరు సహాయంతో ఆపరేషన్ లేకుండా ఐరిడాటమి చేస్తాము. అంతే కాకుండా వెంటనే స్పందన తెలుస్తుంది. కంటికి ఏ మాత్రం బాధ వుండదు. వెంటనే ఇంటికి వెళ్ళవచ్చు. అయితే వెళ్ళే ముందు రోగి రెండవ కన్ను పరిస్థితి కూడా అంచనా వేసి, ముందుగా వచ్చిన ఇటువంటి జబ్బు రాకుండా బాగా వున్న కన్నుకు కూడా యాగ్ లేజరు సహాయంతో ఇరిడెక్టమి తప్పనిసరిగా చెయ్యవలసి వుంటుంది. దీనినే ప్రొఫిలెక్టిక్ ఐరిడెక్టమీ అంటారు. గ్లాకోమా రాకుండా నిరోధించేందుకు ఇది తోడ్పడుతుంది. అంతేకాకుండా ఐరిస్‌కు ఒక అదనపు ఐరిడాక్టమీ కూడా చేస్తాము. ఒకవేళ పని చెయ్యకపోయినా ఇంకొక ఐరిడాటమి పని చేసేందుకు వీలుగా వుంటుంది. దీనికి కూడా యాగ్ లేజర్ చికిత్స చేస్తాము. అలాగే ఈ 'ఐరిడాటమి'ని ఇంకా అనేక రకాల గ్లాకోమా జబ్బులలో కూడా వాడవలసి వుంటుంది. వీటన్నింటికి కూడా యాగ్‌లేజర్ ఐరిడాటమి సులభంగాను, కష్టం లేకుండా చేస్తాము. పేషంటు వెంటనే తన విధులకు వెళ్ళవచ్చు.

3. ఐరిడెక్టమి ఇన్ ప్యుపిల్లరీ బ్లాక్ గ్లాకోమా :

సాధారణంగా చేసేటటువంటి కాటరాక్ట్ ఆపరేషన్ చేసిన తరువాత కంటి లోపల అద్దం అమర్చుకొన్న కొన్ని గంటల నుండి కొన్ని రోజులలో కొందరిలో ఎప్పుడైనా ఇది సంభవించవచ్చు. అంటే అకస్మాత్తుగా కంటిలోని ప్రెజరు సాధారణంగా ఉండవలసిన 16 ఎమ్ఎమ్ 30 నుండి 50 లేక 60 ఎమ్ఎమ్ వరకు పెరగవచ్చు. అటువంటప్పుడు ఈ యాగ్ లేజరుతో ట్రీట్‌మెంటు చేస్తే వెంటనే ప్రెజరు తగ్గిపోతుంది. దీనితోబాటు మందులు కూడా వాడతాము.

4. సైనెబియాలిసిస్ : ఐరిస్ పొరకు, ఐ.ఓ.ఎల్.కు లేక ఐరిస్ పొరకు కంటిలోని కటకానికి మధ్య కొన్ని జబ్బుల వలన లేక కొన్ని సార్లు పుట్టకతోనే ఐరిస్ పొర అతుక్కొని ఉంటుంది. ఈ అతుకుల వలన ఐరిస్ స్పందన తగ్గిపోయి వెలుతురుకు అనుగుణంగా స్పందించలేదు. ఒక్కోసారి కంటిలోని ప్రెజరు కూడా పెరుగుతుంది. అంతేకాకుండా చూపుకు కూడా అడ్డుపడుతుంది. దీనిని నివారించుటకు యాగ్ లేజరుతో ట్రీటుమెంటు చేస్తాము. లేజరు ఫోకస్ పాయింటుకు ఆంటీరియర్ ఆఫ్‌సెట్ టెక్నిక్ వాడి వాటిని తొలగిస్తాము. ఈ ఆంటీరియర్ ఆఫ్‌సెట్ కనీసం 500 మైక్రాన్ల వరకు ఉంటుంది.

5. ప్యూపిల్లర్ మెంబ్రానెక్టమీ : కంటి నల్లపాప వెనకాల ఐరిస్ పొర మధ్యలో ప్యూపిల్ వుంటుంది. దాని వెనక లెన్స్ వుంటుంది. ఒకోసారి ఆపరేషన్ అయిన తర్వాత, లేక కొన్ని గాయాల వలన, లేక కొంత ఐరిటిస్ రియాక్షన్ వలన లెన్స్ లోని కొంత భాగం మిగిలి, గట్టి పొర వలే ఏర్పడుతుంది. దీనినే ఆఫ్టర్ కాటరాక్ట్ అని కూడా అంటాము. ఒకోసారి ఐరిటిస్ ఎక్కువగా వస్తే (ఆపరేషన్ అయిన కండ్లలో కూడా) ఈ పొర ఏర్పడవచ్చు. ఈ పొరను క్లియర్ చేసి చూపు మెరుగుపరచవచ్చును. కంటి లోపల నరములో ఎంత శక్తి వుంటుందో అంతమేరకు చూపును మెరుగుపరచవచ్చును. మామూలు సర్జరీలో అయితే చెయ్యటం కష్టం. అంతేకాకుండా రియాక్షన్ కూడా ఎక్కువ అయ్యే ప్రమాదమున్నది. అందువలన యాగ్‌లేజరుతో చేస్తుంటాము.

యాగ్‌లేజర్ చేసే పద్ధతి లేక విధానము : ఇందులో ముందుగా పేషెంటును పరీక్ష చేసి ఏ కన్నుకు ఏ విధమైన ట్రీటుమెంటు చెయ్యాలో నిర్ధారిస్తాము. తరువాత పేషెంటును లేజరు మిషన్ దగ్గర సక్రమంగా కంటి పొజిషన్ ఉండేటట్లు సర్దుబాటు చేస్తాము. కంటిలో ప్రొపెరకైన్ 0.75 శాతం అనే చుక్కల మందు రెండు చుక్కలు వేస్తాము తరువాత రెండు నిమిషాల తరువాత మరలా వేస్తాము. తరువాత యాగ్‌లేజర్ కోసం స్పెషల్ లెన్స్‌ను అమర్చుతాము. అబ్రిహాన్ కాప్సులేటమి లెన్స్‌ను పోస్టీరియర్ కాప్స్యూల్ పొరను కరిగించుటకు వాడుతాము. అబ్రిహాన్ ఇరిడోటమి అనే లెన్స్‌ను గ్లాకోమా చికిత్సలో వాడతాము. లెన్స్ వాడటం వలన తక్కువ పవర్‌తోనే పొరలను కరిగించవచ్చు. అలాగే కన్ను అటూ ఇటూ కదలకుండా ఈ లెన్స్‌లో స్టెబిలైజ్ చేస్తాము. అందువలన కరక్ట్‌గా లేజర్ అనుకొన్న చోట రిలీజ్ అవుతుంది. లెన్స్ లేకుండా కూడా చెయ్యవచ్చు. కాని కొంత లేజర్ పవర్ ఎక్కువ వాడవలసి వుంటుంది. లేజరు ట్రీట్‌మెంట్ తరువాత తప్పనిసరిగా కంటిలోని ప్రెజరు తగ్గించే టీమొలాల్ మాలియేట్ చుక్కల మందు, దయామోక్స్ టాబ్లెట్స్, బెట్నెసాల్-ఎన్ చుక్కల మందు రోజుకి మూడు లేక నాలుగు సార్లు వాడటం వలన లేజరు వలన కలిగే సైడ్ ఎఫెక్ట్స్ కలుగకుండా ఉంటాయి. పేషెంటు హాస్పిటల్‌లో వుండాల్సిన అవసరం లేదు.

యాగ్‌లేజరుతో మరికొన్ని ఉపయోగాలు : దీనిని స్పెషల్ లెన్స్‌ను ఉపయోగించి విట్రియస్‌లో వున్న పొరలను కూడా కరిగించి, విడగొట్టి, రెటీనామీద ఈ పొరల దుష్ప్రభావాన్ని తొలగించవచ్చు. అలాగే కొంత చూపు కూడా మెరుగయ్యే అవకాశమున్నది. ఎందుకంటే చూపు కేంద్రానికి ఎదురుగా వుండే అడ్డంకి కొంత తొలగడం వలన అలా జరుగుతుంది. ★



నా వయస్సు 20 సం॥లు ఆరేళ్ళ క్రితం మెచ్యూర్ అయ్యాను. ఇటీవల రెండు నెలలకు ఒకసారి గాని, నెలకు గాని మెన్సస్ వస్తోంది. కాని విపరీతమైన కడుపునొప్పి ఉంటోంది. దీనివలన పిల్లలు పుట్టరని అంటున్నారు నిజమేనా?

- శ్రీ జ్యోతి, విశాఖ

మీకున్న ప్రాబ్లంను డిస్‌మెనోరియా అని అంటారు. అంటే పీరియడ్స్ టైమ్‌లో పొత్తి కడుపులో నొప్పి రావటం. ఇది చాలామందిలో సహజంగా ఉంటుంది. దీనికి, పిల్లలుపుట్టక పోవటానికి ఎటువంటి సంబంధంలేదు.

నా వయస్సు 20 సం॥లు. నేను అందంగానే ఉన్నా చాలా సన్నగా ఉంటాను. అన్ని రకాల పోషక పదార్థాలు తీసుకుంటున్నప్పటికీ నేను లావు కావడం లేదు ఎందుకు? తగు పరిష్కారం చెప్పండి.

- తులసి, విశాఖ

మీ ఎత్తు, బరువు ఎంతో రాయలేదు. మీరు సన్నగా ఉన్నా ఆరోగ్యంగా ఉంటే ఏ ఇబ్బందీ ఉండదు. ఇంకా లావు పెరగాలంటే పాలు, కోడిగుడ్లు, ఆకుకూరలు, పండ్లు లాంటి మంచి పోషకాహారం తీసుకోవాలి. దీనికి ప్రత్యేకంగా మందులేమీ ఉండవు.

డాక్టర్ చెరుకూరి సమత,
ఎం.బి.బి.ఎస్.,ఎం.డి.,(ఒబిఅండ్‌జి)
ప్రసూతి మరియు స్త్రీల వైద్యనిపుణులు, ఒంగోలు

★★★

చెవిలో దిమ్ముగా వుంటుంది. దానిని కదిలిస్తే చీము కారిపోయి మళ్ళీ దిమ్ముగా వుంటుంది. చెవిలో దురద బాగా వుంటుంది. నివారణ తెలియజేయండి

- ఎం.వీరయ్య, పేర్నమిట్ట

మీకు ఇలా చాలాకాలం నుండి చీము కారుతుంటే దానిని సి.ఎస్.ఓ.ఎమ్. లేదా సబ్ ఎక్యూట్ క్రానిక్ ఓటైటిస్ మీడియా అంటారు. దీనికి కారణం మధ్య చెవిలో చీము చేరటం. కర్ణభేరికి రంధ్రం పడి ఆ చీము బైటికి రావడం. దీనికి పూర్తి నివారణ మెస్టాయిడెక్టమీ అనే ఆపరేషన్ చేయడమే. అసలు మీకు వున్నది సి.ఎస్.ఓ.ఎమ్. లేక ఇంకేదైనా అనే విషయం తెల్సాలి. మీరు మీకు అందుబాటులో వున్న ఇ.ఎన్.టి. వైద్యుని సంప్రదించటం మంచిది.

డాక్టర్ పి.అజయ్‌కుమార్
డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల, నెల్లూరు

ఎందుకింత చులకన

అంపశయ్య నవీన్

"పాకిస్తాన్ అధ్యక్షుడు జనరల్ ముషరఫ్ గారు మన ప్రధానమంత్రినుద్దేశించి మేం గాజులు తొడుక్కొని లేం"! అన్నార్ట... గాజులు తొడుక్కునే వాళ్లంటే ఆయన దృష్టిలో అంత చులకనయిపోయారా? గాజులు తొడుక్కునే వాళ్ళంటే ఆడవాళ్ళు అనేగా ఆయన ఉద్దేశం... ఆడవాళ్ళంటే ఒట్టి పిరికివాళ్ళు... వాళ్ళు యుద్ధం చెయ్యలేరు.. ఈజీగా లొంగిపోతారు.. వేం అలాంటివాళ్ళం కాదు అనేగా ఆయన చెప్పదల్చుకున్నది... అన్ని రంగాల్లోనూ స్త్రీలు పురుషులతో సమానులేనని రుజువైన ఈ ఇరవయ్యొకటవ శతాబ్దంలో కూడా స్త్రీలను ఇలా చులకన చేసి మాట్లాడటమేమిటండీ!" అంటూ వచ్చాడు మా పక్కింటి పుల్లారావు.

"అవును. మీరన్నమాట చాలా నిజం... స్త్రీలను చులకన చేసి మాట్లాడటం.. స్త్రీలను అవమానపరచే కొన్ని సామెతల్ని ఉదహరించటం మన పురుషాధిక్య సమాజంలో సర్వసాధారణమైపోయింది. మీరు మరో మాట కూడా వినే వుంటారు..." అన్నాన్నేను.

"ఏమిటది?"

"బిన్‌లాడెన్‌నూ, తాలీబాన్లను వెనకేసుకొస్తూ, వాళ్ళను వ్యతిరేకిస్తున్న వాళ్ళందరూ ఇస్లామ్ మతానికి శత్రువులంటూ, వాళ్ళమీద ముస్లిమ్‌లందరూ "జిహాద్" (పవిత్రయుద్ధం) ప్రకటించాలని పదేపదే చెబుతున్న ఢిల్లీ జుమామసీద్ మతాధిపతి అహ్మద్ బుఖారీనుద్దేశిస్తూ ప్రఖ్యాత సినిమా నటి షబ్నా అజ్మీ "అహ్మద్ బుఖారీని తీసికెళ్ళి ఆఫ్ఘనిస్తాన్‌లోని కాందహార్ ఎడారుల్లో పడేసొస్తే ఆయన సమస్యాతీరుతుంది, మన సమస్యా తీరుతుంది" అన్నారు - అందుకు అహ్మద్ బుఖారి ఏమన్నాడో మొన్న టీవీలో చూళ్ళేదా మీరు? "షబనా అజ్మీ ఒక ఆడేపాడే 'తవాయిఫ్' అన్నాడు. 'తవాయిఫ్' అంటే వేశ్య అనే అర్థం కూడా వుంది. సినిమాల్లో నటించే వాళ్ళందరూ ఆటగత్తెలు, పాటగత్తెలు, వేశ్యలు అనే అర్థం వచ్చేలా అహ్మద్ బుఖారీ మాట్లాడాడు... అలా అనడం కూడా స్త్రీలను అవమానించడమే... స్త్రీలు వంటగదికి మాత్రమే పరిమితమైపోవాలి తప్ప బయటి ప్రపంచంలోకొచ్చి ప్రజాజీవితంలో పాలుపంచుకోవద్దన్నది ఇప్పటికీ చాలామంది పురుష పుంగవుల అభిప్రాయం... ప్రజాజీవితమంటే.. అది రాజకీయరంగం కావొచ్చు... ఉద్యోగరంగం కావొచ్చు.. సినిమా రంగం కావొచ్చు.. ఈ రంగాల్లో కొచ్చిన స్త్రీలందర్నీ చిన్న చూపు చూడటం, వాళ్ళను అవమానపరచడం, వాళ్ళను గూర్చి పుకార్లను సృష్టించి ప్రచారం చెయ్యడం ఈనాటికీ జరుగుతూనే వుంది. షబ్నా అజ్మీలాంటి ప్రజాజీవితంలో ఎంతో గౌరవనీయ స్థానాన్ని పొందిన స్త్రీని 'తవాయిఫ్' అనడం ఈనాటిక్కూడా పురుషులు స్త్రీలను ఏ దృష్టితో చూస్తున్నారో తెలియజేస్తున్నది. షబ్నా అజ్మీ అహ్మద్ బుఖారీని కాందహార్ ఎడారుల్లో దింపేసి వస్తే ఆయన సమస్య, మన సమస్య కూడా తీరుతుంది అనడం తీవ్రమైన విమర్శే కావొచ్చు.. అందుకు అహ్మద్ బుఖారీ కూడా తీవ్రస్థాయిలోనే సమాధానం చెప్పొచ్చు. ప్రజాస్వామ్యంలో మనను విమర్శించిన వాళ్ళకు సమాధానం చెప్పే హక్కు మనకుంటుంది... వాదానికి, ప్రతివాదానికి తావుంటుంది. అయితే అది సంస్కారయుతంగా జరగాలి. బూతులు తిట్టుకునే స్థాయికి దిగజారకూడదు. "గాజులు తొడుక్కొని కూర్చోలేదు" "ఆడేపాడే తవాయిఫ్" లాంటి మాటల్ని మన దైనందిన నిఘంటువుల్లోంచి తొలగించాలి... ఈ రెండు మాటల్నే కాదు... స్త్రీలను అవమానించడం కోసం సృష్టించబడిన ఇంకెన్నో మాటల్ని కూడా తొలగించాలి. ఇద్దరు వ్యక్తులు బూతులు తిట్టుకుంటున్నప్పుడు గమనించండి... వాళ్ళు తిట్టుకునే తిట్లలో నూటికి తొంభైతొమ్మిది తిట్లు ఆడవాళ్ళను అవమానించే తిట్లే ఉంటాయి. ఒకవైపు స్త్రీలను మాతృమూర్తులు, త్యాగమూర్తులు, సహన శీలురు అంటూనే మరోవైపు వాళ్ళను అనుక్షణం అవమానించడం మనకు అలవాటై పోయింది. ఎన్ని మారినా పురుషుల్లోని స్త్రీని నీచంగా చూసే ఈ కుళ్ళు సంప్రదాయం మాత్రం మారడం లేదు"

"ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబాన్లు అధికారంలోకొచ్చాక అక్కడి స్త్రీల పరిస్థితి చాలా దయనీయంగా మారిపోయిందట కదా..."

"అవును... ఉద్యోగాలు చేస్తున్న స్త్రీలనందర్నీ ఉద్యోగాల్లోంచి తీసేశారు.. ప్రతి స్త్రీ కూడా విధిగా బురఖా ధరించాలన్న నిబంధన విధించారు. అన్నింటికంటే దారుణమైన విషయమేమిటంటే ఆడపిల్లల్ని అసలు చదివించనే వద్దన్న నిబంధన విధించడం... ఆడపిల్లలు చదువుకునే స్కూళ్ళను, కాలేజీలను మూసేయించారు... స్త్రీని పూర్తిగా వంటింటికే పరిమితం చేశారు. అలా అఫ్ఘనిస్తాన్‌ను ఐదారు వందల సంవత్సరాలు వెనక్కి తీసుకెళ్ళారు... ఆఫ్ఘనిస్తాన్‌లో మతఛాందసం అనేది ఎంతగా ముదిరిపోయిందో స్త్రీల పట్ల అక్కడి ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ విధానం రుజువు చేస్తుంది. ఆధునిక యుగ ప్రధాన లక్షణమేమిటంటే సమాజం మీద మత ప్రాబల్యం పూర్తిగా తగ్గిపోవడం... మతం సమాజాన్ని శాసించడమన్నది మధ్యయుగాల లక్షణం. ఏ రకమైన మత ఛాందసమైనా అత్యంత ప్రమాదకరమైంది.. అది హిందూమత ఛాందసమైనా, క్రిస్టియన్ మతఛాందసమైనా, ఇస్లాం మత ఛాందసమైనా.... అదొక ఛాందసంగా మారి ప్రజలు ఈ విధంగానే డ్రెస్ చేసుకోవాలి, ఈ విధంగానే మాట్లాడాలని, ఈ విధంగానే గడ్డాలూ, మీసాలూ పెంచుకోవాలని, పురుషులు మాత్రమే స్కూళ్ళకు వెళ్ళి చదువుకోవాలని, స్త్రీలు మాత్రం చదువుకోకూడదని శాసించడం సమాజాన్ని కొన్ని వందల సంవత్సరాలు వెనక్కి తీసుకుపోతుంది - మతం అనేది పూర్తిగా వ్యక్తిగతం అయినంత వరకు దానివల్ల ప్రమాదం లేదు -కానీ అదొక వ్యవస్థీకృతమైన విభాగంగా మారిపోయి మా మతమే గొప్పది... మిగతా మతాలన్నీ చెత్తవి... అందరూ మా మతంలోనే చేరాలి... మా మత నియమాల్నే అనుసరించాలి... అలా అనుసరించకపోతే కఠినంగా శిక్షిస్తాం అనేంతవరకు ఏ మతమైనా సరే వెళ్ళిందంటే అవి మానవాళికి చాలా చెడ్డరోజులవుతాయి.. ఇవ్వాళ్ళ ప్రజాస్వామ్యం అనేది ప్రపంచమంతటా వ్యాపించింది. ప్రజాస్వామ్యంలో స్త్రీలకూ, పురుషులకూ అన్ని రంగాల్లోనూ సమానమైన ప్రాతినిధ్యం కల్పించబడింది. ప్రజాస్వామ్యంలో వ్యక్తి స్వేచ్ఛకు అత్యంత ప్రాధాన్యం ఉంటుంది... మత ఛాందసానికి ప్రజాస్వామ్యంలో చోటు ఉండకూడదు.. భవిష్యత్తులో మానవాళికి అన్నింటికంటే పెద్ద ప్రమాదం ఈ మత ఛాందసం వల్లనే కల్గుతుందని ఇప్పుడు ఎంతో మంది మేధావులు ఆందోళన చెందుతున్నారు" అన్నాన్నేను. ★

సామాజిక ప్రయోజనాన్ని ఆశించేదే నిజమైన నాటకం

బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి

'ఇప్పుడు తెలుగునాటక రంగ పురోభివృద్ధికి ప్రభుత్వాల ప్రోత్సాహం, సహకారం ఎంతో అవసరం. కానీ కేవలం పోటీలు నిర్వహించడం ద్వారా మాత్రమే నాటకరంగం అభివృద్ధి చెందదు. నాటకం ప్రజాదరణకు దూరం కావడానికి కారణం అవి మౌలిక ప్రయోజనాన్ని వెలికితీయకపోవడమే. అందుకే కొన్ని సమాజాలను ఎంపిక చేసి వారికి శిక్షణనిచ్చేందుకు ప్రత్యేకంగా ప్రభుత్వం ఉపాధ్యాయులను నియమించాలి. త్రిపురారిభట్ల లేకుంటే స్థానం వారు, కిళాంబి కృష్ణమాచార్యులు లేకుంటే పీసపాటి వారు రూపొందేవారు కారు' అని అంటున్నారు బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి.

సుబ్రహ్మణ్యశాస్త్రి అనగానే మనకు ఆయన ధరించిన స్త్రీ పాత్రలు గుర్తుకువస్తాయి. 1938లో కృష్ణాజిల్లా కోడూరులో జన్మించిన ఆయన తండ్రివద్దనే సంగీతం, నాట్యంతో పాటు అలంకార శాస్త్రం, పంచకావ్యాలు అధ్యయనం చేశారు. అందుకే వారి నటనలో జీవత్వం ఉట్టిపడేది. 1953లో ప్రదర్శించిన 'ఖిల్జీ రాజ్యపతనం'లో దేవల పాత్రతో మొదలైన ఆయన స్త్రీ పాత్ర పోషణ అర్ధశతాబ్దంపాటు నిరాటంకంగా కొనసాగింది. ఇటీవల మహబూబ్‌నగర్ జిల్లా పాలెం వచ్చినప్పుడు ఆయనతో మాట్లాడటం జరిగింది...

భరతనాట్యం నేర్చుకున్న మీరు నాటకరంగ ప్రవేశం చేయడానికి కారణం?

నృత్య సంబంధ కార్యక్రమ నిర్వహణలో మాలాంటి వారిని తీసుకొని సోలోలు చేసినప్పుడు ఒకేవ్యక్తి అన్ని పాత్రలు చేయడం వీలుపడదు. నృత్యంలోని గాథాభినయ రీతిలో సామాజిక స్పృహను ఆశించి నాటకాలు వచ్చాయి. నాటకాల్లో ప్రయోగించే అభినయరీతినే నాట్యం అనేవారు. నృత్యం నాటకానికొక అంగం. సంపూర్ణమైనది నాట్యమే. అందుకే నాటకరంగంలోకి వచ్చాను.

పౌరాణికాలు ప్రజలకు దూరం కావడానికి కారణం?

దూరంకావు. కాకపోతే గతంలోలాగా సన్నిహితంగా లేవు. సాంఘిక నాటకాలు పరిషత్తులకే పరిమితమయ్యాయి. రీతిమారి విలువలు తగ్గిన కారణంగానే ప్రేక్షకులకు దూరంగా కనిపిస్తోంది.

టీవీ, సినిమాలు నాటకాన్ని ప్రజలకు దూరం చేశాయని...

బెంగాల్, కన్నడ, తమిళ, మరాఠా రాష్ట్రాల్లో టీవీ, సినిమాల్లేవా? మరి అక్కడ నాటకాలు ఆదరణకు నోచుకుంటున్నాయి కదా. వాటిని కాలానుగుణంగా మార్చేవారు మనవద్ద లేరు. టీవీ, సినిమాల్లో వినోదం ఎక్కువైతే వెగటుపుడుతుంది. నాటకం వినోదం కోసం కాదు. విజ్ఞానం కోసం. నేటి పౌరాణికాల్లో విజ్ఞానం బొత్తిగా లేదు. తులాభారంలో కృష్ణుడు, సత్యభామల వివాదం వల్ల ఎవరికి ప్రయోజనం?

నందినాటకోత్సవాలు నాటకరంగ వికాసానికి ఏ విధంగా తోడ్పడుతాయి?

తోడ్పడుతాయనుకున్నాం కానీ ఆ నమ్మకం కలగడం లేదు. ఏదో ఒకరిద్దరు న్యాయనిర్ణేతలకు నచ్చిన నాటకాలకే అవార్డులివ్వడం వలన ఉత్తమ నంది నాటకాలుగా పిలవబడుతున్నాయి. నిజానికి ఒకరిద్దరు న్యాయనిర్ణేతల మేధాపరిధిలోనే నిర్ణయమవుతున్నాయి తప్ప జనబాహుళ్యానికి ప్రయోజనం కలిగేలా ప్రదర్శితమవడం లేదు.

స్త్రీ పాత్ర పోషణలో మీరెలాంటి సమస్యలు ఎదుర్కొన్నారు?

పెద్దగా సమస్యలంటూ ఏమీ లేవు. నేను స్వంతంగా మూడుగంటల పాటు మేకప్ వేసుకొనే వాడిని. ఇది నటుడికి చూపు, మనసు, భావం, రసం అనే వాటిని యోగసాధన క్రమంలో అంతర్లీనం చేయడానికి ఉపకరిస్తుంది. కనుక వేదికపై పాత్రపోషణకు ఇబ్బంది కలిగేది కాదు.

మీ జీవితంలో మరిచిపోలేని అనుభవం?

చాలా ఉన్నాయి. అందులో ఒకటి. 1972లో అనకాపల్లిలో 'చింతామణి' నాటకం వేసినప్పుడు చివర్లో 'చిత్తజల్లు కృష్ణవేణి' అనే వేశ్య నాటకంలోని నా పాత్రపోషణకు ప్రభావితమై అదే వేదిక మీదకు వచ్చి నేటినుండి ఆ వృత్తిని మానేస్తున్నానని ప్రకటించింది.

మీరు రాసిన గ్రంథాల వివరాలు?

నాట్యవేదం గేయనాటిక, విశ్వదాభిరామం, దళితా భ్యుదయం(పల్నాటి యుద్ధం), దైవం మానస రూపేణా సక్కుబాయి, సంఘ బహిష్కారం, అష్టవిధ నాయికలు, సుందరగీత మాలిక (సుందరకాండ), వివేకానందు, శ్రీనివాసకళ్యాణం రాశాను. ఇప్పుడు కేంద్రప్రభుత్వం వారి కోరిక మేరకు 'ప్రాచీన నాటక విశ్లేషణ' అనే గ్రంథం రాస్తున్నాను.

మీరు వేసిన వాటిల్లో మీకు నచ్చిన పాత్ర ఏది?

దేవల పాత్రతో మొదలుకొని సక్కుబాయి, వరూధిని, పద్మావతి, సత్యభామ, చంద్రమతి, ద్రౌపది, చింతామణి, ప్రమీల, మధురవాణి, పల్లెపడుచుగా రమాదేవి, శకుంతల పాత్రలు చేశాను. వీటిల్లో నాకు నచ్చింది సక్కుబాయి అయితే ప్రజలు మెచ్చింది చింతామణి.

అందుకున్న సన్మానాలు, పురస్కారాలు?

మూడుసార్లు స్థానం వారి పురస్కారం, రాజీవ్‌గాంధీ జాతీయ అవార్డు, తెలుగు-వెలుగులు పురస్కారం, కేంద్రప్రభుత్వం సీనియర్ ఫెలోషిప్ లభించాయి. వీటన్నింటికన్నా ప్రజల ఆదరాభిమానాలే నాకు సంతృప్తినిచ్చాయి.

-ఇంటర్వ్యూ: హెచ్.రమేష్‌బాబు

అతిథులు వచ్చినపుడు పిల్లలెలా వుండాలి?

వి.ఆర్.వాగోలు

సమాజంలో నివసిస్తున్నపుడు చుట్టాలు, బంధువులు, మిత్రులు, సన్నిహితులు ఉండడం సహజం. సమాచార వ్యవస్థలోని విప్లవం కారణంగా ఇప్పుడు దాదాపు ప్రతి యింట్లో ఫోన్ కూడా నిత్యావసరంగా మారిపోయింది. ప్రతి చిన్న విషయానికి ఫోన్‌లో సంభాషించుకోవడం మామూలైపోయింది. ఈ పరిస్థితి వల్ల ఇంతకుముందు వలే చుట్టాలు, బంధువులు, స్నేహితులు ఒకరి ఇళ్ళకు మరొకరు వెళ్ళడం బాగా తగ్గిపోయింది. ఏదైనా మరీ అర్జెంటు పని ఉంటేనే ఒకరి ఇంటికి మరొకరు వెళ్ళడం జరుగుతుంది.

ఇక మన ఇంటికి వచ్చే అతిథులు ఎవరైనా సరే వచ్చిన కొద్దిసేపైనా కాస్తంత ఆనందంగా, ప్రశాంతంగా గడిపి వెళదామనుకుంటారు. వారు ఆశించిన ఆనందం, ప్రశాంతత మన ఇంట్లో ఉండే చిన్నారుల వల్ల దూరమైతే బాగుండదు కదా. కనుకనే అటువంటి సంఘటనలు జరగకుండా కొన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా అటు మన ఇంటికి వచ్చిన అతిథులకు, ఇటు మనకు ఎంతో మర్యాదగా ఉంటుంది.

పిల్లలన్న తర్వాత అల్లరి సహజం. అది ఇంటివరకైతే ఫర్వాలేదు. ఇంటికొచ్చిన అతిథుల ముందు కూడా తమ అల్లరి ప్రదర్శిస్తే వచ్చిన వారు నొచ్చుకొనే ప్రమాదం ఉంది. కొంతమంది పిల్లలు ఎవరైనా ఇంటికి వస్తే వారికి సరైన సమాధానం చెప్పరు. ఏ విషయం అడిగినా తనకేమీ పట్టనట్లు ముభావంగా ఉంటారు. కొంతమంది దురుసుగా సమాధానం చెబుతుంటారు. ఇంటికి వచ్చిన వారు తమ కోసం ఏమైనా తెచ్చారేమోనని ఎదురు చూస్తుంటారు. కొందరేమో కొత్త వారు యింటికి వస్తే తుర్రుమని పారిపోతుంటారు. ఇంకొంతమంది పిల్లలు కొత్త వారున్నపుడు తల్లిదండ్రులను ఏమడిగినా ఇస్తారనే ఉద్దేశంతో తమ కోర్కెలు బయటపెడుతుంటారు. చాక్లెట్లు కావాలనో, బిస్కెట్లు కావాలనో లేక తినుబండారాలు కావాలనో ఇలా ఇతరులున్నపుడు తమ కోర్కెలను బయటపెడుతూ పెద్దలను యిరుకున పెట్టి సాధించుకోవాలని చూస్తారు. సహజ నైపుణ్యాలు కలిగిన బాల కళాకారులు తమ నైపుణ్యాలను యితరుల ఎదుట ప్రదర్శించాలని ఉబలాట పడుతుంటారు. అతిథుల కంట్లో పడాలని, వారు తమను గుర్తించాలని నానా తంటాలుపడుతూ డాన్సులు వేయడం, పాటలు పాడడం, బొమ్మలు వేయడం, ఇతరులను అనుకరించడం వంటి కృత్యాలు చేస్తూ తమ ప్రజ్ఞను ప్రదర్శిస్తుంటారు. కొందరైతే తమ కోర్కెలు తీర్చాలని పట్టుబడుతూ నానా యాగీ చేస్తూ ఇంట్లో వస్తువులన్నీ చెల్లాచెదురు చేస్తుంటాడు. ఏడుస్తూ గందరగోళం సృష్టిస్తారు. కొంతమంది డ్రస్సు కావాలని, సినిమాకు తీసుకెళ్ళమని, విహార యాత్రకు పంపించమని అనేక రకాలుగా విసిగిస్తూ ఉంటారు.

ఒక పక్క యింటికి వచ్చిన అతిథులతో మాట్లాడాలో లేక వీరి అల్లరికి ఫుల్‌స్టాప్ పెట్టాలో తెలియక తల్లిదండ్రులు సతమతమవుతుంటారు. పిల్లల అల్లరికి అతిథులు ఏమనుకుంటారోనని భయపడుతుంటారు. వచ్చిన వారితో మాట్లాడుతున్నాం మీ విషయం తరువాత చూస్తాం అన్నా వినిపించుకోకుండా వీరున్నపుడే తమ కోర్కెలు సాధించుకోవాలనే ఉద్దేశంతో మరింత అల్లరి చేస్తుంటారు. దీనితో తల్లిదండ్రులకే కాక వచ్చిన వారికి కూడా విసుగు పుట్టవచ్చు. తల్లిదండ్రులకు కోపం వచ్చి రెండు అంటిస్తారు. ఆ దెబ్బలతో పిల్లలు నింగీ నేలా ఏకమయ్యేలా ఏడుపు లంకించుకుంటారు. ఇక వారిని సముదాయించలేక సతమతమవుతుంటారు. వచ్చిన అతిథులతో కాస్తంతసేపు మనస్సు విప్పి మాట్లాడలేకపోయామనే బాధ ఇద్దరిలోనూ నెలకొంటుంది. దానికి తోడు కొంతమంది పిల్లలు, పెద్దలు మాట్లాడుకొనే విషయాలు, యితరులకు చెప్పకూడని విషయాలు అందరికీ చెబుతుంటారు.

అయితే ఇంటికి వచ్చిన పెద్దలను, అతిథులను చక్కగా ఆహ్వానించి గౌరవంగా మాట్లాడి యింట్లోకి రమ్మని వారికి కుర్చీలు చూపించి కూర్చోమని చెప్పే బాలబాలికలూ లేకపోలేదు. వచ్చిన వారికి కాసిని మంచి నీళ్ళిచ్చి వారితో కలిసిపోయి వారి ప్రశ్నలకు వినమ్రతతో జవాబిచ్చే బుడతలూ ఉంటారు. మరి తేడా ఎక్కడ ఉంది అని ప్రశ్నించుకుంటే సమాజంలో తొలి పాఠశాల అయిన ఇంట్లోనే ఇటువంటి అలవాట్లు అలవడాల్సి ఉంది. పిల్లలు మన ఇంటికి వచ్చే అతిథుల పట్ల ప్రవర్తించాల్సిన విధానం పిల్లలకు పెద్దలే బోధించాలి. కారణం బాలబాలికలకు తొలి గురువులు తల్లిదండ్రులే. మొక్కై వంగనిది మానై వంగునా అన్నట్లు బాల్యంలోనే మంచి ప్రవర్తనా పద్ధతులు నేర్పాలి.

కొత్త వారెవరైనా ఇంటికి వచ్చినపుడు వినయంగా మీరెవరంకుల్? మీకెవరు కావాలి అంటూ వారిని అడగమని చెప్పాలి. అనంతరం సమాధానాలు కూడా ఎలా చెప్పాలి అనే విషయం నేర్పాలి. ఇదంతా ఒకపూటలోనో లేదా ఒక రోజులోనో జరిగేది కాదు. ఇంటికి వచ్చిన అతిథుల ముందు అతిగా మాట్లాడరాదని, వారడిగే ప్రశ్నలకు నవ్వుతూ సమాధానాలు ఇవ్వాలని వారికి చెప్పాలి. ఇటీవల మేము ఒక మిత్రుని ఇంటికి వెళ్ళినపుడు వారి ఐదేళ్ళ పాప 'మమ్మీ ఆంటీ వాళ్ళొచ్చారు అంటూ' ఇంట్లోకి రండాంటీ కూర్చోండి అంటూ కుర్చీలు చూపించి తాగడానికి మంచినీళ్ళుకూడా తెచ్చి ఇచ్చింది. ఆ పాప చూపించిన ఆతిథ్యానికి మేము ఆశ్చర్య చకితులమయ్యాము. పిల్లలకు తెలియదు. వారికి తెలియజేయాల్సిన బాధ్యత పెద్దలదే. ఇంటికి వచ్చిన వారి ముందు మంకు పట్టుపట్టకూడదని, అలగరాదని, అనవసరంగా గొడవ చేయకూడదని, అలా చేస్తే ఇంటికి వచ్చిన వారు నీవంటే అసహ్యించుకుంటారని, వారు నొచ్చుకుంటారని, కనుక అతిథులు వచ్చినపుడు నెమ్మదిగా ఉండాలని చెప్పాలి. నెమ్మదిగా ఉండడమంటే అసలు మాట్లాడకుండా ఉండడమని కాదు. వారు అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెబుతూ వారితో కలిసిపోయేలా ప్రవర్తిస్తే బాగా మెచ్చుకుంటారని, 'ఫలానా వాళ్ళమ్మాయి లేదా అబ్బాయి చాలా మంచి వారని, ఇతరుల ముందు చెబుతారని, అలా కాక వచ్చిన వారి ముందు గొడవ చేసి అలిగితే వారు బాధపడి రెండవసారి మన ఇంటికి రావాలన్నా రారని, మీ గురించి అందరికీ చెడుగా చెబుతారని చెప్పాలి. మన ప్రవర్తన చూసి ఇతరులు మెచ్చుకోవాలి గాని ఈసడించుకోరాదని, మంచి బాలబాలికలుగా పేరు తెచ్చుకోవాలని నెమ్మది, నెమ్మదిగా చెబుతూ పెద్దల పట్ల, ఇంటికి వచ్చిన వారి పట్ల మెలగాల్సిన పద్ధతులను వివరిస్తే వాటితో బాలబాలికలు మంచి పేరు తెచ్చుకోవడమే కాక ఇంటికి వచ్చిన అతిథులు కూడా పిల్లల ప్రవర్తన పట్ల సంతోషిస్తూ అభినందించకుండా ఉండలేరనడంలో సందేహం లేదు. ★

టీవీ తెచ్చిన తంటా!

శరత్‌కు మార్కులు కాస్త తక్కువగా వచ్చాయని అమ్మా, నాన్న తిట్టారు. అంతటితో ఆగకుండా అక్క సౌమ్యని చూసి బుద్ధితెచ్చుకో అన్నారు కూడా. వాడు ఆ రోజు ఏడుస్తూ స్కూలుకు వెళ్ళాడు. సౌమ్యకు ఇదంతా ఇంకా బాధ కలిగిస్తోంది. అసలు ఆమె దిగులు వేరు. రేపు ఇంగ్లీషు పరీక్ష అనగా నిద్రపట్టడం లేదని రాత్రంతా టీవీ పెట్టుకొని చూసింది. సౌండ్ లేకుండా చూడటం వలన ఇంట్లోవాళ్లు ఎవరూ ఈ విషయాన్ని గమనించలేదు. కానీ దాని ప్రభావం పరీక్షహాల్లో కనవడింది. నిద్ర ముంచుకు వచ్చింది సౌమ్యకు. బలవంతంగా కళ్లు తెరచుకొని రాసినా ఫెయిల్ మార్కులు వచ్చాయి. ఈ విషయం ఇంట్లో తెలిస్తే ఏమన్నా ఉందా? కాస్త తక్కువ మార్కులు వస్తేనే తమ్ముడ్ని అంత తిట్టారే! ఇక ఫెయిల్ అయ్యానని తెలిస్తే ఎలా? అనుకుంటూనే నాలుగు రోజులు గడిపింది.

ఆ రోజు ప్రోగ్రెస్ రిపోర్ట్ ఇచ్చారు. ఆటోలో పిల్లలందరూ ఉన్నారు కానీ సౌమ్య లేదు. క్యారేజీ, బుక్స్‌బ్యాగ్ మాత్రం లోపలే ఉన్నాయి. కంగారుపడ్డ ఆటోడ్రైవర్ వెంటనే సౌమ్య వాళ్ళ ఇంటికి ఫోన్ చేసి సౌమ్య కనిపించడం లేదని చెప్పాడు. వాళ్ల అమ్మ కంగారుగా స్కూల్‌కి వచ్చింది. సమయానికి సౌమ్య వాళ్ల నాన్న కూడా ఊర్లో లేరు. స్కూల్ పరిసర ప్రాంతాల్లో ఎక్కడ వెదికినా సౌమ్య కనిపించలేదు. ఇంగ్లీషులో ఫెయిల్ అయ్యిందని, ఆ భయంతో ఎటైనా వెళ్ళి ఉండవచ్చని టీచర్ చెప్పడంతో అసలు కారణం అర్థమయ్యింది.

అయినా సౌమ్య వాళ్ళ అమ్మకు కోపం రాలేదు. తప్పంతా తమదే అనుకుంది. తమ్ముడిని తిడుతుంటే చూసిన సౌమ్య, తనకు ఫెయిల్ మార్కులు రావడంతో భయానికే ఎటో వెళ్ళిందని ఆమెకు అర్థమయ్యింది. ఒకటి రెండు మార్కులు తక్కువగా వచ్చినంత మాత్రాన అలా తిట్టకుండా ఉండాల్సింది అనుకుంది. స్నేహితుల ఇళ్ళల్లో కూడా వెదికింది. ఊరంతా గాలించినా ప్రయోజనం లేకపోయింది.

అక్కడ సౌమ్య భయంతో ఊరంతా తిరిగింది. చీకటిపడటంతో బాగా భయం వేసింది. అమ్మా, నాన్నా అంటూ ఏడుస్తూ తిరిగింది. అటుగా వస్తున్న ఇద్దరు కాలేజీ విద్యార్థులు సౌమ్యను ఆపి ఎందుకు ఏడుస్తున్నావని అడిగారు. ఏడుస్తూనే విషయం చెప్పింది. సౌమ్య దగ్గర వాళ్ల ఇంటిఫోన్ నెంబర్ తీసుకొని ఫోన్ చేశారు ఆ విద్యార్థులు. వెంటనే సౌమ్యవాళ్ల అమ్మ ఆటోలో వచ్చి తీసుకుపోయింది. అమ్మఒడిలో చేరి వెక్కివెక్కి ఏడ్చింది. ఇలా ఇంకెప్పుడూ చేయనమ్మా అని చెప్పింది. తాము తిడతామనే భయంతో వెళ్ళిపోయిన సౌమ్య తన తప్పు తెలుసుకోవడమే కాకుండా క్షేమంగా ఇంటికి చేరడంతో అంతా ఆనందపడ్డారు.

-యలమర్తి అనూరాధ

'గాడిద తెలివి'

అనగనగా ఒక ఊళ్ళో ఒక చాకలి తన గాడిద కాలి గిట్టలకు ఇనుప నాడాలు బిగించి దానిచేత నానా చాకిరీ చేయించేవాడు. ఒకరోజు గాడిద యజమాని కళ్ళు కప్పి అడవిలోకి పారిపోయింది. అడవిలో దొరికిందల్లా తింటూ సుఖంగానే ఉంటున్న ఆ గాడిద ఒకరోజు సింహానికి ఎదురుపడింది. ధైర్యం తెచ్చుకొని ఏమీ పట్టనట్లుగానే ప్రవర్తించింది. అప్పుడు సింహం గర్జిస్తూ 'నేను ఈ అడవికి రాజుని. నా రాక పట్టించుకోకుండా ప్రవర్తిస్తున్నావెందుకు' అని అడిగింది. దానికి గాడిద 'నువ్వు రాజువు కావు. ఎందుకంటే నేనే ఈ అడవికి రాజుని. కావాలంటే ఇదిగో రుజువు' అంటూ తన కాలికి ఉన్న నాడాలు చూపించింది. ఇవి రాజులు తొడుక్కునే పాదరక్షలు కనుక నేనే రాజుని అని అంది. దీనికి సింహం ఒప్పుకోలేదు. ఒక పందెం వేసుకోవాలనుకున్నాయి. రెండుగంటల్లో ఎవరైతే ఎక్కువ జంతువులను పట్టుకుంటారో వారే రాజు అని తీర్మానించుకున్నాయి. సింహం అడవిలోకి వెళ్ళి కుందేళ్ళు, జింకలు వంటి జంతువులను 15 వరకు వేటాడింది. గాడిద నేల మీద చనిపోయినట్లుగా పడుకొని తన మీద వాలిన పక్షులు, గద్దలు, కాకులను చంపడం మొదలెట్టింది. అవి రెండూ రెండు గంటల తరువాత కలుసుకున్నాయి. సింహం తాను వేటాడిన వాటిని చూపించింది. గాడిద నవ్వుతూ 'నీకంటే నేనేఎక్కువ వాటినిచంపాను చూడు' అంటూ 23 పక్షులను చూపించింది. తర్వాత గాడిదే మాట్లాడుతూ 'నువ్వు నేలమీద బతికేవాటిని చంపావు. నేను ఆకాశంలో ఉండేవాటిని దింపి చంపాను. కనుక నేనేరాజు అంది గాడిద. సింహం ఓటమి భారంతో అక్కడినుండి వెళ్ళిపోయింది. గాడిద బతుకుజీవుడా అంటూ ఆహారసంపాదనకు బయలుదేరింది.

-ఎన్. కృష్ణవేణి, 8వ తరగతి,
రవితేజ పబ్లిక్ స్కూల్, శ్రీనగర్, కాకినాడ-3

తెలుసుకుందాం...!



1. మొట్ట మొదట తయారు చేసిన సైకిల్‌కు పైడిల్స్ లేవు. 1817లో బారన్ వాన్ డ్రైస్ దీనిని తయారు చేశారు. అప్పట్లో ప్రజలు ఈ సైకిల్‌ను పట్టుకొని నడుచుకుంటూ వెళ్ళేవారు.



2. పిల్లలు ఆడుకునే బెలూన్ మొదటిసారిగో వాల్కనైజింగ్ రబ్బర్‌తో తయారయ్యింది. లండన్‌లోని జె.జి.ఇంగ్రామ్ కంపెనీ 1847లో దీన్ని తయారు చేసింది.

3. ఏనుగు పక్కన ఎలుక పిల్లను నిలబెడితే ఎలా ఉంటుంది. వాటి మధ్య చాలా తేడా కనపడుతుంది కదూ. ఒకవేళ మీరు నిజంగా ఏనుగు పక్కన ఎలుక పిల్లను నిలబెట్టినా ఆ విషయం ఏనుగుకు తెలియదు. ఎందుకంటే అతి సమీపంగా ఉన్న ఎలుకను ఏనుగు చూడలేదు.

4. గబ్బిలాల్లో 900 రకాలు ఉన్నాయి. ఇవన్నీ ఎగురుతాయి. అవి ఎగిరేసమయంలో శబ్దం చేసుకుంటూ వెళ్తాయి. ఏదైనా అడ్డం వస్తే ప్రతిసారీ ఎడమవైపే తిరుగుతాయి.

చిన్నారి చిత్రకారులు

శివరామకృష్ణ, 7వతరగతి
ఠాగూర్ విద్యాలయం, వైరా



ఎన్. విజయ్‌కంత్రి, 2వ తరగతి,
శ్రీ విశ్వశాంతి విద్యానికేతన్,
చినకాకాని



పి.వి. రాఘవేంద్ర, 9వతరగతి
ప్రగతి విద్యానికేతన్ స్కూల్,
కంబం, ప్రకాశం జిల్లా



గజం అశోక్‌కుమార్,
9వతరగతి
గాంధీనగర్ కాలనీ,
మెదక్ జిల్లా

మాటలకోట - 33

1	2	✿	3	✿	4			5	✿
✿		✿	6			✿	✿	7	8
✿	9			✿	10	11		✿	
12		✿	13	14	✿		✿	✿	✿
	✿	15	✿		✿	16			17
18			✿	✿	19		✿	✿	
✿	✿	20	21	✿		✿	22		✿
23		✿	24		✿	25		✿	26
	✿	27		✿	28	✿		✿	
29		✿		✿	30		✿	31	

అడ్డం

1. చైనా విప్లవసారథి (2)
4. శ్రీశ్రీని ఈ కవి అంటారు (4)
6. అసహనం వంటిది (3)
7. తల్లి, అమ్మ (2)
9. కల్పించి చెప్పేది (3)
10. తారుమారైన ఆరాటం (3)
12. హారం, దండ (2)
13. పాలస్తీనాలోని ఓ పట్టణం (2)
16. అటు నుండి బాలచందర్ నూరో సినిమా (4)
18. చీకటి (3)
19. ఫోన్ ఎత్తగానే అనేది (2)
20. మచ్చ ఇలా కూడా అంటారు (2)
22. వృషభం (2)
23. పోరాటం (2)
24. నిలువు 21లో 2,3 (2)
25. ల,ల,ల,ల...ఇవేమిటి (2)
27. మధ్యమం కోల్పోయిన జిలేబీ (2)
29. వేలుకు ముందు ఇది కలిపితే ఓ నటుడు (2)
30. రంధ్రం (2)
31. కలం (2)

నిలువు

2. అలవోక...3,1,4,2 (4)
3. ఫ్రీగా (4)
4. కిరీటం (3)
5. మీవని కింది నుండి చెప్పండి (2)
8. పొడి కాదు (2)
11. స్టైలో (4)
12. కోతి (3)
15. ఒక శీతలపానీయం పేరు..కొద్దిగా మారిందంతే (3)
17. వందలో పదో వంతు (2)
19. చేయి (2)
21. గులాబీ...ఒకటి కాదు (4)
22. మూషికం (3)
23. రక్షకభటుడు (3)
26. ఈయన కోసమే అమెరికా యుద్ధం చేస్తోంది (3)
28. వాలం (2)

గతవారం జవాబులు : అడ్డం : 1. ఆనందం 3. లోటుతో 6. తాహతు 7. పంసె 9. నౌసలు 10. బాలేదు 11. కాలా 13. కానుక 15. వాచా 17. సమైక 18. దర్పం 19. కుదర్దు 20. వందనం 23. బావుటా 25. శతకం 27. కదవ 29. పండుగ 32. కృబుడు 33. తంబుర **నిలువు :** 2. దంతాలు 3. లోతు 4. తోకలేదు 5. ధూపం 9. నౌకా 12. లావా 14. కదనం 16. చాకు 17. సర్దుబాటు 21. దవడ 22. చింతపండు 24. టాటా 26. కందు 27. కకో 28. వక్క 30. గతం 31. దార

వండర్ నెంబర్

చిన్నారి బాలలూ,

ఇప్పుడు నేనొక వండర్ నెంబర్‌తో అంకెల తమాషా వివరిస్తాను. 12345679 అనే సంఖ్యను గమనించండి. దీనిలో తమాషా ఏమిటో అర్థమయ్యిందా? అన్నీ వరుస అంకెలే కానీ అందులో'8' తప్పిపోయింది సుమా. ఇప్పుడు ఈ వండర్ నెంబర్‌తో తమాషా చూద్దాం. ఒకటి నుండి తొమ్మిది వరకు గల తొమ్మిది అంకెలలో మీకిష్టమైన అంకెను చెప్పండి. అరె! మీకు నాలుగంటే అంత ఇష్టమా? అయితే ఈ వండర్ నెంబర్‌ని ముప్పై ఆరుతో గుణించండి. మీకు తొమ్మిది అంకెల సంఖ్య వచ్చింది కదూ! ఆ సంఖ్యలో అన్నీ నాల్గులే ఉన్నాయని ఆశ్చర్యపోతున్నారా? ఎందుకంటే మీకు నాలుగు ఇష్టమన్నారుగా. అందుకే అన్నీ నాల్గులతో కూడిన సంఖ్య ఫలితంగా వచ్చేలా చేశా.

12345679×36=444444444

ఇప్పుడు మరో అంకె చెప్పండి. ఉదాహరణకు ఆరు చెప్పారనుకోండి. వండర్ నెంబర్‌ను 54తో గుణించండి.

12345679×54=666666666

భలే తమాషా గదూ. చిటికెలో మీకు నచ్చిన అంకెల సంఖ్యను ఈ వండర్‌నెంబర్‌తో రప్పించాలని కుతూహలంగా ఉందా? మీకు కావాల్సిన అంకె యొక్క 9 గుణిజంతో ఈ వండర్‌నెంబర్‌ను గుణించండి. చిటికెలో మీ అంకెలు ప్రత్య[illegible]. ఇంకేం ప్రయత్నించండి మరి.

-తోటకూర సాయి రామకృష్ణ, మున్సిపల్ హైస్కూల్, సామర్లకోట

కలంస్నేహం

పేరు: అరవింద్ శ్రీవత్స

వయస్సు: 7

చదువు: 2వ తరగతి

హాబీలు: చెస్, క్యారమ్స్ ఆడటం, టీవీ చూడటం, బొమ్మలు గీయడం, సంగీతం వినడం

పూర్తి చిరునామా : సన్నాఫ్ డాక్టర్ ఎస్.వి.ఎల్. నారాయణరావు, 17/84, తివ్వరాజువారి వీధి, నెల్లూరు-524001

హాబీలు: చెస్, క్రికెట్ ఆడటం, జి.కె. పుస్తకాలు చదవడం

పూర్తి చిరునామా : కేరాఫ్ శ్రీ చైతన్య హైస్కూల్, రామన్నపేట, నల్లగొండ జిల్లా

పేరు: గోలి వేణు

వయస్సు: 13

చదువు: 8వ తరగతి

పేరు: గడ్డం మహేష్ కుమార్

వయస్సు: 15

చదువు: 10వ తరగతి

హాబీలు: క్యారమ్స్ ఆడటం, మంచి పుస్తకాలు చదవడం

పూర్తి చిరునామా : సన్నాఫ్ గడ్డం శంకర్, వెంకటేశ్వర పబ్లిక్ స్కూల్, భారత్‌రోడ్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లా-503111

రుక్మిణి

ఊరిబయట ఎండకఖాడా చిటచిటలాడిపోతుంది. అక్కడ జరిగే హడావుడీ... తంతూ చూసి పక్కనే సగం కప్పులతో... మొండి గోడలూ... విసిరేయబడినట్టు మూటగట్టిన దరిద్రం... మాలమాదిగ పోరగాండ్లందరూ కళ్ళు రిక్కరించి బానకడుపులెగరేస్తూ చోద్యం చూస్తున్నారు. వాళ్ళ వయసుతో నిమిత్తం లేకుండా వాళ్ళందరూ దిసమొలలతోనే వేలాడుతూ భయం భయంగానే చూస్తున్నారు. ముసలీ... ముతకా...ఆడామగా ముందు భయభ్రాంతులై ఆనక తేరుకుని పీలికలు వాలికలైన చీరా... పంచే... జాకీటు రవికలు సవరించుకుని ముక్కుల మీద వెళ్ళేసుకున్నారు.

"ఓస్నీ... రండ్రండి... అదుగో... అగ్గగ్గా... మంత్రిగారు వచ్చేస్తున్నారు... జల్దిరావాలె! ఓర్నీ.. ముత్తమ్మా... ఓరినక్కలోడా... ఏమె పాపమ్మా... పోరగాండ్లందర్ని జమ చేయండ్రి... రండెనె.... గాడ 'జలమభూమి'... మీ జలములు ఈ భూమ్మీదనే తరించిపోయే రోజు...!" దుర్గడు మెతకబడ్డ డప్పులా దడదడ.. లొట... లొట.. ఒకటే వాగుతున్నాడు.

"సంబడం... కూల్నాలి పని దొరకటవే లేదు... నెహ్రూ సెంటరుకాడ సుతారి పనికి పోదామంటే... అసలు ఇండ్లే ఎవుడూ కట్టుకోటం లేదట!" ముత్తమ్మ మూతి మూడుసార్లు విరిచింది.

"బియ్యం... కరువు బియ్యం... వరద బియ్యం... అల్లల్లల్ల వచ్చేస్తున్నాయిగానీ... దానికన్నా ముక్యంగిపుడు మన కడజాతి మాలమాదుగులందరికి 'జలమభూమి' వచ్చేసింది..

"ఓర్నియవ్వ... గా పెద చెరువుకాడి బంజరుభూవి తలా ఎకరం ఇచ్చి పారేస్తన్నరా ఏంది? వామ్మో... వామ్మో... దెర్మ ప్రెభువులు.. ఎన్ని దినాలికి గీ మాలమాదుగుల మీద మరింత దయగలిగిందో"! పీచులాంటి తలా....గోచీ... ఒంటిమీద తోలూ చీలికలు పీలికలుగా పీక్కుపోయిన పీరిగాడు లోతు డొక్కల్ని టపటపలాడిస్తూ 'టిస్కో డాన్సు' చేసినంత పని చేశాడు. అయితే దుర్గడు దగ్గర్లో మొండిగోడ లేకపోవడం వల్లా అయితేనేమీ... జలమభూమి బలమైన ప్రభావం వల్లా అయితేనేమీ రెండు చేతుల్తో తలమాత్రం లబలబ బాదుకున్నాడు.

"ఓరి ముసిలోడా.. మన జిల్లా మంత్రిగారు వచ్చేసిండ్రు.. నీ బంజరు భూములకునా... నీకెపుడూ గదేయావ... మన దళిత్తులందరికి దర్జా... గౌరువం.. ఇంగ గవర్మెంటు మన కోసం... మన 'మర్యాద' కాపాడే పని చేస్తుందిరా బాంచెత్! మన గౌరువం కాపాడే వంతు ఇగ మన చెంద్రబాబుగారే చూసుకుంటారు... రండ్రెస్సె... రండ్రి.. జల్దీ...!"

వాడి పురమాయింపుతో మూక... మందలా బిలబిలమని, మాలమాదిగ సైన్యం ఆ మండుటెండలో పోటెత్తిన ప్రవాహంలా... అదిరే గుండెల్ని అరిచేతుల్లో అదిమి పట్టుకుని ఉరుకులు పరుగులతో వెంటబడ్డారు. అంతా అలజడి... ఆత్రం... ఒకవైపు కిరాయి బ్యాండు మేళం దడ దడ మోగిపోతుంది - ఇదే సందురా అని ఇద్దరు పాత డప్పులందుకుని మోతకు తగులుకున్నారు. స్టేజి మీద మంత్రిగారు ఆగలేక అప్పటికే ఉపన్యాసానికి తగులుకున్నాడు.

.... అందుకే మనందరం సమానం... మనందరిది ఒకటే రక్తం... దేవుడి ముందు మనందరం సమానం... మనందరికి దేవుడు సమానం... మీరందరూ రోజు గుళ్ళల్లోకి పోయి పూజలు చేస్కోవాలె... సబ్బరంగా సబ్బుపెట్టి తలతానాలు చెయ్యాలె! ఇస్త్రీ చొక్కాలు... పంచెలు కట్టుకుని దర్జాగా తిరిగినా - మిమ్మల్నెవడైనా ఏమైనా అంటే బొక్కలోకి నూకేటందుకు మన యస్సై నూకరాజూ.. భద్రతా చట్టాలు బందూకులతో తయార్...!" యస్సయ్ నూకరాజు దర్పంగా లాఠీని బహు ఒడుపుగా గాల్లో బల్లెంలా బరబరా భలే చోద్యంగా గిరగిరా తిప్పాడు...

"పరిశుభ్రం... ప్రార్థన... మీరు దేవాలయాల్లోకి నిర్భయంగా పోవాలె... దేవుడ్ని జలాలతో అభిషేకాలు చెయ్యాలె... గుడంతా సుబ్బరంగా కడిగి పారెయ్యాలె...

"మంచినీళ్ళు తాగటానికి దొరకడం లేదు.. మా గూడెంలో బావి ఎండిపాయె! ఇంకుడు గుంతలు తవ్వీ తవ్వీ గూడలు పాయె... మాలమాదిగల గూడాలకు పంపులియ్యట్లేదాయె!" పీరిగాడు ఆబగా అడిగాడు.

"రోజూ దేవునికి టెంకాయలు కొడితే మీ సమస్యలన్నీ తీరిపోతాయి - ఖబడ్దార్... ఎవడైనా అడ్డం తగిల్నాడంటే వాడి నడ్డి విరిగిపోద్ది!" మంత్రిగారు మాట ముగించకముందే బొక్కలో నూకే నూకరాజు లాఠీగాల్లో విలాసంగా తిప్పాడు.

"బుర్రకాయకు నవురంటుకుని సంవత్సరమాయె! పనిపాటలు.. కూల్నాలి దొరక్క యాపగింజ లేరుకుంటుంటిమి - పొయ్యిలో పొగరాక పొద్దంతా ఎదురు సూసుడేనాయె!" ముత్తమ్మ చీదరింపుగా గొణిగింది.

"ధూపదీప నైవేద్యాలు.. దేవునికి తగిలించాలె... మీ మాల మాదుగులందర్నీ ఈ అగ్రకులం వాండ్లు అణచిపెడుతున్నారు - వాళ్ళు ఇవ్వాల్సిన గౌరువం మీకివ్వడం లేదు. అణిచి పారేస్తున్నారు. మీరేమో అలమటిస్తున్నారు... పెత్తందార్ల ముందు కుర్చీ పీటల మీద కూర్చుంటే ఊర్కోటం లేదు - పిల్లల్ని బల్లెల్లకు పంపనీయటం లేదు.. గుడిసెలు కూలుతున్నాయి...

"అర్రె... పన్జేసిన్దానికి కూలే సరిగ్గ ఇవ్వటం లేదు - రెక్కలు ముక్కలు చేసుకుందానికి సిద్ధపడితే ఇటు భూసాములు.. అటు చెంద్రబాబుగారు ఎవురూ పని ఇవ్వటం లేదు - రోడ్డు పని క్కూడా వాళ్ళవాళ్ళే వాండ్ల ప్రొక్లెన్లు పెట్టుకుని గవర్మెంటు పనులు చేసుకుంటండ్రు - పైసా సంపాదన లేదాయె! కాల్వలు లేక నాట్లు లేవాయె! కూలి పన్లు లేవాయె... కృష్ణా రామా అంటే కడుపు నిండిపోద్ది కాబోలు...!" పోతరాజు చినిగిన బనీను సవరదీసుకుంటూ అరిచాడు. బొ.నూకే నూకరాజు యస్సై యాంత్రికంగా లాఠీ గిరగిరా త్రిప్పి యాక్షన్‌లోకి దిగబోగా మంత్రి వారించాడు.

"స్వర్ణాంధ్రా... ప్రజల వద్దకు పాలన... మీ కులపోల్లందరూ బాగా చైతన్యం కావాలె... ముందుగా దేవాలయ ప్రవేశం... బయలుదేరండి.. ఎవడడ్డం వస్తాడో నేను చూస్తా...! అర్చకుల జీతాల్ని అయిదారు రెట్లు పెంచినం.. తమాషా అయింది... ఎంతకాలం ఈ వివక్ష.. ఇంకెంతకాలం ఈ నిర్బంధం... దేవుడ్ని దర్శించుకోకుండా పెత్తందార్లు... హా...!" మంత్రి జబ్బలు చరుసుకుంటూంటే బొ.నూకే యస్సై నూకరాజు లాఠీ కుమ్మడానికి తయారైపోయాడు.

మంత్రి గారు ఆవేశంగా పంచె సర్దుకుని పంగ లేస్తుంటే అంగలార్చుకుంటూ మాలమాదిగలు పొలోమని ఉరుకులు పరుగుల్తో ఆయన వెంటబడినారు. బ్యాండుమేళం మహా జోరుగా మోగిపోతుంది. బొ.నూకే యస్సై నూకరాజు లాఠీని వివిధ భంగిమల్లో త్రిప్పుతూ, వాండ్లను కండ్లతోనే అదుపు చేస్తూ ఆర్డర్లు పాసు చేస్తున్నాడు. పైన ఎండమాత్రం మహా ప్రళయంగా ఫెటఫెటలాడిపోతూనే వుంది!

అబ్బో...! అబ్బో! ఊరి మధ్యన ఆంజనేయస్వామి వారి గుడుంది - గుడిచుట్టూ పెద్ద గోడా... అంతకన్నా పెద్దగేటూ... దాన్ని మించిన రావిచెట్టూ - దానిమ్మ చెట్లూ వున్నాయి గానీ... తామెవరం... అహఁ.. తమ తాత ముత్తాతల దగ్గర్నుండీ వాటిని చూసిన పాపాన్నైనా పోలేదాయె! అందరూ చెపుతుంటే ఆంజనేలుగారి తోక గురించీ... దాని 'దెబ్బ' గురించీ వింటవే గానీ అనుభవంలోకి మాత్రం రానేలేదాయె! అసలు ఆ లోపల ఎట్లా పూజలు చేస్తరో... హారతులిస్తరో... తలుచుకుంటేనే జనాల గుండెలు గుబులుకు తగులుకున్నై.

ఎండ ఫెటపెటలాడుతూనే వుంది- గొంతులెండిపోతున్నాయి - బ్యాండు బడబడా మోగుతుంది - బొ.నూకే నూకరాజు లాఠీని ఎడాఫెడా తిప్పిపారేస్తున్నాడు. ముందు మంత్రిగారు ఠీవిగా లపలప చేతులాడిస్తూ విలేకర్లకు... వీడియోవాళ్ళకు ఫోజులిస్తూ పంగలేస్తుంటే మాలమాదిగలంతా దండుగ చీమల బారులా ఆయనెంటబడి వురుకుతున్నారాయె!

అక్కడ ఆ ఊరి బయట -

ఊదుగు చెట్ల పొదల్లో వందలేండ్ల కిందటనే కాబోలు పెద్ద రాతి పలకలూ.. మట్టీ కలబోసిన పోలేరమ్మగుడి... దాని చుట్టూ అల్లుకున్న ముండ్ల పొదలూ.. ఎగురుతున్న ఉడతలూ.. చుట్టూ రాతి కట్టడం.. ఎండవేల కూలినాలి జనం అలుపు తీర్చుకునే వేపచెట్లూ... దర్వాజా కూడా లేని గుడిలో ఏ రూపూ... ఆకారం లేకుండా పడి వున్న పోలేరమ్మ చెక్కడం... ఇవాళే కొత్తగా పసుపూ, కుంకుమా పూత పూసినట్లున్నారు.. రోజూ గడబిడగా మాలమాదుగులందరూ తీరికున్నపుడల్లా వచ్చిపోయేదే!

"ఇదుగో.. ఇవాల్టి నుండి మీ బతుకుల్లో శుభదినం.. ఈ గర్భగడిలోకి స్వేచ్ఛగా మీరందరూ ఎపుడంటే అపుడు వచ్చి పూజలు చేసుకోవచ్చు. ఎవడు అడ్డుపడ్డా సహించేది లేదు. మీరు రోజూ టెంకాయలు కొట్టి భజనలు చేయండి... కీర్తనలు పాడండి.. వద్దన్నవాడి మీద అతి తీవ్రమైన చట్టాలు... శిక్షలూ...

బొ... నూకే యస్సై నూకరాజు లాఘవంగా లాఠీని గాల్లో రకరకాలుగా త్రిప్పి రాజభక్తిని చాటుకుంటున్నాడు!!

★

లక్ష్మి

నువ్వు తిన్నావా?

చిన్ని నా పొట్టకు శ్రీరామ రక్ష అనుకోడం మగమహారాజుకి మహాయిష్టం. ఇంటో వాళ్లు తిన్నారో లేదో పట్టించుకోడు. మాట వరసకైనా మీరు కతికేరా లేదా అని అడగనే అడగడు. అడిగితే ఏం సమాధానం వినవలసి వస్తుందోనని భయం. తాను మెక్కేడు గనక మిగతా వాళ్లంతా మెక్కినట్టేనని సరిపెట్టుకుంటాడు. వాళ్లు మెక్కకుండా తనకెందుకు వడ్డిస్తారనే లాజిక్కుతో కులాసాగా వుంటాడు. ఎట్లా వున్నారని ఎవరైనా కుశల ప్రశ్న అడిగితే మాకేం హాయిగా భోం చేస్తున్నామని ధీమాగా చెబుతాడు. ముప్పూటలా మింగే సౌకర్యం తనకుంది గనక - ఇంట్లో యావన్మందీ అదే సౌకర్యంతో సుఖపడుతున్నారని అతని సిద్ధాంతం! అతని కడుపు కాల్తున్నప్పుడు మాత్రం - దేశ ప్రజలంతా ఆకల్తో అలమటిస్తున్నారని అల్లాడిపోతాడు. కష్టం కావచ్చు. సుఖం కావచ్చు. అది తనపరంగా ఆలోచిస్తాడే తప్ప - ఇంటిని ఆవరించివున్న కష్ట సుఖాలు అసలు పట్టించుకోడు. ఈ సూత్రానికి సూటయ్యే కథ వుండనే వుంది!

ఒక వస్తాదు. కండలు తిరిగిన వస్తాదు. కుస్తీలు పట్టేవాడు. కుస్తీలు పట్టి కడుపు నింపుకోడంలో సుఖం లేదని తొలి రోజుల్లోనే తెలుసుకున్నాడు. కుస్తీలో తాను గెలుస్తే, ఓడిపోయిన వాడు - తన మీద కసిపెంచుకునే ఛాన్సు చాలా వుంటుంది. తనని దెబ్బతీయాలని పంతం పడతాడు. బలం చాలకపోతే కొన్ని దిక్కుమాలిన కుట్రలతో బిజీగా వుంటాడు. అవకాశం దొరకాలేగాని - దొరికితే దొంగదెబ్బ తీసేందుకు సిద్ధంగా వుంటాడు. తనకాలో చెయ్యో విరిచేంతవరకు విశ్రాంతి లేదంటాడు. ఈ ప్రతిజ్ఞకు భయపడి కుస్తీ పందెంలో కావాలని ఓడిపోతే - హీనాతిహీనంగా బతకవలసి వస్తుంది. దమ్ములేని దద్దమ్మ అనే అట్టముక్క మెళ్లో తగిలించుకుని తిరగవలసి వుంటుంది. ఏతావాతా కుస్తీల్లో ఓడినా గెలిచినా ఫలితం క్రూరంగా వుంటుందని వస్తాదు తెలుసుకున్నాడు. ఈ కారణంగానే అతను కుస్తీలకు చుక్కపెట్టి వళ్లు పట్టడం నేర్చుకున్నాడు. పలువురు ప్రముఖుల వళ్లుపట్టి ఆరితేరిన యోధుడనే సర్టిఫికెట్తో - ఆ వస్తాదు రాజుగారి కొలువులో చేరిపోయేడు. రాజుగారికి వళ్లు పట్టే వృత్తిలో సుఖంగా బతుకుతున్నాడు!

కుస్తీల్లో మాదిరి వళ్లు పట్టడమనే విద్యలో ఓటమీ గెలుపులుండవు. వంటిమీద నరాల్ని నాజుగ్గా పట్టగలిగే నేర్పుంటే చాలు! ప్రభువులు ఆనలదించి ఆర్థరాజ్యమిచ్చినా ఇవ్వచ్చు. పొరపాటున ఆ పని అవకతవకగా తగలడితే ప్రభువులకు కోపం రావచ్చు. అందుకు నాలుగు కొరడా దెబ్బలు తగిలించి శాంతించవచ్చు. అంతేగాని - ఉరిశిక్షలుండవు. కాలో చెయ్యో తీసేయడాలు కూడా వుండవు. అంచేత కుస్తీలు పట్టడం కంటె వళ్లు పట్టడమే అనేక విధాల గిట్టుబాటయ్యే ఫీటని వస్తాదు తెలుసుకోగలిగేడు. రోజులు గడుస్తున్నాయి. తన పనితనం రాజుగారికి బాగా నచ్చడం వల్ల బంగారు ముద్దలు బహుమతిగా దొరుకుతున్నాయి! రాజ్యంలో ప్రజలెట్లా బతుకుతున్నారో అడిగి తెలుసుకునేందుకు అధికారులు చాలా మంది వున్నారు. వాళ్లకంటే వళ్లు పట్టేవాడే కరెక్టు రిపోర్టు అందిస్తాడనే దురాశతో - రాజుగ్గారు ఆ పనికి వస్తాదునే పెట్టుకున్నాడు. వస్తాదు తన సొంత స్థితిగతుల్ని రాజ్యంలో బతికే జనాభాకి అంటగట్టి - తమ ఏలుబడి మహత్తరం మహాప్రభో అంటున్నాడు. ప్రజలు యావన్మందీ సుఖపడిపోతున్నారనీ, ఒక్కో మనిషి దగ్గర ఉసిరి కాయంత బంగారం వుందని చెప్పి రాజుగార్ని సంతోషపెడుతున్నాడు. రాజుగారు రెచ్చిపోయి శుభవార్తలందిస్తున్న వస్తాదుకి బంగారు ముద్దల సైజు పెంచి కానుకగా యిచ్చి తరిస్తున్నాడు!

నిజానికి ఆ రాజ్యంలో ప్రజలు పలు కష్టాలు పడుతున్నారు. నిత్య దరిద్రంతో బతుకుతున్నారు. వస్తాదు మాత్రం అనుకూల వార్తలు చెప్పి సుఖ పడుతున్నాడు. ఈ వరస గమనిస్తున్న మంత్రిగారికి వళ్లు మండిపోయింది. ముదనష్టపు ముచ్చట్లకి స్వస్తి పలికించాలనే ఉద్దేశంతో - కొందరు దొంగల్ని పిలిపించి - వస్తాదు ఇంటోవున్న బంగారాన్ని దోచుకోమని ఆర్డరు వేసేడు. దొంగలు ఆ పని విజయవంతంగా ముగించేరు. ఆ మరుసటి రోజు వస్తాదు కన్నీళ్లతో రాజుగారి వళ్లు పడుతున్నాడు. ఎందుకేడుస్తున్నావని రాజుగారు అడిగేరు. ఏం చెప్పమంటారు మహాప్రభో - తమ రాజ్యంలో ప్రజలంతా అన్యాయమైపోయేరని అన్నాడు. వాళ్లు దాచుకున్న బంగారు ముద్దల్ని దొంగలు దోచుకున్నారని ఏడుస్తూనే చెప్పేడు. ముహూర్తం పెట్టుకున్నట్టు - ఒకేరాత్రి - అందరిళ్లల్లో వున్న బంగారు ముద్దల్ని దొంగలు దోచుకుపోయినందుకు రాజుగారు చెడ్డ బాధపడిపోయేరు! ఈ కథలో అటు వస్తాదు ఇటు రాజుగారూ ఒకేజాతి మనుషులు. తాను బావుంటే సమస్తమైన వాళ్లూ బావున్నట్టె అనుకునే వస్తాదు ఎంత మూర్ఖుడో - వళ్లు పట్టేవాడి మెచ్చుకోలు మాటలు వేదవాక్కులుగా భావించే రాజుగారు కూడా అంతే మూర్ఖులు! ఈ మూర్ఖులతో ఇల్లుగానీ, దేశంగానీ బాగుపడే అవకాశం వుండనే వుండదు!

దేశం గురించి మాటాడే అర్హత నాకుందో లేదో తెలీదు. ఇంటి వ్యవహారాల్లో మాత్రం ఇంతో అంతో అనుభవమున్నదాన్ని. అంచేత మెజారిటీ ఇళ్లల్లో మగవాళ్ళు యించుమించు కథలో చెప్పిన వస్తాదుకి వారసులే! జేబులో వంద వుంటే చాలు - బిర్లా గారి బావమరిది హోదాలో వుంటాడు. జేబుఖర్చుకి కనీసం వందైనా లేని బతుకేం బతుకని ఆఫీసులో మీటింగు పెడతాడు. నువ్వు చెప్పింది యమ కరెక్టంటారు కొలీగ్స్. నీ మాదిరి మేము కూడా ప్రతిరోజూ వంద కాగితాల్లోనే బయటకొస్తామని నోట్లు తీసి చూపిస్తారు. ఈ లైఫులో గొప్పలు చెప్పుకునే మగమారాజులకు ఇంటి పరిస్థితులు బొత్తిగా తెలీవు. తెలుస్తే పిచ్చివాళ్లవుతారనే భయంతో - ఇంటో ఆడవాళ్లు జాగ్రత్త పడతారు. వెచ్చాలు మచ్చుకైనా లేవన్నా, బియ్యం నిండుకున్నాయని చెప్పినా మారాజులు చిందులు తొక్కుతారు. చొక్కాలు చింపుకుంటారు. ఈ రభసకి భయపడి పక్కింటో చేబదులు తీసుకుని శ్రీవారికి మాత్రమే వండి పెడుతుంది ఇల్లాలు. నిండు కంచాన్ని చూసి మురిసిపోతాడు మారాజు. పస్తుల్లేకుండా రోజులు గడుస్తున్నందుకు ఆనందిస్తాడు. అదంతా తన నిర్వాకమేనని గర్విస్తాడు. అంతేగాని ఆ నెలలో తన సిగరెట్లకి ఎంత ఖర్చయిందో, తన పార్టీలూ తన అవసరాలకు ఎంత ముదనష్టమైందో గుర్తుండదు. జీతంలో ఎంత శాతం డబ్బు యింటో యిచ్చేడో అస్సలు గుర్తుండదు. అన్నిటి కంటే ముఖ్యం - నువ్వు భోంచేసేవా సుశీలా అని మాట వరసకైనా అడగడు! చిన్ని నాపొట్టకు శ్రీరామరక్ష అనుకోవడమే అతని వంతు! ★

ప్రకృతి శోభల అభయారణ్యం

ఎన్.లక్ష్మణ్

ఎంతటి వారయినా అక్కడి రమణీయ దృశ్యాలకు పులకరించిపోతారు. ఆహ్లాదం, ఆకర్షణ, పిల్లగాలులు, పిట్టల కీచురాగాలు, కోయిలమ్మ కూనిరాగాలు ఆ అభయారణ్యానికి ఆభరణాలు. ఒకప్పుడు నిజాం నవాబుకే ఆహ్లాదాన్ని పంచి పెట్టిన ఆ అభయారణ్యమే నేడు వేలాది మందికి విడిది కేంద్రం. వందలాది పర్యాటకులను ఆకర్షిస్తూ పర్యాటక కేంద్రంగా ప్రసిద్ధి చెందుతోంది అలీసాగర్ ఉద్యానవనం.

ఓ అందమైన ఆకృతిని చూసినపుడు.... సుందరమైన దృశ్యాన్ని కాంచినపుడు... హృదయం స్పందిస్తుంది... మనసు పులకరిస్తుంది... కన్పించే దృశ్యం కృత్రిమం కాకుండా సహజమైనది. అయినపుడు అది మనసును మరో లోకంలో విహరింప చేస్తుంది.

పోచారం అభయారణ్యంలో అలీసాగర్ ఉద్యానవనంలో స్వేచ్ఛగా విహరించే లేళ్ళు... కుందేళ్ళు... నెమళ్ళు, మనుబోతులు, ఇంకెన్నో పక్షి జాతులు, ప్రకృతికి వన్నె తెచ్చే ప్రాణులు, ఇవన్నీ అలీసాగర్‌లోనూ నాగిరెడ్డి పేట మండల కేంద్రానికి అయిదు కిలోమీటర్ల దూరంలో పోచారం అభయారణ్యంలోనూ నిత్యం సందర్శకులను ముచ్చట గొలుపుతున్నాయి. మెదక్, నిజామాబాద్ జిల్లా సరిహద్దులో గల నాగిరెడ్డిపేట మండల కేంద్రానికి అయిదు కిలోమీటర్ల దూరంలో వున్న పోచారం అభయారణ్యం, జిల్లా కేంద్రానికి 12 కిలోమీటర్ల దూరంలోని అలీసాగర్ ఉద్యానవనం పర్యాటకులను ఆకట్టుకుంటోంది.

పోచారం అభయారణ్యం ప్రదేశం జంతువులకు, పక్షులకు అనువుగా ఉండడం వల్ల సంబంధితశాఖ వారు అభయారణ్యానికి స్థలాన్ని ఎంపిక చేశారు. మెదక్ జిల్లా మెదక్, రామాయంపేట మండలాలు, నిజామాబాద్, నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి, లింగంపేట, తాడ్వాయి, భిక్కనూర్ ఆయా మండలాల ప్రాంత అటవీ శాఖవారు వేల ఎకరాలను జంతు విహారానికి కేటాయించారు. ప్రధానంగా పోచారం వద్ద 62 ఎకరాల విస్తీర్ణంలో జంతువులను పెంచుకున్నారు. 1996లో హైదరాబాద్ జిల్లా పార్కు నుండి దుప్పులను, జింకలను తీసుకువచ్చి సంతానోత్పత్తి కోసం ఈ అభయారణ్యంలోవదిలారు. ఇందులో మూడు విభాగాలున్నాయి. జింకలు, లేళ్ళు, దుప్పులు, సాంబారులు వున్నాయి. 1996లో సంతానోత్పత్తికై విడిచిన జంతువులతో ఇప్పుడు మరికొన్ని తోడు కావడం విశేషం.

ప్రధాన రహదారికి ఇరుపక్కల వున్న అలీసాగర్ ఉద్యానవనం, పోచారం అభయారణ్యం ప్రయాణీకులను ఆకర్షిస్తూ కనువిందు చేస్తోంది. గత ఏడెనిమిదేళ్ళుగా పక్షులు పెరుగుతున్నాయి. పక్షులకు, కుందేళ్ళకు ఒక హాలును నిర్మించి జాలీ ఏర్పరిచి అందులోనే సకల సౌకర్యాలు ఏర్పరిచారు. బడ్‌బొరిగొర్, ప్రేమ పక్షులు, ఫ్రాన్స్, తోకపావురాలను పెంచుతున్నారు. 62 ఎకరాలలో మూడు విభాగాలలో జంతువులను పెంచుతున్నారు. పక్షుల కేంద్రం మరింత ఆకర్షణీయంగా సందర్శకులను ఆకర్షిస్తోంది. అభయారణ్యంలో నెమళ్ళతో పాటు ఇతర వలస పక్షులు వచ్చి మరింత శోభను చేకూరుస్తున్నాయి. రంగురంగుల పక్షులు, రకరకాల జంతువులు ఈ కేంద్రాలలోని ప్రధాన ఆకర్షణ. అభయారణ్యం మిగతా అటవీ ప్రాంతంలో ఎలుగుబంట్లతో పాటు క్రూర మృగాలు కూడా సంచరిస్తుంటాయని అధికారులు అంటున్నారు. వన్య ప్రాణుల సౌకర్యార్థమై అక్కడక్కడ చెక్‌డ్యాంలు నిర్మించారు. జంతువుల మేత కోసం గడ్డికంచెలు పెంచుతున్నారు. రోడ్డు పక్కనే అందమైన పార్క్‌ను ఏర్పాటు చేశారు.

అడవుల ప్రాముఖ్యత గురించి అవగాహన పెంపొందించేందుకు ప్రతి ఏటా సమీప మెదక్, నిజామాబాద్ జిల్లాల విద్యార్థులకు ప్రత్యేక శిక్షణా తరగతులను ఏర్పాటు చేస్తుంటారు.

నిజాం వేట ప్రదేశం

పోచారం అభయారణ్యం నిజామాబాద్, మెదక్ జిల్లాలలో గల అటవీ ప్రాంత ప్రదేశం అప్పటి నిజాం వేట ప్రదేశం. ఆ కాలంలో దట్టమైన అడవి ఉండేదట. నైజాం నవాబు ప్రత్యేకంగా ఈ ప్రాంతానికి వేటకోసం వచ్చే వారని ప్రతీతి. అందుకే ఈ ప్రాంతంలో సంబంధిత శాఖ అభయారణ్యాన్ని ఏర్పాటు చేసింది. అందులో జంతువులు, పక్షులు అందమైన పార్కు పోచారం ప్రాజెక్టు వంటివి పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. ★

పంజాబ్ జాతీయ క్రీడల్లో మన స్థానం ఎక్కడ?



మారేపల్లి లక్ష్మణ్

అందరూ ఎదురుచూసిన పంజాబ్ జాతీయ క్రీడలు మరో వారం రోజుల్లో ఆరంభంకానున్నాయి. వాయిదాల పర్వంతో విసుగుపుట్టించిన పంజాబ్ జాతీయ క్రీడలు ఎట్టకేలకు ఈనెల 19 నుంచి డిసెంబర్ 1 వరకు 27 క్రీడాంశాలలో పోటీలు ఐదు నగరాల(లూధియానా, జలంధర్, పటియాలా, ఛండీఘర్ ఆనంద్‌పూర్ సాహిబ్)లో జరగనున్నాయి. 2002లో ఆతిథ్యం ఇవ్వనున్న ఆంధ్రప్రదేశ్ మాత్రం ఈ క్రీడల్లో పతకాల పట్టికలో మొదటి అయిదు స్థానాలలో నిలవాలనే తలంపుతో బరిలోకి దిగుతున్నది. ఇందుకు తగ్గట్టుగానే భారీ బృందాన్నే పోటీలకు పంపుతున్నది. 205 మంది పురుషులు, 132 మంది మహిళా క్రీడాకారులకు తోడు 36 మంది కోచ్‌లు, 34 మంది అధికారులు పంజాబ్‌కు బయలు దేరుతున్నారు. రెండేళ్ల కిందట మణిపూర్ జాతీయ క్రీడల్లో 153 మంది పురుషులు, 94 మంది మహిళా క్రీడాకారులతో పాల్గొన్న రాష్ట్రం 26(9 బంగారు, 6 వెండి, 11 కంచు) పతకాలతో 13వ స్థానంలో నిలిచింది. ఈ సారి మాత్రం పతకాల పట్టికలో పైకి ఎగబ్రాకడానికి సంవత్సరం నుండే ప్రణాళికలతో తయారయ్యింది. ఈ ప్రణాళికలు సత్ఫలితాలను ఇవ్వగలవని రాష్ట్ర ప్రభుత్వం, శాప్ బాజా మోగిస్తున్నాయి. మరి ఈ ప్రణాళికలు ఎంతటి ఫలితాలనిస్తాయో జాతీయ క్రీడల తరువాత గాని బోధపడదు.

ఆంధ్రప్రదేశ్ విజయావకాశాలను ఒకసారి పరిశీలిస్తే అది ఎక్కువగా హాకీ, షటిల్ బ్యాడ్మింటన్, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, జిమ్నాస్టిక్స్ అంశాల్లో పతకాలపై ఆశతో వుంది. హాకీలో భారత జట్టు కెప్టెన్ ముఖేష్‌కుమార్ రాష్ట్రం తరపున బరిలోకి దిగుతుండడంతో విజయావకాశాలు ఎక్కువయ్యాయి. కాని అతను ఇటీవల చిన్న గాయానికి లోనుకావడంతో పోటీల్లో పాల్గొంటాడా లేదా అన్నది అనుమానాస్పదంగా మారింది. ఇక షటిల్ బ్యాడ్మింటన్‌లో ఆశలన్నీ ఆల్ ఇంగ్లండ్ ఛాంపియన్ పుల్లెల గోపీచంద్‌పైనే. అతనికి తోడు జాతీయ డబుల్స్ ఛాంపియన్లయిన జ్వాల, శృతికురియన్‌లు కూడా ఏదో ఒక పతకం తేగల సమర్థులని భావిస్తున్నది. వాలీబాల్‌లో మాత్రం ఆంధ్రప్రదేశ్‌కు ఘన చరిత్రే వుంది. కేరళ, మహారాష్ట్ర, కర్నాటక జాతీయ క్రీడల్లో పురుషుల జట్టు స్వర్ణం గెలుచుకుంది. ఆతర్వాత వాలీబాల్ క్రీడాకారులు రాష్ట్రంలో ఉద్యోగ అవకాశాలు కరువవడంతో ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లారు. దీంతో మణిపూర్ జాతీయ క్రీడల్లో రిక్త హస్తాలతో తిరిగి వచ్చింది. ఇటీవల మహిళల జట్టు జాతీయ ఛాంపియన్‌గా నిలవడంతో ఈమారు వాలీబాల్ రెండు విభాగాల్లో స్వర్ణం ఖాయమని తలపోస్తున్నది. రాష్ట్ర జట్టులో భారత జట్టు కెప్టెన్ రవికాంత్‌రెడ్డి, పి.వి.రమణ, వెంకటేశ్వరరావు, రామచంద్రరాజు, సుధాకర్‌లు, మహిళా జట్టులో ఏడుగురు రైల్వే క్రీడాకారులకు తోడు రాధిక కూడా తోడవడంతో పతకాల గ్యారంటీపై నమ్మకంతో వుంది. బాస్కెట్‌బాల్‌లో యువ ఆటగాళ్లు ఎస్.ప్రసాద్, వినయ్‌కుమార్ యాదవ్‌లు జట్టులో వుండడంతో పాటు అనుభవజ్ఞుడైన హరికృష్ణ ప్రసాద్ రాకతో కొత్త హుషారు వచ్చింది. పొడగరి ఇస్లావుద్దీన్ లేనిలోటు పూడ్చలేనిది. గ్యారంటీగా పతకం సాధించే అంశాల్లో లాన్ టెన్నిస్ చేరింది. కారణం ఇటీవల అంతర్జాతీయ స్థాయిలో సంచలనాల వెల్లువ సృష్టిస్తున్న ఆంధ్ర బాలిక సానియా మీర్జా పాల్గొంటుండడమే. పురుషుల విభాగంలో వాసుదేవరెడ్డి సంచలనం సృష్టించగల దిట్ట. జిమ్నాస్టిక్స్‌లో మాత్రం గాయాల బెడద వెన్నాడుతోంది. పరుశురాం, రమేష్ తీవ్ర గాయానికిలోనై పోటీలకు దూరం కావడంతో జిమ్నాస్టిక్స్‌లో మిగిలివున్న ఆశలకు నీళ్లొదలాల్సి రావచ్చు. వెయిట్ లిఫ్టింగ్‌లో పతకం నీలంశెట్టి లక్ష్మి ప్రతిభపై ఆధారపడివుంది. బాక్సింగ్‌లో మాత్రం కనీసం రెండు పతకాలైనా వస్తాయని ఆశాభావంతో వుంది. ఎక్కువ సంఖ్యలో పాల్గొంటున్న జల క్రీడలైన కనోయింగ్-కయాకింగ్, రోయింగ్‌ల్లో పతకాల అవకాశాలు తక్కువే. శాప్ హాస్టల్స్ సత్ఫలితాలను ఇవ్వడం లేదని, వాటి స్థానంలో కొత్తగా అకాడమీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కాని వాటిని ఏర్పాటు చేయడంలో వున్న శ్రద్ధ సదుపాయాలు కల్పించడంలో లేకపోయింది. దీంతో చాలామంది క్రీడాకారులు అకాడమీలో చేరే ఆలోచనలను విరమించుకొన్నారు. వీటికి తోడు పే అండ్ ప్లే స్కీమును ప్రవేశపెట్టి దిగువ, మధ్య తరగతి క్రీడాకారులను ఆటలకు దూరం చేసింది. వీటితో పాటు రాష్ట్ర ఒలింపిక్ సంఘం, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మధ్య సమన్వయ లోపం కూడా క్రీడా వర్గాలను ఆందోళనలో పడేసింది. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం ఈ క్రీడలలో గెలిచి వచ్చే ఏడాది ఏర్పాట్లకు సన్నద్ధం కావడానికి వందల కోట్లతో జాతీయ క్రీడలకు భారీ సన్నాహాలు చేస్తోంది. పంజాబ్ జాతీయ క్రీడలు సెప్టెంబరు నుంచి నవంబరుకు వాయిదా పడడంతో రాష్ట్రంలో జరుగుతున్న శిబిరాలను శాప్ నిలిపివేయడం వల్ల క్రీడాకారులకు ప్రాక్టీసు కొరవడింది. మళ్లీ క్రీడల ముందు హడావుడిగా వారం రోజుల శిబిరాలను నిర్వహించినా పుణ్యకాలం కాస్తా పూర్తయ్యాక ఈ శిబిరాలు దండగని క్రీడాకారులు బహిరంగంగానే ఘోషించారు. ఖర్చు దండగ అన్న సాకుతో శిబిరాలను ఎత్తివేయడం వల్ల క్రీడాకారుల శిక్షణకు బ్రేక్ పడిందని, ఇపుడు మళ్లీ తుది శిబిరం ఏర్పాటు చేసినా దాని ఫలితం శూన్యమనే భావన నెలకొంది.

పతకాలు తేండి....... డబ్బులు ఇస్తాం, సన్మానాలు చేస్తాం తరహాలో వ్యవహరిస్తున్న ప్రభుత్వం పతకాలు తేవడానికి కావలసిన మౌలిక క్రీడా సదుపాయాలు కల్పించడంలో విఫలమవుతూ వస్తున్నది. 1987లో కేరళ, 1994లో మహారాష్ట్ర, 1997లో కర్ణాటక, 1999లో మణిపూర్‌లో జరిగిన జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్నడూ టాప్‌టెన్ జాబితాలో స్థానం లభించలేదు. ఈ సారికూడా పరిస్థితిలో మార్పు వుండకపోవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు ఖర్చుపెడుతున్నా, స్పోర్ట్స్ అథారిటీ, క్రీడా సంఘాల మధ్య ఆశించిన సమన్వయం [illegible]పడిందన్నది బహిరంగ రహస్యం. ఇరు సంస్థల దారి తలో దిక్కుగా సాగుతున్నది. ఇలాంటి పరిస్థితిలో అందర్నీ వెంటాడుతున్న ప్రశ్న ఒకటే! పంజాబ్ జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ ఆటతీరు ఎలా వుంటుంది? ఏయే అంశాల్లో పతకాలొస్తాయి? ఎవరెవరు గెలుస్తారు? పతకాల పట్టికలో కనీసం టాప్-5 జాబితాలో చోటు దక్కేనా? అన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. ★



భారీ బృందంతో పాల్గొనున్న రాష్ట్రం

పతకాల మాటెలా వున్నా పంజాబ్ జాతీయ క్రీడలకు ఆంధ్రప్రదేశ్ నుంచి భారీ బృందమే పాల్గొంటున్నది. ఈనెల 19 నుంచి వచ్చేనెల 1 వరకు జరిగే పంజాబ్ జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ 21 క్రీడాంశాలలో పోటీపడనుంది. 205 మంది పురుషులు, 132 మంది మహిళలు, 36 మంది కోచ్‌లు, 34 మంది అధికారులు కలిపి మొత్తం 407 మందితో కూడిన బృందం పంజాబ్‌కు బయలు దేరుతుంది. అథ్లెటిక్స్, అక్వాటిక్స్, ఆర్చరీ(పురుషులు), షటిల్ బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, సైక్లింగ్, ఈక్వెస్ట్రియన్ (పురుషులు), జూడో(పురుషులు), కయాకింగ్-కనోయింగ్, ఖో-ఖో, జిమ్నాస్టిక్స్, నెట్‌బాల్ (మహిళలు), రైఫిల్ షూటింగ్, రోయింగ్(పురుషులు), టెన్నిస్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్ అంశాల్లో తన అదృష్టం పరీక్షించుకుంటున్నది. అత్యధికంగా కనోయింగ్-కయాకింగ్ క్రీడాంశంలో 25 మంది రాష్ట్ర క్రీడాకారులు బరిలోకి దిగుతున్నారు. రోయింగ్‌లో 13 మంది పాల్గొంటారు. అథ్లెటిక్స్‌లో 18(10 పురుషులు + 8 మహిళలు), అక్వాటిక్స్‌లో 12 (6+6), ఆర్చరీలో 8 మంది, షటిల్ బ్యాడ్మింటన్‌లో 14(7+7), బాస్కెట్‌బాల్‌లో 24(12+12), బాక్సింగ్‌లో 24(12+12), సైక్లింగ్‌లో 12(7+5), ఈక్వెస్ట్రియన్‌లో ఆరుగురు, ఫెన్సింగ్‌లో 17(8+9), గోల్ఫ్‌లో 8(4+4), హాకీలో 18, జూడోలో 8, కయాకింగ్-కనోయింగ్‌లో 25(17+8), ఖో-ఖోలో 24(12+12), జిమ్నాస్టిక్స్‌లో 10(2+8), నెట్‌బాల్‌లో 12, రైఫిల్ షూటింగ్‌లో 9(6+3), రోయింగ్‌లో 13, టెన్నిస్‌లో 10(5+5), వాలీబాల్‌లో 24(12+12), వెయిట్ లిఫ్టింగ్‌లో 19(10+9) మంది పతకాల కోసం పోటీపడనున్నారు.

వివశులు

డా॥ కాకాని చక్రపాణి

"బుద్ధి లేకపోతే సరి, ఏళ్ళొచ్చాయి ఎందుకు?" అంది వసుధ కోపంగా

"అంత కానిపనేముందే నేను చేసింది!" అంది సుందరయ్మ్య కుదించుకుపోతూ

"చేతిలో పైస వుండనివ్వవు. వస్తువుల మీద వ్యామోహం. ఆ స్టీలు బిందెకు నా చీరె వేసింది కాక ఇంకా పాతిక రూపాయలు వాడి చేతబెట్టావా?"

"నా చీరెలు వేస్తే తీసుకోనన్నాడు. మరీ పాత చీరలు - చిరిగినవి తీసుకోనన్నాడు"

"ఏం ఇప్పుడు మనకాస్టీలు బిందె లేకపోతే చచ్చిపోతామా?"

"కింద నుంచి మంచినీళ్ళు తేవటం నీకే ఇబ్బందిగా వుంటున్నదని తీసుకున్నాను"

"మరి మాట్లాడక చేసిన తప్పుడు పనిని సమర్థింపు కూడాను"

సుందరమ్మ మెల్లగా లేచి గది దాటి వచ్చి బయట బాల్కనీలో నిలబడింది. నడి శీతాకాలం. సాయంత్రం ఆరు గంటలకే చలి వేస్తోంది. ఆవె కూతురు ఎదుట వుండటం భయమేసిం ఆ ఒక్క గది ఇంటిలో మరి మార్గం లే చలికి పమిట భుజాల చుట్టూ కప్పుకుం బాల్కనీ గోడ నానుకు కూర్చుం సుందరమ్మ.

ఇరవై ఐదు కాండిల్ ప వున్న పలచటి దీపకాంతి బాల్కనీ పడుతోంది. పక్కింటి పిల్లవాడు తల్లి కొ ఏడుస్తున్నాడు. కిలో గోధుమ పి తీసుకురమ్మని తల్లి పంపితే, అందు అర్థరూపాయి పెట్టి చాకె కొనుక్కున్నందుకు తల్లి వాడిని కొట్టిం ఆ పక్క ఇంటిలో వుండే అరవ యువక చీరల మూటను పట్టుకుని పైకి వచ్చా సుందరమ్మ పక్కకు తప్పుకుని అత దారి ఇచ్చింది. ఇళ్ళంటే కనీసం రెం గదులయినా వుంటాయని అనుకోకం అన్నీ ఒకరూం టెనమెంట్లు. అలాంటి ఆరున్నాయి. ఇంటి యజమాని మార్వాడి. ఎప్పుడో తాతలు కట్టిన ఇంటిని కూల్చడం ఇష్టం లేక ఇలాంటి చాలీచాలని బతుకుల మనుషులకు అద్దెకిస్తూంటాడు. సున్నంతో కట్టిన గదులు, ప్లాస్టర్ రాలిపోయి, కాల్పనికత ఏ మాత్రం వున్న వ్యక్తులకు కూడా ఎన్నో చిత్రాలను దృశింప చేస్తూ వుంటాయి. ఒక్కోగదికి కిరాయి మూడు వందలు. అద్దెకున్న వాళ్ళకు మార్వాడీ కలిగించే సౌకర్యం ఒక్కటే. బోరు నీళ్ళు పైకి వచ్చేట్టు పంపులు పెట్టాడు. మంచినీళ్ళు మాత్రం కిందనుంచి తెచ్చుకోవాలి.

సుందరమ్మకు నిస్త్రాణగా వుంది. వంట చెయ్యాలి. కూతురు ఆఫీసులో పని చేసి అలసి పోయి వచ్చింది. ఆకలేస్తోందేమో. అయినా ఆమె లేవలేక అక్కడే కూర్చుండిపోయింది.

సుందరమ్మ చేసిన తప్పల్లా పాత గుడ్డలు తీసుకుని స్టీలు సామానులమ్మే వాడికి వసుధ చీరె వేయటం. తన చీరెలు కూడా రెండు వేసింది. ఆ సంగతి తెలిస్తే కూతురు మండిపడుతుంది. అందుకే సుందరమ్మ చెప్పలేదు. మూడు చీరెలూ తీసుకుని కూడా యాభై రూపాయలు అదనంగా ఇవ్వమన్నాడు. చివరకు పాతిక రూపాయలకు బేరం కుదిరేసరికి ఆమె పురమారింది. బిందె చక్కగా వుంది. దాని మీద వ్యామోహం చంపుకోలేకపోయింది సుందరమ్మ. కూతురు ఇంటి ఖర్చుల కోసం ఇచ్చిన డబ్బులో మిగిలిన పాతిక రూపాయలూ ఇచ్చి, కూతురు ఏమంటుందోనని భయపడుతూనే, బిందె తీసుకుంది ఆమె. 'పాపం, అది కింది నుండి పంపు నీళ్ళు పైకి మోసుకు రావటానికి ఇబ్బంది పడుతోంది. రెండు గిన్నెల్లో తెచ్చి కుండలో పోస్తోంది. కుండ నిండటానికి నాలుగుసార్లు కిందకీపైకీ తిరగాల్సి వస్తోంది. బిందే వుంటే రెండుసార్లు తిరిగితే సరిపోతుంది' అనుకుంది ఆమె. తనకు కింద నుంచి నీళ్ళు తీసుకొచ్చే ఓపికలేదు. మోకాళ్ళు పట్టేస్తాయి. నీళ్ళు మోసుకుని పైకి వచ్చేటప్పటికి ఆయాసం వస్తుంది. అందువల్ల మంచినీళ్ళు తీసుకురావటం వసుధకు తప్పటం లేదు. అది ఒక కారణమయితే, స్టీలు బిందెను చూసిన తర్వాత దాన్ని వదల బుద్ధి కాకపోవటం మరో కారణం. అందుకే, కూతురు 'నీకు వస్తువుల మీద వ్యామోహం' అన్నా ఆమె తను చేసిన పనిని సమర్థించుకోలేకపోయింది. ఫస్టుతారీకు ఇంకా పదిహేను రోజులుంది. మళ్ళీ జీతమొచ్చే దాకా ఆ డబ్బు కూరలకు వస్తుంది కదా అనుకున్న వసుధకు తల్లి చేసిన పని చూసి మండిపోయింది.

వసుధ తండ్రి శీతారామయ్య ఆమె నెలల పిల్లగా వున్నప్పుడు ఏక్సిడెంటులో పోయాడు. ఆయనతో సుందరమ్మ కాపురం చేసింది ఐదేళ్ళే. ఓ ప్రయివేటు కంపెనీలో ఎలక్ట్రీషియన్‌గా పని చేశాడతను. అతని జీతం కనీసావసరాలకు కూడా సరిపోయేది కాదు. అప్పుడు భర్త సంపాదనకు వేన్నీళ్ళకు చన్నీళ్ళన్నట్లు మొదలు పెట్టిన టైలరింగ్ భర్త పోయాక ఆమెకు అదే జీవనాధారమయింది. తల్లిదండ్రులు పోయాక, పెంచిన మేనమామ పెళ్ళి చేసి చేతులు దులుపుకున్నాడు. శీతారామయ్య తల్లిదండ్రులకు ఒక్కడే కొడుకు. అతనికి చదువు సంధ్యలబ్బలేదు. వయసొచ్చినా సంపాదించే ఆలోచన లేని శీతారామయ్య ఓసారి తండ్రి తిట్టాడు. ఆ కోపంతో ఇల్లువదలి వచ్చిన శీతారామయ్యకు వసుధ మేనమామ ఎలక్ట్రీషిన్ పని నేర్పించి, మేనగోడల్నిచ్చి పెళ్ళి చేశాడు. కొడుకు పోయాక అతని తల్లిదండ్రులు కోడల్నీ, మనుమరాలినీ పట్టించుకోలేదు. కనుక ముప్ఫయ్యేళ్ళ వయసులో విధవరాలయిన సుందరమ్మకు తన భతుకు తాను బతకాల్సిన అవసరం ఏర్పడింది. వానాకాలం చదువు చదువుకున్న ఆమెకు ఉద్యోగాలేం వస్తాయి! అందుకే టైలరింగ్ పని చేసుకుంటూ జీవనాన్ని సాగించింది. స్కూలు ఫీజులుండవు కనుక గవర్నమెంట్ స్కూల్లో వసుధను ఎస్సెస్సీ దాకా చదువు చెప్పించగలిగింది. కానీ పెళ్ళి చేయగలగటం ఆమె తాహతుకు మించిన పనయింది.

సుందరమ్మ ఏ పని చేసినా అందంగా చేసేది. కళాత్మకంగా చేసేది. అందుకే ఒకసారి ఆమెచేత బట్టలు కుట్టించుకున్న మహిళలు ఆమెని వదిలే వాళ్ళు కారు. ఆ కళాత్మక ఆరాటం ఆమె చేసే అన్ని పనుల్లోనూ దృశించేది. ఇల్లు శుభ్రంగా వుంచేది. మడికట్టుకుని వంట చేసేది. దేవుడి పూజ చేసేది. దీపం వెలిగించి దేవుడి ముందు పెట్టినప్పుడు ఆమెకెంతో ఆనందం కలిగేది. కానీ, నూనె ఖర్చవుతుందని కొద్దిగానే నూనెవేసేది ప్రమిదలో. దేవుడి పూజలో ఆమెకు భక్తి స్పృహ వుండేది కాదు. ఆ పనిలో ఓ అందం ద్యోతకమయ్యేది. ఆమెకు. వస్తువులపై వ్యామోహం కాదు. ఆమెకున్నది అందమైన వాటి పట్ల ఆమెకున్న గాఢవాంఛ అది. అది ఓ ఆరాటం. కానీ, ఆ విషయం ఆమెకు తెలీదు. అందుకే కూతురు తన్ను వస్తువులపై వ్యామోహం అని నిందించినందుకు ఆమె జవాబు చెప్పలేకపోయింది.

వస్తుతః వసుధ తెలివిగల పిల్ల. తల్లి పరిస్థితిని అర్థం చేసుకుంది. వీళ్ళనీ వాళ్ళనీ పట్టుకుని ఓ చిట్‌ఫండ్ కంపెనీలో ఉద్యోగం సంపాదించుకోగలిగింది. వెయ్యి రూపాయల జీతంతో మొదలైన ఆమె ఉద్యోగ జీవితం అంతకంటే పెద్దగా పైకెదగలేదు. కూతురికి ఉద్యోగం వచ్చాక ఆమె మిషను మీద పని చేయటం పూర్తిగా మానెయ్యలేదు కానీ తగ్గించింది. ఇదివరకటి ఓపిక ఆమెకు లేదు. ఉన్నంతలో సుఖపడసాగింది. కూతురి పెళ్ళికి తనయితే ఏ ప్రయత్నమూ చెయ్యలేదు కానీ, ఆమె పెళ్ళయి వెళ్ళిపోతే తనెలా బతకాలన్న ఆలోచన అంతస్సులో ఎక్కడో ఆమెని బాధపెట్టేది. కూతురి పెళ్ళయి, హాయిగా కాపురం చేసుకోటం కంటే తనకు కావల్సిందేం లేదు. కానీ, ఎందుకో అది జరిగే పని కాదని ఆమెకనిపించేది. నిజానికి అది ఆమె వైయక్తిక ఆకాంక్ష కాదు. మనిషి ఒంటరి వాడు కనుక, సమాజంలో సభ్యుడు కనుక సామాజిక నీతి సమాజంలోని సభ్యులందరి మనస్తత్వం పైనా బలీయంగా పని చేస్తూ వుంటుంది. ఉన్న సామాజిక నీతి, సంప్రదాయాలను ఆలోచించి నిర్ణయించుకోగలిగిన చైతన్యం, చదువు ఆమెకు లేవు. ఆడపిల్లకు పెళ్ళి అనేది సమాజంలో స్థిరపడిన భావన. పెళ్ళి కాకపోవటం, చేయలేకపోవటం తల్లికీ, పిల్లకీ అవమాన కారణాలే. నిజానికి సుందరమ్మ కూతురికి పెళ్ళయి వెళ్ళిపోతే ఎలా అని అనవసరంగా మధన పడింది కానీ, వర్ణాలు, కులాలుగా విభజితమై వున్న సమాజంలో ఆర్థికంగా, సాంఘికంగా ఎలాంటి అంతస్తూ లేని వసుధకు పెళ్ళి కావడం తేలికైన విషయం కాదని ఆమెకూ తెలుసు. అయితే, స్టేకులున్నాయి. వాటిలో ప్రమాదం వుంది. అలాంటి ప్రమాద పరిస్థితి ఒకటి దాపురించింది.

వసుధ పని చేసే చిట్‌పండ్ కంపెనీలోనే ఓ యువకుడు వసుధను పెళ్ళి చేసుకోటానికి ముందుకొచ్చాడు. "మీ అమ్మగారికీ, మీకూ ఇష్టమయితే మనం పెళ్ళిచేసుకుందాం" అన్నాడు.

నల్లగా, లావుగా వుండే అతను సుందరమ్మ కళాత్మక హృదయానికి నచ్చలేదు. కూతురి పెళ్ళయితే ఎలా అన్న ప్రశ్న వుండనే వుంది. "మనకులం వాడు కాదు. ఈ పెళ్ళికి నేను సుతరామూ అంగీకరించను" అంది ఆమె.

వసుధకూ అతను నచ్చలేదు. నచ్చకపోవడమంటే వ్యక్తిగా కాదు. అందమైనవాడు కాదనీ



కాదు. మనిషిగా అతను మంచివాడు. నలుగురికి సాయం చేయాలన్న మనస్తత్వం వున్నవాడు. అయితే, అతని ఆర్థిక స్థితి తన ఆర్థిక స్థితి కంటే మెరుగయినదేం కాదు. అది బాగు పర్చుకునే తెలివితేటలున్న మనిషిగా కూడా అతను ఆమెకన్పించలేదు. అందుకే, "మా అమ్మ మన పెళ్ళికి అంగీకరించటం లేదు. మన కులాలు ఒకటి కావు" అన్నది.

"మీ అమ్మ సంగతలా వదిలెయ్యి. నీకూ ఆ అభ్యంతరముందా?" అని అడిగాడతను.

"కులాలు మనం నిర్మించినవా, కాదనటానికి?"

ఆమెకు దారిద్ర్యం చిరపరిచితం. తండ్రి బతికున్నప్పుడూ, పోయాకా తాము గొప్పగా బతికింది లేదు. జీవితంలో కావాల్సిన వస్తువులన్నీ ఆమెకు షాపు విండోల్లోనూ, వాటి ధరలు ఆకాశంలోనూ కన్పించేవి. వాటిని భూమ్మీద కనిపించేట్టు చేయటం అతనివల్ల కాదు.

ఇది ఫెయిలయిన కొంతకాలానికి మరో పెళ్ళి సంబంధం వచ్చింది వసుధకు, అతను రెండో పెళ్ళివాడు. కులం వాడే. సుందరమ్మకు అతని ఇల్లు నచ్చింది. అతని డబ్బు నచ్చింది. అందుకే పెళ్ళికొడుకు నచ్చకపోయినా మనసుకు సమాధానం చెప్పుకునే ప్రయత్నం చేసింది. ఆమె మధ్యవర్తితో మాట్లాడింది.

"పెళ్ళాయ్యాక నా కూతురు ఉద్యోగం చెయ్యదు. అది తప్ప నాకూ ఎవరూ లేరు. కనుక నేనూ దానితోపాటే అల్లుడి ఇంట్లో వుండాల్సి వుంటుంది. అది ఆయనకు అంగీకారమయితే నేను వసుధను ఒప్పిస్తాను" అంది.

అందుకు మధ్యవర్తి, "అది ఆయనకు తెల్సిందే. ఆయనకు డబ్బుకు కొదువ లేదు. మీ పిల్ల ఉద్యోగం చెయ్యాల్సిన పని లేదు. మీరు ఆమెతో వుండొచ్చు" అన్నారు.

వసుధ మనసు ఈ సంబంధాన్ని అంగీకరించానికి ఊగిసలాడింది. కాని తన స్నేహితురాళ్ళు, పరిచయస్థులు, తోటి ఉద్యోగస్థులు ఏమనుకుంటారు. అయినా, యాభై ఏళ్ళు పైబడిన వాడిని కట్టుకుని తను బావుకునేదేముంది? శారీరక సుఖం లేకపోగా, రోగం వస్తే ఆ వ్యక్తికి చాకిరీ చేయటంతోనే తన జీవితం తెల్లవారుతుంది. అందుకు వసుధ మనసు అంగీకరించలేకపోయింది. సుందరమ్మ కూడా తృప్తిగా నిట్టూర్చింది. తన వయసు అల్లుడు తనకు తప్పాడని.

ఆ తర్వాత ఆమెకు సంబంధాలేవీ రాలేదు. వసుధ అందంగానే వుంటుంది కానీ అందాన్ని కొరుక్కు తినరు కదా! అందానికి డబ్బు తోడుండాలి. అదిలేకే వసుధ ముప్పయ్యేళ్ళ వృద్ధ కన్యగా మిగిలిపోయింది. కానీ వయసు చేసే ఆరాటం భరించలేకపోయింది ఆమె. తన ఇంటి పక్కన వుంటున్న రంగస్వామి మొదలియార్ బాల్కనీలో పోతూ ఆమె వంక చూపు బరసేవాడు. అతను బట్టల మూట నెత్తిన పెట్టుకుని ఇంటింటికీ తిరిగి చీరలు అమ్మేవాడు. తమిళనాడు నుంచి చీరెలు వచ్చేవి. ఖాతాలు సంపాదించుకుని వ్యాపారం చేసేవాడు. పెళ్ళాం బిడ్డలు తంజావూరులో వుండేవాళ్ళు. ఎప్పుడో ఏడాదికొక్కసారి గానీ అతను అక్కడకు వెళ్ళే వాడు కాదు. డబ్బు పంపేవాడు. హైదరాబాద్‌లో సంసారం పెట్టడం అతనికి తలకుమించిన పని. మనిషి దృఢంగా, ఎర్రగా వుండేవాడు. 'అతనితో సంబంధం పెట్టుకుంటేనేం?' అనుకుంది ఆమె. [illegible] పెళ్ళికిగానీ, సరసానికి కాదు. [illegible] అవసరం తీరిపోతోంది. [illegible] సుందరమ్మకు తెలుసు జరుగుతున్న [illegible]

"ఎక్కడికి వెళ్ళివచ్చావే?" [illegible] రంగసామితో గడిపి ఇంట్లోకి వస్తున్న [illegible]

"బాత్‌రూంకి వెళ్ళొచ్చాను" [illegible]

కామన్ లెట్రిన్, బాత్‌రూంలు [illegible] గదిపైనే వున్నాయి. ఆ తర్వాత తల్లి కూతుర్నేం ప్రశ్నించలేదు.

"చీకట్లో జాగ్రత్త" అని మాత్రం చెప్పింది.

అయితే, వసుధకు జీవితం మీద విసుగు కలిగింది. భర్త, పిల్లలు అన్న సామాజిక నీతికి వ్యతిరేకంగా తను చరించటం వల్ల ఏదో తప్పు చేస్తున్నానన్న భావన ఆమెలో కలిగింది. ఆ తప్పుకు కారణం తన తల్లి, తానున్న పరిస్థితులు. అందుకే తల్లి అన్నా, తన పరిస్థితులన్నా ఆమెకు అసహ్యం. ఓ రోజు అంది ఆమె రంగస్వామితో

"ఎప్పుడో ఓ రోజు మా అమ్మను చంపి నేను చస్తాను. వెధవ జీవితం విసుగేస్తోంది" అని

నవ్వాడతను. "నాకు తెల్సు, నీకు మీ అమ్మంటే కోపమని. ఆమె మాత్రం ఏం చేస్తుంది? నువ్వు బతుకు బాగుపర్చుకునే ప్రయత్నమేం చేశావు, ఆ చిట్‌ఫండ్ కంపెనీలో పని చేయటం తప్ప?"

"ఏం చెయ్యమంటావు నన్ను?"

"నువ్వు న్నూలు చదువైనా చదివావు. నాకదికూడా గగనమైపోయింది. అందుకు నేను మా అమ్మా, నాయన్ని తప్పు పట్టను. నువ్వుపైకి చదువు. కనీసం ఆ కంప్యూటర్ కోర్సులయినా చెయ్యి. వాటిల్లో డబ్బుందని అంటున్నారు"

"ఏం పెట్టి చదవాలి?"

"కొంత నేను సాయం చేస్తాను. కొంత నువ్వు పెట్టుకో. తిట్టుకోటం, ఇతర్లను నిందించటం కంటే ఏ మాత్రం జీవితం మెరుగు పర్చుకోటానికైనా ప్రయత్నించటం మంచిది. నేనీ ప్రయత్నమెందుకు చెయ్యలేదని నువ్వడగవచ్చు. నేను మొదటి నుంచి ప్రయత్నించాలి. ఈ నలభై రెండేళ్ళ వయసులో నేను చేయగలిగిందేం లేదు, అలవాటు పడిన జీవితం గడపటం తప్ప"

అన్నట్టే రంగస్వామి సాయం చేశాడు. తనవంతు ఖర్చుకు ఆమె జీవితం మరింత దుర్భరం చేసుకుంది. తను ఖర్చు పెట్టగలిగిన డబ్బుతో ఆమె ఓ చిన్న కంప్యూటర్ కోర్సు చేసింది. ఆ అర్హతతో ఓ కంపెనీలో ఉద్యోగముందని తెలిస్తే, ఆమె వెళ్ళి కంపెనీ యజమానిని కలిసింది. కంపెనీ యజమాని రామప్రసాద రెడ్డి.

"మీకు అనుభవం లేదు. మిమ్మల్ని తీసుకోవటం నాకు భారమవుతుంది" అని మర్యాదగా ఆమె అభ్యర్థనను తిరస్కరించ ప్రయత్నించాడతను.

"నేను ఎవరికీ భారం కాను. ఇప్పటిదాకా పోరాటం చేస్తున్నాను. మీరు అవకాశమిచ్చి చూడండి" అంది ఆమె.

పోరాటం అతనికి పరిచయమైందే. ఆమె అలా అనగానే అతను ఆమెవంక తేరపార చూశాడు.

ఓ నిశ్చయానికొచ్చినట్టు, "మీకు చిట్‌ఫండ్ కంపెనీలో ఎంతిస్తున్నారు?" అని అడిగాడు.

చెప్పింది వసుధ.

"అంతకంటే ఒక్కపైస మీకు ఎక్కువ ఇవ్వను. ఇష్టమైతే చేరండి. మీ పని నచ్చనప్పుడు నిర్దాక్షిణ్యంగా పంపేస్తాను. ఆ చిట్‌ఫండ్ కంపెనీలో ఉద్యోగానికి రిజైను చేస్తారు కనుక మీరు వీధిలో పడే అవకాశం వుంది"

"ఇష్టమే. రిస్క్‌లేక జీవితం లేదు"

ఆ విషయం రంగస్వామికి చెప్పినప్పుడు అతను [illegible] ఆ పైన చెప్పాడు : "నేను మా ఊరు [illegible] ఆవిడకు కాన్సరు. నయమవుతుందో [illegible] మళ్ళీ ఇక్కడికి వస్తానో లేదో కూడాతెలియదు. [illegible] వుండాలని కోరుకుంటున్నాను"

[illegible] అంది వసుధ [illegible] వ్యక్తం [illegible]

[illegible] ప్రయోజనం లేదు. మనమంతా వీరులైన సైనికులం. ఈ బతుకు బతకటానికి కూడా వింత ధైర్యముండాలి?" అని నవ్వాడతను.

వసుధను అంచనా వేయటంలో రామప్రసాదరెడ్డి పొరపాటు పడలేదు. చదువు తక్కువయినా పనిలో మంచి చాకచక్యం చూపించగలదని అతనికి అర్థమైంది. ఆపైన ఆమె పట్ల అభిమానం కూడా పెంచుకున్నాడతను. ఆమె జీతం కూడా పెంచాలనుకున్నాడు. అతను జీవితంలో ఆల్యసంగా పెళ్ళి చేసుకున్నాడు. అది పొరపొచ్చాల కాపురమే అయింది. భార్యాభర్తా చిన్న చిన్న విషయాలకే తగవులాడుకోసాగారు.

"మనకు పడటం లేదు. ఇద్దరం కల్సి విడాకులకు అప్లయి చేస్తే తొందరగా మంజూరవుతుంది" అన్నాడతను.

"నేను నీకు విడాకులివ్వను. నువ్వెలా మళ్ళీ పెళ్ళి చేసుకుంటావో చూస్తాను" అని పంతం పట్టి ఆమె పుట్టింటికి వెళ్ళిపోయింది.

అతను విడాకులకు కోర్టులో అర్జీ దాఖలు చేసేడు. ఐదేళ్ళ నుండి కోర్టులో కేసు నడుస్తోంది. అది త్వరగా తీర్పయ్యేట్టు కన్పించలేదనికి. వసుధ అతని కంపెనీలో చేరిన ఆరు నెలలకతనో ప్రతిపాదన చేశాడు. తన గృహస్థ జీవితం గురించి వివరంగా చెప్పి : "మీ కిష్టమైతే కలిసి వుండొచ్చు. లీగల్‌గా పెళ్ళి చేసుకోటానికి ప్రస్తుతానికి కుదరదు. కోర్టు మాకు విడాకులు మంజూరు చేస్తేనే అది సాధ్యమవుతుంది. అప్పటిదాకా నీకు నా మీద నమ్మకముందనుకుంటే మనం కలిసి బతకొచ్చు. ఆర్థికంగా మీకెలాంటి ఇబ్బందీ కలగకుండా నేను చూసుకుంటాను. మీకు నా ప్రపోజల్ ఇష్టం లేకపోయినా మీరిక్కడ ఉద్యోగం మానెయ్యాల్సిన పనిలేదు. మనం ఏం జరగనట్టే మసలుకుందాం"

"నేను ఆలోచించుకోవాలి" అంది వసుధ.

"ఓ, ష్యూర్, టేక్ యువర్ ఓన్ టైం"

అది జరిగి నెలరోజులయింది. అతను మళ్ళీ ఆ ప్రస్తావన చెయ్యలేదు. ఆమె ఎటూ తేల్చుకోలేకపోయింది. కులం సంగతి ఆమె పట్టించుకోటం ఎప్పుడో మానేసింది. రంగస్వామి సంబంధంలో బంధనం లేదు ఆమెకి. ఇక్కడ అలా కాదు. ఓ బంధనం ఏర్పడుతుంది. అయితే ఆర్థిక స్థిరత్వం కూడా కలుగుతుంది. అయితే మొగవాడిని ఎంతకాలం నమ్మవచ్చో ఆమె తేల్చుకోలేకపోయింది.

ఆఫీసు నుండి ఇంటికొచ్చి తల్లిని స్టీలు బిందె కొన్నందుకు విసుక్కున్నాక ఆమెకు తమ జీవితాల్లోని నిరర్థకత్వం గోచరించింది. దేని కోసం తన సుఖాన్ని, తల్లి సంతోషాన్ని తాను త్యాగం చేస్తున్నది? ఈ నిరర్థకమైన తల్లి త్యాగం వయస్సు యాభై దాటిపోయింది. ఇంకెన్నేళ్ళు. దారిద్ర్యం తనను సమాజం పట్ల కోపాన్ని పెంచుతోంది. బాల్కనీలో చలికి ముడుచుకు కూర్చున్న తల్లిని చూసిన వసుధకు మనసు ద్రవించి పోయింది. ఆమె నిశ్చయం చేసుకుంది. అప్పటిదాకా తాను కూర్చున్న తల్లి మిషను స్టూలు మీద నుండి లేచి చెప్పులేసుకుంటూ, "అమ్మా, మొహం కడుక్కుని తయారవ్వు. ఓ అరగంటలో బయటకెళ్దాం. ఏ హోటల్లోనో భోజనం చేసివద్దాం ఇంటికి" అంది.

సుందరమ్మ అర్థం కానట్టు కూతురి వంక చూసింది. "చెప్పింది అర్థం కాలా? లే. మనం బయటికెళ్తున్నాం" అంది కసుర్తున్నట్టు.

వసుధ వీధిలోకి వచ్చి, సందు మలుపులో వున్న టెలిఫోను బూత్‌నుండి రామప్రసాదకు ఫోను చేసింది.

"మీ ప్రపోజల్‌కి నేను అంగీకరిస్తున్నాను. ఉండ్‌లాండ్స్‌లో భోంచేద్దాం. మా అమ్మకూడా వస్తున్నది. ఎనిమిదింటికల్లా అక్కడికి వచ్చేయండి. ఈ లోపల డ్రైవరు చేత నాకో రెండు వేలు పంపించండి" అని.

ఓ పావుగంటలో రామప్రసాదరెడ్డి డ్రైవరు వచ్చి

(మిగతా 23వ పేజీలో)

'తెలంగాణ ప్రజల ఆత్మావిష్కరణ'

తెలంగాణ స్వగతాలు,
రచన : వుప్పుల నరసింహం,
వెల : రూ. 50/-,
ప్రచురణ : దేవులపల్లి పబ్లికేషన్స్, **ప్రతులకు** : విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు, నవోదయ బుక్‌హౌస్, దిశ బుక్ హౌస్.

తెలంగాణ ప్రజల జీవితాలను ప్రతిబింబించే ఈ పుస్తకంలో ప్రధానంగా శీర్షికలు బాగా ఆకర్షిస్తాయి. 'ఒకని సుతిల ఒకడు లేడు', 'నీ గుళ్ళె ఇంత మన్నువోతు', 'రామసక్కదనాల మొగుడు', 'పున్యానికొచ్చిందు కొమ్రిగాడు', 'సస్తే భూమికి ఎల్తి అయితమా?' వంటివి మంచి శీర్షికల్లో కొన్ని. ఆయా ప్రాంతాల్లో పుట్టి పెరిగి, అక్కడి ప్రజల జీవనవిధానం తెలిసిన వారే వారి ఆత్మను పరిపూర్ణంగా ఆవిష్కరిస్తారు. అందుకు తాను ప్రయత్నించానని రచయిత తన మాటలో కూడా రాసుకున్నారు. వారి మాట తీరును, వారు పలికే పదాలను అక్షరబద్ధం చేసే క్రమంలో అక్కడక్కడ అసహజత్వంగా అనిపించినా మొత్తంగా చదివించే రీతిలో స్వగత రచన సాగింది. వివిధ సామాజిక అంశాలను చర్చించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ఇబ్బందులను తెలియచేయడంతో పాటు తెలంగాణ పల్లె జీవితాన్ని అధికంగా ప్రభావం చేసే కొన్ని పాత్రలను సజీవంగా పరిచయం చేయగలిగారు. అందులో ముఖ్యమైనవి జీతగాడు, కల్లుగీసేవారు, పోలీసులు, గొర్రెలకాపరి, సర్కారు దవాకాన, నక్సలైట్లు, రాజకీయ నాయకులు, మూడనమ్మకాలు వంటివి. రచయిత వాడిన కొన్ని పదాలకు అక్కడ వాక్యం చదివితే తప్ప మామూలుగా అర్థం ఏమిటో తెలుసుకోవడం కష్టమవుతుంది. ఉదాహరణకు చుడాయిద్దామా, సత్క వంటివి. తెలంగాణాలోనే వివిధ ప్రాంతాల్లో మాండలికంలో గల తేడా వలన ఈ సమస్య ఏర్పడి ఉండవచ్చు. సాధారణ వాడుకలో లేని పదాలకు పుస్తకం చివర వివరణ ఇచ్చి ఉంటే బాగుండేది. అలాగే పుస్తకానికి పెట్టిన శీర్షికలో 'స్వగతాలు' అనే పదానికి బదులు తెలంగాణ మాండలికంలోనే ఆ అర్థం వచ్చే పధం మరేదైనా వాడి ఉండాల్సింది. ప్రతి అంశానికి పుస్తకం లోపల వేసిన బొమ్మలు తెలంగాణ గ్రామీణ జీవితానికి సరిపోయేలా ఉన్నాయి. ముఖచిత్రంపై వాడిన బొమ్మ కూడా ఆకట్టుకుంటుంది. అయితే తెలంగాణ గ్రామీణ జీవితాలకు ప్రతీకగా భరత్ భూషణ్ తీసిన ఇతర ఫొటోలు చాలా ఉన్నాయి. మరేదైనా వాడితే ఇంకా సజీవత ఉట్టిపడేది.

-కె.కె.

'కాలికస్పృహ' వున్న తాళ్లూరి లాబన్ బాబు

కవికి కాలికస్పృహ ఎంతో అవసరం. అది లేకుంటే కవి స్పందించలేడు. కవిత్వం రాయలేదు. రాసినా గత వైభవ స్మరణే వుంటుంది తప్ప వర్తమానాన్ని ప్రతిబింబించలేడు. తాళ్లూరి లాబన్‌బాబుకు కాలికస్పృహ వుంది. వర్తమానంలో దళితుల ముందుకొచ్చిన సవాళ్లని, అంశాల్నీ కవిత్వీకరించాడు 'మహానిర్గమనం'లో లాబన్‌బాబు. శ్రీశ్రీ 'మహాప్రస్తానం'ను అనుకరిస్తూ పేరడీగా 'మహానిర్గమనం' కవిత రాశాడు. దళితుల విముక్తికై ఉద్యమించమని కర్తవ్య బోధన చేస్తాడు. ఈ కవి మీద శ్రీశ్రీ ప్రభావం బాగానే వున్నా, చాలా వరకు తన కవితాగొంతునే విన్పించాడు. జ్యోతిశ్శాస్త్రం, సంస్కృతం వంటి సంఘపరివార పాలకుల మతోన్మాద అంశాల్ని ఈ కవి నిరసించాడు. మూఢ నమ్మకాల్ని పెంచే జ్యోతిశ్శాస్త్రాన్ని, జ్యోతిష్యుల్ని ఘాటుగా విమర్శిస్తాడు "వాడి జీవితం బాగుంటే నీ జాతకం ఎందుకు చూస్తాడు, పాడు దోషాలున్నాయని శాంతికి ఫీజులెందుకు గుంజుతాడు" అంటాడు. సంస్కృతాన్ని బలవంతంగా రుద్దాలనే బి.జె.పి. పాలకుల విధానాన్ని "దేవభాష నీకు సమ్మతమైతే చచ్చి స్వర్గానికి వెళ్లు, అక్కడ దేవతలతో సంభాషించు... మేము మాత్రం శషభిషలు లేకుండా తల్లి తెలుగులోనే ముచ్చటిస్తాం" అంటాడు. సంస్కృతం మృతభాషని నిరసిస్తాడు. మతతత్వాన్నీ, మసీదు విధ్వంసాన్నీ ఖండిస్తాడు. కవి తాను చెప్పాలనుకున్న దాన్ని సూటిగా, సరళంగా చెప్తాడు. డొంక తిరుగుడు లేదు. భయం అంతకన్నా లేదు. కవిత్వీకరించే శక్తి అపారంగా వున్నా, ఆవేశంలో 'వాచ్యత'లోకి జారిపోతాడు. సామాజిక పరిణామాన్ని, చారిత్రిక అవగాహనని కల్గి, రాజకీయ చైతన్యంతో దళితుల్ని ఉద్దేశిస్తూ పథ నిర్దేశకుడవుతాడు. ఆవేశాన్నీ, అనుభూతిని బాలెన్సు చేసుకుంటే లాబన్ బాబు తిరుగులేని కవి అవుతాడు. సాంప్రదాయిక ఉపమానాల్ని, సంస్కృత భాషా పధాల్ని వొదిలేస్తే కవిత్వంలో జీవం పండుతుంది.

- జిలుకర శ్రీనివాస్



మహానిర్గమనం
రచన : తాళ్ళూరి లాబన్‌బాబు
వెల : రూ. 30,
ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు, కుసుమాంజలి ప్రచురణలు

స్వీకారం



లెటర్ రైటింగ్ మధుర కవిత వంటిదని గిడుగు రామ్మూర్తిగారు ఒక లేఖలో పేర్కొన్నారు. లేఖలు సమాచారాన్ని అందియ్యడంతో పాటు ఇరువురి మధ్య ఆత్మీయానుబంధానికి తోడ్పడతాయి. సమాజం కోసం జీవించిన కొందరి లేఖల మూలంగా అనేకానేక విషయాలు కూడా వెల్లడవుతాయి. వాటివల్ల విజ్ఞానపు వరిధులు విస్తృతమవుతాయి.

గిడుగు లేఖలు
సంపాదకుడు : ఎన్.ఎస్.రాజు; **వెల** : రు. 25/-;
ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు



దేశ భవిష్యత్తుకు విద్యా విధానం ఎంత అవసరమో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. విజ్ఞానాభివృద్ధి కోసం సమాజంలోని మౌఢ్యాన్ని, వెనుకబాటుతనాన్ని నిర్మూలించి మానవ వనరుల పెంపుదలకు దోహదం చేస్తుంది. మానవ సమాజం ఆర్జించిన సమస్త విజ్ఞానాన్ని సంఘటిత పరచి, సమన్వయ పరచి సరైన రీతిలో అమర్చి మనకు అందించే విద్య.

సామాజిక శాస్త్రాలకు కాలం చెల్లిందా?
సంకలనం : ఆచార్య వకుళాభరణం రామకృష్ణ; **వెల** : రు. 10/-; **ప్రతులకు** : విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

గోపగాని రవీందర్‌కు సమాజంలోని అసమానతలు అన్యాయాల పట్ల తీవ్రమైన అసంతృప్తి వుంది. .పదేళ్ళ అనుభవంతో రచించిన కవితలను ఆయన అంకురంగా ముద్రించారు.

అంకురం
రచయిత: గోపగాని రవీందర్; **వెల** : రు. 25/-;
ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు; నవోదయ బుక్‌హౌస్, దిశ పుస్తకకేంద్రం, హైదరాబాద్

ఆమె జీవితమే ఒక పోరాటం



యు.రామకృష్ణ

చీకటి తెరలు ఇంకా పూర్తిగా విడిపోలేదు... డెన్ (రహస్యస్థావరం) బయటి ద్వారం వద్దనడక చప్పుడు... ఆ నిశ్శబ్ద వాతావరణంలో ఆ నడక సవ్వడి ఎంతో భీతి గొలుపుతోంది. పద్మ గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. బాబును భుజాన వేసుకొని.. తత్తరపాటుతో తలుపు దగ్గరకు వేసుకొని...

"ఎవరూ... " అడిగింది పద్మ.

"నేను, కొరియర్ శివారెడ్డిని. తలుపు తీయండి" తలుపు తీసింది. ఎదురుగా ఖిన్నవదనంతో శివారెడ్డి

"ఆఏంటి శివన్నా, ఇంత పొద్దున్నే వచ్చావ్, అందరూ క్షేమమేనా..? పెద్దన్న రాలేదా?" ఆతృతతో పద్మ ప్రశ్నల వర్షం కురిపించింది.

శివారెడ్డి నిశ్చేష్టుడై నిలబడ్డాడు. అతనికి నోట మాట రావడంలేదు. తాను తెచ్చిన వార్తను కామ్రేడ్ పద్మతో ఎలా చెప్పాలో తెలియక నిస్సహాయ స్థితిలో నిలబడి గద్గద స్వరంతో...

"అక్కా, చెప్పేందుకు నోరు రావడం లేదు. ప్రజలకు కొండంత అండగా వున్న వటవృక్షం నేలకొరిగింది. పేదల పాలిట పెన్నిధి 'కామ్రేడ్ పెద్దన్న ఇక మనకు లేదు. యూనియన్ సైనికుల తుపాకీగుళ్ళకు బలై నేలకొరిగాడు" అంటూ భోరున ఏడ్చాడు శివారెడ్డి.

పద్మకు కళ్ళు మసక కమ్మి, తన కాళ్ళ క్రింద భూమి కదులుతున్నట్లు అనిపించింది. నాలుక తడారి, మాటరాక మూర్ఛతో నేలపై కుప్పకూలిపోయింది. తానుకన్న కలలు .. ఊహలు... అల్లుకున్న అల్లిబిల్లి మేడలు.... ఒక్కసారి కుప్పకూలి... గాలికెగిరిపోయాయి. ఇప్పుడు తన జీవితమే అంధకార బంధురమై పోయినట్లు ఆమెకు తోచింది.

పద్మ భర్త కోదండరాంరెడ్డి (కామ్రేడ్‌పెద్దన్న) భూస్వామ్య కుటుంబంలో పుట్టినా, పీడిత ప్రజాసేవకై తన యావత్ జీవితాన్ని అంకితం చేసిన దేశభక్తుడు. 'పెద్దన్న' మరణవార్త దావానలంలా పాకింది. మృతదేహాన్ని సైతం చివరిసారిగా భార్యను, తల్లిదండ్రులను ఎవ్వరినీ చూడనివ్వలేదు నిజాం రజాకారు ముష్కరులు.

★ ★ ★

మెదక్‌జిల్లా గజ్వేల్ తాలూకా (నేటి వరగల్ మండలం) పాములపర్తి గ్రామంలో 1932వ సంవత్సరంలో కృష్ణారెడ్డి దొర, రాధమ్మ దొరసానికి పద్మ జన్మించింది. ఆమె పెరిగి పెద్దదై వివాహం అయ్యే వరకూ ఇంటా, బయటా అందరూ, తల్లిదండ్రులు పెట్టిన అసలు పేరు "ప్రమీల"గా పిలిచేవారు. తెలంగాణా సాయుధ పోరాట కాలంలో ఆమె రహస్య జీవితంలో అవసరాన్నిబట్టి మార్చుకున్న పేరు 'పద్మ'. ఈనాటికీ ఆమె పేరు పద్మగానే ఉండిపోయింది.

పద్మ తల్లిదండ్రులు, అన్నదమ్ములను పాములపర్తి 'దొర'లని పిలిచేవారు. పాములపర్తి ఓ జాగీరు గ్రామం. పద్మతల్లిదండ్రులు, అన్న దమ్ములు ఒక్కొక్కరికి వెయ్యేసి ఎకరాలకుతక్కువ కాకుండా భూమి వుంది. ఊరిలో ఎవరి ఎస్టేట్ వారిదే. ఎవరి గడీ, ఎవరి పెత్తనం వారిదే. వీరంతా కల్సి ఊరి ప్రజలందరి మీదా 'హుకూమత్' సాగించేవారు.

పద్మకు తన12వ ఏట బంధువర్గంలోని కొమ్మిడి కోదండ రాంరెడ్డి (పెద్దన్న)తో 1944లో వివాహం జరిగింది. పెద్దన్నది నల్గొండ జిల్లా భువనగిరి తాలూకా (నేటి బీబీనగర్ మండలం) బ్రాహ్మణపల్లి గ్రామం. భూస్వామ్య కుటుంబానికి చెందిన పెద్దన్న ఆర్యసమాజ్‌వాది. భువనగిరిలో తన మాధ్యమిక విద్య పూర్తికాగానే 'నైజాం సంస్థానం'లో సాగుతున్న విప్లవోద్యమాల పట్ల ఆకర్షితుడయ్యాడు. ఆంధ్రమహాసభ కార్యకర్తగా, కమ్యూనిస్టుపార్టీ సభ్యుడిగా గుర్తింపు పొందాడు. నైజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా అన్ని రకాల ప్రజా ఉద్యమాలను పటిష్టంచేయడానికి బల్దా, షర్కీ తాలూకాలో నడుం బిగించిన విప్లవయువకుడు పెద్దన్న. రైతు యువకులను గెరిల్లా దళంలోకి ఆకర్షించి, ఆత్మరక్షణకై ఆయుధాలు చేపట్టి జైత్ర యాత్రలు జరపడానికి పూనుకొన్నాడు.

అన్నెం, పున్నెం ఎరుగని అమాయకపు జమీందారీ ఆడపడుచు అయిన పద్మ తన భర్త రాజకీయ జీవితం, ఆయన చుట్టూ సంభవిస్తున్న సంచలనాత్మక సంఘటనలు చూసి కలవరపడసాగింది. సుకుమార జీవితంనుండి వచ్చిన పద్మ రహస్య జీవితాలు, ఉపవాసాలతో ఊరూవాడా అనకుండా తిరిగే భర్త రాజకీయాలు అంతగా జీర్ణించుకోలేకపోయింది. ప్రతినిమిషం, ప్రతిక్షణం తనభర్త భద్రత గురించి ఆందోళన చెందేది. 1948 సెప్టెంబర్ 20న పద్మ, పెద్దన్న దంపతులకు కొడుకు పుట్టాడు. 'విప్లవ కుమార్' అనిపేరు పెట్టుకున్నారు. పెద్దన్న అత్తవారింటికి వెళ్ళి తరచూ బాబుని చూసి పోతుండేవాడు. ఆ తర్వాత్తర్వాత అతనలా రావడానికి వీలులేని పరిస్థితులు ఏర్పడ్డాయి. అందువల్ల పద్మను, బాబును తన 'డెన్'లోకి పిలిపించి అక్కడే వారు వుండే ఏర్పాటు చేశాడు. అప్పటినుండే పద్మకు 'డెన్' జీవితం ప్రారంభమైంది.

మారినపరిస్థితులకు అనుగుణంగా గెరిల్లా దళాలకు నూతన పద్ధతుల్లో శిక్షణ ఇవ్వడానికి అన్ని ఏర్పాట్లు చేసుకొని, లభించినన్ని అధునాతన ఆయుధాలను, మందుగుండు సామాగ్రిని సమకూర్చుకొని రాచకొండ గెరిల్లా క్యాంపునకు ప్రయాణమయ్యాడు పెద్దన్న. అలా వెళ్ళిన పెద్దన్న ఇంక తిరిగి రానేలేదు. శత్రువుపై వీరోచితంగా పోరాడుతూ నేలకొరిగాడు.

★ ★ ★

ఇప్పుడు పద్మ ఒక మృతవీరుని భార్య. ఆమె పట్ల, ఆమె బిడ్డపట్ల డెన్‌లోని వారందరూ ప్రేమాభిమానాలు చూపి ఆదరించేవారు. రోజులు గడిచిపోతున్నాయి. కామ్రేడ్స్ రాములమ్మ, శారద, సీతాదేవి, శశిరేఖలతో సన్నిహితంగా మెలిగింది. రాములమ్మ కూడా తనలాగే రజాకారు వ్యతిరేక పోరాటంలో భర్తను పోగొట్టుకున్న వనితే. ఆమెకు పద్మపైన, బాబుపైన ప్రత్యేక వాత్సల్యం ఏర్పడింది. తాను అనుభవించిన విషాదకర జీవితాన్ని, కష్టసుఖాలను తిరిగి పద్మలో చూస్తున్నది.

రాత్రిపూట గదిలో తన బాల్యజీవితాన్ని, చనిపోయిన తల్లిదండ్రులను, మృతవీరుడైన భర్తను జ్ఞాపకం చేసుకొని పద్మ చాటుమాటుగా ఏడ్వడం రాములమ్మ పసిగట్టింది.

"గతాన్ని తలచుకొని బాధపడినందువల్ల ప్రయోజనం లేదు. ఆ ప్రభావం నీకొడుకు మీద పడుతుంది. నీ ఆరోగ్యం పాడవుతుంది. ముక్కలైన జీవితాన్ని అతుకుపెట్టి దానిని పునర్నిర్మించాలి. ఇందుకు నీ భర్త ఆదర్శ జీవితాన్ని, ప్రజలగురించి, మాతృభూమి గురించి తెలుసుకోవాలి. ప్రజలు ఎందుకు పోరాటానికి సిద్ధమయ్యారో గ్రహించాలి" అని హితబోధ చేసింది రాములమ్మ.

పద్మ డెన్‌లోకి వచ్చి ఆరునెలలు దాటింది. డెన్ ఇన్‌ఛార్జి రావి నారాయణరెడ్డి, అదే డెన్‌లోఉంటున్న ఆయన సతీమణి సీతాదేవి మంచితనం, జాలి, సానుభూతి, పద్మను ఆకట్టుకున్నాయి. వారిద్దరూ పద్మకు తల్లిదండ్రుల్లా తోచారు. పద్మ రావి నారాయణరెడ్డిగారి రాజకీయ తరగతులకు హాజరైంది. రాజకీయ, సిద్ధాంత పరమైన చర్చలలో పాల్గొని అనుమానాలను నివృత్తి చేసుకొంది.

భీమిరెడ్డి నరసింహారెడ్డి నడిపిన 'తెలంగాణా గెరిల్లా పోరాటం','గెరిల్లా పోరాటం- వ్యూహం- ఎత్తుగడలు' అనే మిలిటరీ తరగతులకు కూడా హాజరైంది. తన భర్తను, ఎంతో మంది విప్లవవీరులను, కార్యకర్తలను, వీరవనితల ధన, మాన, ప్రాణాలను బలిగొన్న శత్రుమూకలను హతమార్చాలనే కాంక్ష ఆమెలో ప్రతిక్షణం ఉప్పొంగ సాగింది.

ఇంతలో 'అమ్మా' అన్న కొడుకు పిలుపు వినబడింది పద్మకు. తన ఆలోచనల కల చెదిరినట్లయింది. బాబు మాటేమిటి? వాడిని ఎవరు చూస్తారు? తాను తిరిగి వచ్చేదాకా వాడికి తల్లి ఎవరు? వాడిని విడిచి తాను బతకగలదా? అయోమయంగా ఆలోచిస్తూ ఎటూ తేల్చుకోలేక పోయింది. వాడిని కౌగలించుకొని ఏడ్చింది. దీనిని డెన్ కీపర్ చారి గమనించారు.

"పద్మగారూ, మీరు ధైర్యం చూపాలి. మీరు

వినిన, కనిన తెలంగాణా పోరాట వీరవనితల గాథలన్నీ మీకు జ్ఞాపకాలై, మీరువేసే ప్రతి అడుగుకూ తోడునీడై ఉంటాయి"అంటూ ఆమెకు ధైర్యం చెప్పారు కామ్రేడ్ చారి.

★ ★ ★

పద్మ సిటీ డెన్ వదిలి పోరాట ప్రాంతానికి వెళ్ళడానికి నిర్ణయమైంది. డెన్‌లో కామ్రేడ్స్ వద్దకు వెళ్లి పేరుపేరునా నమస్కరించి పార్టీ ఏర్పాటు చేసిన కొరియర్‌తోపాటు పాపక్క సహాయంతో చీకట్లోకి జారుకుంది. మరో రెండు మజిలీలు చేసి బయ్యారం అడవులకు చేరుకున్నారు. పాపక్క పద్మను, బాబును తన ఆప్రాంత కామ్రేడ్ బూదెమ్మకు అప్పగించింది. కోయ బూదెమ్మ తన వద్ద వున్న బుర్ర అంబలి తాగడానికి ఇచ్చింది. కానీ పద్మకు అది మింగుడు పడలేదు. బూదెమ్మ ఇన్ని పాలు తాగించి బాబును వీపున కట్టుకొని, పద్మ చేయి పట్టుకొని చీకట్లో అడవులు దాటించి, గుట్టలు ఎక్కించి ఎంతోదూరం తీసుకెళ్ళింది.

ఆ శిక్షణా శిబిరం ఎటుచూసినా సూర్మరశ్మి పడని మహారణ్యంగా వుంది. మానవ సంచారమే లేదక్కడ. అక్కడ వారాలూ, నెలలూ గడిచిపోతున్నాయి. శిబిరంలో రైఫిల్ గురిచూసి కాల్చడం నేర్చుకున్నది పద్మ. బర్మారు తుపాకిలో గుండేసి మందుకూర్చడం, రైఫిల్‌ను విప్పి శుభ్రం చేయడం, తూటాలు సరిచేసి ఎక్కించడం, చేతి బాంబు (హ్యాండ్ గ్రెనేడ్లు)లను విసరడం నేర్చుకుంది. ఆమె నేర్పరితనాన్ని చూసి శిబిరం నాయకుడు రంగన్న ఆమెను గెరిల్లా దాడికి పంపడానికి ఒప్పుకున్నాడు. రేపో మాపో మిమ్మల్ని దాడికి పంపాలనుకుంటున్నాం. అయితే మీ బాబు సంగతేమిటి అని అడిగాడు దళనాయకుడు వాసు.

ఈప్రశ్న ఎదురయ్యే సరికి పద్మకు తన ప్రాణం గాలిలోకి ఎగిరిపోయినట్లయింది.

"బాబును వదిలిపెట్టి దాడికి వెళ్తే నీ ధ్యాసంతా వాడిపైనే ఉంటుంది. చంటిపిల్లల వల్ల గెరిల్లా శిబిర క్రమశిక్షణకు భంగం కలుగుతుంది. కాబట్టి బాబును ఎక్కడైనా వదిలే ఏర్పాటు చేసుకోవాలి. ఇది అందరికీ క్షేమంగా వుంటుంది ఆలోచించండి" అని చెప్పారు కామ్రేడ్ చిర్రావూరి లక్ష్మీనరసయ్య.

"ఎంత దొరలైనా మీ అన్నలు దుర్మార్గులు మాత్రంకారు. వాళ్ళు మీ బాబును క్షేమంగా చూసుకుంటారని నా నమ్మకం" పద్మకు నచ్చచెప్పాడు కామ్రేడ్ వాసు.

ఉప్పెనలా పైకెగసి కొడుతున్న మానసికావేదనను పద్మ బలవంతంగా అణచిపెట్టుకొని తదేకదృష్టితో ముందున్న తన కొడుకును చూడసాగింది. కొద్దిసేపు అలా చూసి చివరికి ఒక నిర్ణయానికి వచ్చినదానిలా దీర్ఘంగా ఒక నిట్టూర్పు విడిచింది.

ఆ మర్నాడే రహస్య మార్గాన కొరియర్ వెంట తెల్లవారే సరికి తన అన్నల వద్దకు వెళ్లింది. ఆమెను వారెంతో ఆదరించారు. తనొచ్చిన విషయం చెప్పింది పద్మ. తిరిగి పోరాటంలోకి వెళ్ళవద్దని అన్నలు, వదినెలు ఎంతగానో చెప్పిచూశారు. ఏడుస్తున్న కొడుకును పెద్ద వదినెకు అందించింది. అందరికీ పేరు పేరునా చెప్పి ధృడనిశ్చయంతో కారుచీకట్లో కలిసిపోయింది పద్మ.

★ ★ ★

పద్మ గెరిల్లా కేంద్రానికి చేరుకొని అప్పుడే ఆరు వారాలు దాటింది. దళ కమాండర్ వీరయ్య సూచనల మేరకు అప్పటికే పద్మ నాలుగైదు దాడులలో పాల్గొన్నది. అన్ని దాడులలోనూ ఆమె పాల్గొన్న దళానికే విజయాలు కలిగాయి. దళాలను కోయగూడెం పోలీస్ క్యాంప్‌పై దాడికి సిద్ధంగా ఉండాలని కామ్రేడ్స్ వాసు, వీరయ్య, మంచికంటి రాంకిషన్‌రావులు వచ్చి చెప్పారు.

మొత్తం గెరిల్లాలు రెండు జట్లుగా చీలారు. పద్మ ఉన్నదళం పడమటి దిశ నుంచి దాడికి పూనుకున్నది. కామ్రేడ్ తిరుపతమ్మ, రంగమ్మ, లచ్చక్క, కొమరయ్య ఎడతెగకుండా కాల్పులు సాగిస్తున్నారు. తాను కాల్పులు సాగిస్తూ పడిపోయిన శత్రువు రైఫిల్ లాక్కోవడానికై పొజిషన్ మారుతూ ముందుకు వెళ్తున్నది పద్మ. ఆ సమయంలో శత్రువు తుపాకి గుండు పద్మ భుజానికి తగిలింది. రక్తం కారిపోతోంది. నేలపై పడిపోయింది పద్మ. గెరిల్లాలు విజృంభించారు. పోలీసులు కాలికి బుద్ధి చెప్పారు. గాయపడిన పద్మను శిబిరానికి చేర్చారు. వెంటనే కోయ కామ్రేడ్స్ చెట్లనుండి ఆకులు, పసరలు తెచ్చి గాయానికి కట్టుకట్టారు.

పద్మ చేతికి అయిన గాయాన్ని మాన్పించేందుకు అడవిలోని గెరిల్లా క్యాంపునుంచి హైదరాబాద్‌లోని డెన్‌కి పంపించారు. ఆడెన్‌లో వుండే వారంతా పద్మకు కొత్త. డెన్ ఇన్‌ఛార్జ్‌గా కామ్రేడ్ దేవులపల్లి వెంకటేశ్వరరావు, డెన్ కీపర్‌గా 'గౌతమ్' ఉన్నారు. ఇంతలోనే ఆ డెన్ గురించి, అందులో రహస్యంగా ఉన్న నాయకుల గురించి శత్రువుకు తెలిసిపోయినట్లు ఒక కొరియర్ ద్వారా కబురు వచ్చింది. గది నుండి బయటకు వచ్చిన కామ్రేడ్ దేవులపల్లి వెంకటేశ్వరరావు "చూడు పద్మా! ఈ రాత్రికే మనమంతా ఈ డెన్‌ను ఖాళీ చేయబోతున్నాం. గోల్కొండకు సమీపానవున్న ఒక పెద్ద బంగళాలో మనం కొత్తగా 'డెన్'ను ఏర్పాటు చేసుకుంటున్నాం. డెన్ సురక్షితంగా వుంటేనే నాయకుల జీవితాలు, వారు నడిపే కార్యకలాపాలు సురక్షితంగా వుంటాయి. అందుకే ఈ కొత్త డెన్ నడిపే బాధ్యత పార్టీ నీపైన, గౌతమ్‌పైనా పెట్టదలచింది. అందుకు మీరిద్దరూ 'భార్యాభర్తలుగా' నటిస్తూ డెన్ కీపర్‌గా పనిచేయాలని పార్టీ నిర్ణయించింది. రేపు గౌతమ్ మీరుండే చోటుకువచ్చి మిమ్మల్ని కలుసుకొని అన్ని విషయాలు వివరిస్తారు. ఎల్లుండే మనం ఆ డెన్‌లోకి మారాలి' అంటూ చెప్పారు.

"భర్తను పోగొట్టుకున్న నేను మళ్ళీ ఒకరికి భార్యగా ఉండి నటించడానికి నా మనస్సు అంగీకరించడం లేదు. ఇది నాకు నేను ఆత్మవంచన చేసుకోవడమే. చనిపోయిన నా భర్త పట్ల అవిశ్వాసాన్ని ప్రకటించి, నా కన్నకొడుకుకు ద్రోహం చేయడమే అవుతుంది. ఇది తప్ప పార్టీ ఏ పనిచెప్పినా నెరవేర్చడానికి సిద్ధం " అంది పద్మ.

వారిద్దరి సంభాషణ వింటున్న కామ్రేడ్ మాకినేని బసవపున్నయ్యగారు గదినుండి బయటకు వచ్చి " అంతగా భయపడవలసిన పనిలేదమ్మా! ఏ పనికి ఎవరు తగినవారో తెలుసుకొని, వారివారి అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని, పని అప్పగించడం జరుగుతుంది. పార్టీ కార్యక్రమాలు నెరవేర్చడంలో కొన్నిసార్లు కొందరికి వ్యక్తిగత ఇబ్బందులు ఎదురుకావచ్చు. వీటిని పక్కనపెట్టి పోరాట దిశలో కార్యోన్ముఖులై ముందుకు రావలసి వుంటుంది. డెన్ అంటే ఒంటరి సంసారం కాదు. అందులో ఎల్లప్పుడూ మరికొంతమంది కామ్రేడ్స్ వుంటారు". ఆమెసందేహాలను నివృత్తి చేశారు. మాకినేని గారు వివరించిన తరువాత పద్మ అలా చేయడానికి అంగీకారం తెలిపింది.

ఓ పార్క్ వద్దకు కామ్రేడ్ ఎ.ఎ.రెడ్డి, పద్మతో కలసి చేరుకున్నారు. వారొచ్చిన కొద్దిసేపటికి కామ్రేడ్ గౌతమ్ అక్కడికి వచ్చాడు. గౌతమ్‌కు నమస్కరించింది పద్మ.

"గౌతమ్ నువ్వు పద్మ గారిని తీసుకొని బయలుదేరు. రాత్రికి ముఖ్యమైన నాయకులు మీ డెన్‌కు వస్తారు" అని చెప్పి వెళ్లిపోయారు కామ్రేడ్ రెడ్డి. రిక్షాలో వారిద్దరూ కొత్త డెన్‌కు చేరుకున్నారు. రిక్షాలో ప్రయాణించినంతసేపూ వారిరువురూ ఏమీ మాట్లాడుకోలేదు.

★ ★ ★

డెన్‌లో చేరి అప్పుడే నాలుగు నెలలైంది. డెన్ అనుకూలతను బట్టి ఎందరో కార్యకర్తలు అనేక ఏరియాల నుండి వచ్చి రాజకీయ, గెరిల్లా శిక్షణ పొంది వెళ్తున్నారు. డెన్ ఒకరాజకీయ యంత్రంగానూ, శిక్షణా శిబిరంగానూ మారింది. రోజువారీ పనిగా వంట పనిలో సహకరించడమేగాక, సర్క్యులర్లు రాయడం, ఏరియాలనుండి వచ్చే సమీక్షలు, పోరాట ప్రాంతాల నుండి వచ్చే రిపోర్టులు రాయడం, కార్బన్ కాగితాలు పెట్టి కాపీలు తీయడం పద్మకు దినచర్యగా మారింది. కొన్నికొన్ని సార్లు సైక్లోస్టయిల్ కాపీలు తీస్తూ కామ్రేడ్ గౌతమ్‌కు తోడ్పడేది. తీరికలేని 'డెన్' జీవితంలో డెన్ కీపర్ కామ్రేడ్ గౌతమ్, పద్మ గురించి ప్రత్యేకంగా ఎప్పుడూ ఆలోచించలేదు.

" గౌతమ్‌గారు, నాకేమైనా పనిచెప్పండి తొందరగా అయిపోతుంది కదా!" అంటూ స్టెన్సిల్ రూమ్‌లోకి వచ్చింది పద్మ.

"ఎవరిసాయమైనా ఇప్పుడు అవసరమే. అయితే చేయబోయే పని కొంతయినా తెలిసుండాలి. మీకెందుకండీ శ్రమ. నేను చేసేస్తాను లెండి" అన్నాడు గౌతమ్.

ఇన్నాళ్ళ డెన్ జీవితంలో పద్మ ఏనాడూ గౌతమ్‌తో ఇంత ఒంటరిగా, ఇంత చొరవతో మాట్లాడలేదు. గౌతమ్ నిదానం, ఆత్మీయతా భావం, నిస్వార్థం పద్మకు అతనిపై విశ్వాసం కలిగించాయి. అప్పటి నుండి పద్మ, గౌతమ్‌కు పనిలో ఎక్కువగా సాయపడుతూ ఉండేది.

పలురకాల ఆలోచనలు పద్మకు ఊపిరి పీల్చుకోకుండా చేస్తున్నాయి. పెళ్ళిచూపులనాటి భర్త చల్లని వెన్నెల చూపులు, బాబు అమాయకపు చిరునవ్వులు, తుపాకీ పేలుళ్ళు, గౌతమ్ చూపులోని ఆనందకిరణాలు... ఇలా పద్మ మదిలో జ్ఞాపకాల దొంతరలు ఊగిసలాడుతున్నాయి.

పద్మ మదిలో చెలరేగుతున్న మానసిక తుపానును గౌతమ్ పసిగట్టాడు. చివరికి ఒకరోజు డెన్ పెరటిలో ఒంటరిగా పూలుకోస్తున్న పద్మను చూశాడు గౌతమ్. అక్కడికెళ్ళిన గౌతమ్ సిగ్గూ బిడియంతో నోటమాట పెగలక, కొంతసేపటి తర్వాత ధైర్యంచేసి "మీకు అభ్యంతరం లేకపోతే మిమ్మల్ని పెళ్ళిచేసుకుంటాను పద్మగారూ" గబగబా చెప్పేశాడు గౌతమ్. చాలా సేపటి వరకూ పద్మ ఏమీ మాట్లాడలేదు. చివరికి వడిలో ఉన్న కోసిన పూలను తీసి గౌతమ్ చేతుల్లో పోసి తన మౌన అంగీకారాన్ని తెలిపింది.

వీరి పెళ్ళి విషయాన్ని డెన్‌లో వున్న కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్యగారికి తెలిపారు. ఆయన డెన్ పార్టీ కమిటీని సమావేశపరిచారు. " వివాహం- నూతన సాంఘిక సమస్యలవట్ల పార్టీ ఒక నూతన దృక్పథాన్ని అనుసరిస్తోంది. వివాహం- విడాకులు- పునర్వివాహం సమస్య ప్రధానమైనదిగా సామాన్య ప్రజల్లో ముందుకు వచ్చింది. మన ఉద్యమం పురోగమిస్తున్న కొద్దీ అంతవరకూ ఉన్న ఆర్థిక, సాంఘిక సంబంధాలలో మార్పులు వస్తున్నాయి. అంతేగాక చాలా మంది యువతులు పోరాటంలో తమ భర్తలను పోగొట్టుకున్నారు. మన పార్టీ ఒక నూతన నైతిక సూత్రాన్ని ప్రతిపాదించింది. యువతులు మళ్లీ పెళ్లి చేసుకొని ప్రజా ఉద్యమానికి తోడ్పడితే మంచిదే. మళ్లీ పెళ్లి అంటే పాపమూ కాదు. చనిపోయిన భర్త పట్ల అవిశ్వాసమూ కాదు. వితంతువులు తమకు తగిన భర్తల్ని ఎన్నుకొని, పోరాటంలో మరణించిన భర్తల అడుగుజాడలలోనే దంపతులు నడిచి తమ ఆశయాన్ని

సాధించాలి" అన్నారు సుందరయ్యగారు.

1950 ఏప్రిల్ 19న పుచ్చలపల్లి సుందరయ్య, రావి నారాయణరెడ్డి, భీమిరెడ్డి, దేవులపల్లి తదితర కామ్రేడ్స్ సమక్షంలో పద్మ, గౌతమ్‌ల వర్ణాంతర, వితంతు పునర్వివాహం సాదాసీదాగా జరిగిపోయింది. ఒకరిచేతిలో ఒకరు చెయ్యి వేసి పార్టీ పట్ల విశ్వాసంతో సంసార జీవితాన్ని గడుపుతామని ప్రతిజ్ఞ చేసి వారిద్దరూ దంపతులయ్యారు.

డెన్ గదిలో తన గదికి వెళ్ళిన పద్మ తన గత జీవితాన్ని జ్ఞప్తికి తెచ్చుకొని బోరున ఏడ్చింది. గౌతమ్ ఆమెను ఓదార్చి "నీకు కల్గిన ఈ కొత్త అనుభూతి, తలెత్తుకు తిరగగలిగే అనుభూతి" అని చెప్పాడు.

★ ★ ★

పద్మకు వివాహమై మూడు నెలలైనా పూర్తి కాలేదు. మళ్ళీ కష్టాలు ప్రారంభమయ్యాయి. పార్టీ రహస్య స్థావరాలను మిలిటరీ దాడుల నుండి కాపాడుకోవడం చాలా కష్టతరమైంది. తరచూ డెన్స్ మార్చడం, కొత్త డెన్స్ కోసం వెతకడం, నాయకులను కంటికి రెప్పలా కాపాడుకోవడం, పోరాట ఏరియాల నుండి దళాలతో లింక్ తెగకుండా చూసుకోవడం పార్టీకి తీవ్రమైన సమస్య అయింది. సాయుధ గెరిల్లా పోరాటం జీవన్మరణ సమస్యను ఎదుర్కొంటున్నది. అదే సమయంలో పద్మ గర్భంలో ఒక కొత్త జీవి రూపుదాల్చుతోంది. ఈ పరిణామాలతో పద్మ కుటుంబానికి పిడుగు మీద పడినట్లయింది. ఒకనాటి రాత్రి కామ్రేడ్స్ సుందరయ్య, ఎన్.వి.భాస్కరరావుగారలు పద్మ ఉండే స్థలానికి వచ్చి పోరాటాన్ని విస్తరింపజేసే దృష్టితో ఒక దళంతో కామ్రేడ్ గౌతమ్‌ను బస్తర్‌కు పంపించాలనే నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

" పద్మా, పార్టీ కేంద్ర కమిటీ మీ అన్నలతో రాయబారం నడిపింది. నీ గురించి అన్ని విషయాలు వారికి చెప్పడం జరిగింది. ఇప్పుడున్న స్థితిలో నిన్ను తమ దగ్గర ఉంచుకోవడానికి వారు ఒప్పుకోలేదు. అందుకని నువ్వు బెజవాడ మిషన్ ఆసుపత్రిలో పురుడు పోసుకునే ఏర్పాటు నేను చేస్తాను. ఆ తరువాత పుట్టిన శిశువును సంతానం లేని వారెవరికైనా ఇచ్చి వేయండి. అప్పుడు మీ అన్నయ్యలు నిన్ను రానిచ్చి ఆదరిస్తామని మాట ఇచ్చారు. దీనికి మీరు ఒప్పుకుంటేనే గౌతమ్‌ను బస్తర్‌కు పంపే ఏర్పాట్లు చేస్తాం. ఏ తల్లీ ఇలాంటి పని చేయదని నాకు తెలుసు. కానీ పరిస్థితులు మెడలు వంచి మనలను వంచితులుగా నిలబెడుతున్నాయి'' అంటూ సుందరయ్యగారు పద్మ వైపు చూడలేక భాస్కరరావుగారి వైపు ముఖం తిప్పుకున్నారు.

పదినిమిషాల పాటు ఆగదిలో నిశ్శబ్దం ఆవరించింది. ఇంకా జంకు ఎందుకన్నట్లు పద్మ లేచి తన భర్త చేతిని తన చేతిలోకి తీసుకుంది. ఒకవైపు అర్ధాంగి ప్రేమకై ఆరాటం, మరోవైపు పార్టీ నిర్ణయపాలన. కామ్రేడ్ గౌతమ్ పద్మను ధైర్యంగా ఉండమని చెప్పి పార్టీ నాయకుల వద్ద సెలవు తీసుకొని బ్యాగ్ చంకన వేసుకొని బస్తర్‌కు ప్రయాణానికై చీకట్లోకి జారుకున్నాడు.

★ ★ ★

ఆసుపత్రిలో తన పక్క మీద నుండి పసికందును తీసి పరాయి వాళ్ళెవరికో ఇస్తున్న నర్స్ చేయి పట్టుకొని 'వద్దు, వద్దు' అని విలపిస్తూ నివారించ బోయింది పద్మ. అయినా ఆ నర్స్ తన పనితాను చేసింది. మొహాన చేతులు వేసుకొని బావురుమని ఏడ్చింది పద్మ.

ఒక కొరియర్ సహాయంతో ఆసుపత్రి నుంచి డిఛ్ఛార్జి అయిన పద్మ హైదరాబాద్ చేరుకొంది. ఆమె అన్నలు పార్టీ వారికి చేసిన వాగ్దానం ప్రకారం ఆమెను తమ ఇంటికి తీసుకువెళ్ళారు. పోలీసుల భయంతో పద్మను ఇంటి గడపదాటనిచ్చేవారు కాదు.

మారుమూల ఓ పల్లెటూరిలో ఉంటున్న పద్మ పార్టీ వారిని కలవాలని, బస్తర్ ప్రాంత సమాచారం తెలుసుకోవాలని ఎన్నో ప్రయత్నాలు చేసింది. కానీ ఆమెకు అలవికాలేదు. బస్తర్ వెళ్లిన కామ్రేడ్స్‌కు ఇక్కడి వారితో సంబంధాలు తెగిపోయాయి. చివరికి ఎవరి ద్వారానో బస్తర్ ప్రాంతంలో ఇద్దరు కామ్రేడ్స్ చనిపోయారని, వారిలో గౌతమ్ ఉన్నాడని విన్నది. విషయం తెలియగానే పద్మ గజగజ వణికిపోయింది. కళ్ళు చీకట్లు కమ్మి స్పృహ తప్పి నేలపై కుప్పగా కూలిపోయింది. తనకు తెలిసిన భర్త విషాద వార్తను బయటపెడితే తన వితంతు వివాహం, కులాంతర వివాహం వగైరా విషయాలన్నీ అందరికీ తెలిసిపోతాయని ఎవరికీ చెప్పకుండా ఉండిపోయింది.

★ ★ ★

తెలంగాణా సాయుధ పోరాటం విరమించినట్లు, జరగబోయే ఎన్నికలలో కమ్యూనిస్టు పార్టీ పాల్గొనబోతున్నట్లు రేడియో ద్వారా వార్తలందాయి. బస్తర్ కామ్రేడ్స్‌కు వార్తాసంబంధాలు లేక ఈ విషయం తెలియని కామ్రేడ్ గౌతమ్ పోరాట విరమణ తర్వాత ఎంతో కాలానికి హైదరాబాద్ చేరుకున్నాడు. తన భార్య పద్మ ఏమైందో ఆయనకు తెలియలేదు. ఎక్కడుందో ఎవరూ చెప్పలేకపోయారు. ఓ రోజు కామ్రేడ్ గౌతమ్ కామ్రేడ్ భాస్కరరావు ద్వారా పద్మ తన పెద్దక్క వారి ఊరు బట్టుగూడెంలో ఉన్నట్లు తెలుసుకున్నాడు. వెంటనే కామ్రేడ్ యశోదమ్మ ద్వారా ఒక ఉత్తరాన్ని పద్మకు పంపాడు. ఇదంతా కలో, నిజమో నమ్మలేకపోయింది పద్మ. ఆమె కళ్ళు మెరుపులతో తళుక్కుమన్నాయి. గుండె కూడా ఆనందం పట్టలేక శబ్దం చేస్తున్నట్లు అనిపించింది. ఎన్నో రోజుల ఎడబాటు, మానసిక క్షోభ, ఆదుర్దా, ఆరాటం, సాంఘిక దురాచార సవాళ్ళు మొదలైన వాటితో సతమతమై వున్న భార్యాభర్తలిద్దరూ వై.ఎం.సి.ఎ. వద్ద వున్న పార్టీ ఆఫీసులో (అది అనాడు మాకినేని బసవపున్నయ్య గారి నివాసం కూడా) కలుసుకున్నారు. భార్యాభర్తలు ఇరువురూ ఒకరినొకరు చూస్తున్నంత సేపూ వారి కన్నుల నుండి ఆనంద భాష్పాలు ఏకధాటిగా రాలాయి. కామ్రేడ్స్ అంతా తమ సంతోషాన్ని వెలిబుచ్చారు.

ప్రస్తుతం ఈ దంపతులు హైదరాబాద్ మలక్‌పేటలో నివాసం ఉంటూ శేషజీవితాన్ని గడుపుతున్నారు. **('ఆమె జీవితమే ఒక పోరాటం' గ్రంథం ఆధారంగా)** ★

వివశులు

(19వ పేజీ తరువాయి)

ఆమెకు రెండు వేల రూపాయలూ ఇచ్చాడు. తల్లీ, కూతురు ఆటోలో ఆబిడ్స్‌కు వెళ్లారు. చల్లటి గాలికి సుందరమ్మ తన కృశించిన శరీరం చుట్టూ పమిట కప్పుకుని ముడుచుకు కూర్చుంది. ఆబిడ్స్‌లో షాల్స్ అమ్మే షాపుకు వెళ్లారు వాళ్ళు. సుందరమ్మ అంతా విచిత్రంగా చూస్తోంది. షాపులో వెలుగుతున్న విద్యద్దీపాలు ఆమె కళ్ళలో మెరుపులు మెరిపించాయి.

సేల్స్‌మన్ షాల్స్ చూపించసాగాడు. అవి మూడొందలు, నాలుగు వందల రేంజ్‌లో వున్నాయి.

"ఇదెలా వుంది?'' అందో పసుపుపచ్చని శాలువా తల్లికి చూపిస్తూ వసుధ.

"బావుంది" అంది సుందరమ్మ. అయితే ఆమె దృష్టి పక్కనే నిలబడి ఓ యువజంట ఓ తెల్లటి శాలువాను చూస్తుండటంపైనే లగ్నమై వుంది.

సేల్స్‌మన్ ఆమె దృష్టిని అనుసరించి చూస్తూ "అది మంచి క్వాలిటీది. అయితే ధర ఎక్కువ" అన్నాడు.

"ఎంత!" అడిగింది వసుధ.

"పన్నెండు వందలు" అన్నాడు సేల్స్‌మన్

"అదివ్వండి" అంది వసుధ.

శాలువా పాక్ చేయించలేదు ఆమె. పన్నెడొందలూ కౌంటర్‌లో పే చేసి, మడత విప్పి తల్లి భుజాల చుట్టూ కప్పింది వసుధ. "ఇంతడబ్బు!" గొణిగింది సుందరమ్మ. కూతురి ఎదుట మాట్లాడటమే భయంగా వుంటోంది ఆమెకీ మధ్య.

"డబ్బు గురించి మనం ఇంక పట్టించుకోవాల్సిన పని లేదు" అంది వసుధ.

ఆటోలో ఇద్దరూ ఉడ్‌లాండ్స్‌కి వెళ్ళారు. అక్కడ రామ్‌ప్రసాద్ వాళ్ళ కోసం నిరీక్షిస్తున్నారు. తల్లిని అతనికి పరిచయం చేసింది వసుధ. "వీరు మా కంపెనీ యజమాని. పేరు రామప్రసాద్‌రెడ్డి" అని తల్లికి చెప్పిందామె. అతని కులం పేరును నొక్కి చెప్తూ.

అతను ఆమెకు నమస్కారం చెప్పాడు. సుందరమ్మ అతని వంక తేరిపార చూసింది. ఎర్రటి మనిషి, ఒడ్డూ పొడుగూ, పక్కపాపిడి జుట్టు. నవ్వే కళ్ళు, రిమ్‌లెస్ కళ్ళద్దాలు. పాంటులో ఫుల్ హాండ్‌షర్ట్ టక్ చేశాడు. పైన కోటు, టై బాగానేవున్నాడనిపించింది ఆమెకు. ఆ 'బ్యాగు'లో డబ్బు వాసన వేసింది. అసంకల్పితంగానే ఆమె కూతురి వంక చూసింది. ముప్పయ్యేళ్ళు దాటుతున్న కూతురిలో కళ చెడలేదు అనుకుంది ఆమె. సిగ్గుపడ్డూ అతనికి అభివాదం చేసింది.

హోటలు డైనింగ్ హాలులోకి వెళ్ళారు. రకరకాలయిన పదార్థాలను అతడు ఆర్డరు చేశాడు. భోజనం చేస్తున్నంత సేపూ అతను వసుధతో ఏదో మాట్లాడుతూనే వున్నాడు. చివరగా కాఫీ ఆర్డరు చేశాడతను.

"వద్దు భోజనమయ్యాక కాఫీ ఎందుకూ?'' అంది సుందరమ్మ. "బాగుంటుంది. తాగి చూడండి" అన్నాడతను. కారులో వాళ్ళను ఇంటి దగ్గర డ్రాప్ చేశాడతను.

పడుకోబోతూ అంది వసుధ తల్లితో : "మనం వారం రోజుల్లో ఇల్లు మారుతున్నాం. అక్కడ కింద నుంచీ నీళ్ళు తెచ్చుకోవాల్సిన ఇబ్బంది వుండదు. చీరెలేసి స్టీలు బిందెలు కొనాల్సిన పని లేదు"... ఆమెకు తల్లితో ఎంతో మాట్లాడాలని వుంది. కానీ మాట్లాడలేకపోయింది.

ఎప్పటిలా నేలమీద బొంత పరుచుకుంది సుందరమ్మ. శాలువాను దుప్పటిని జత చేసి కప్పుకుంది. వెచ్చగా వుంది. వెచ్చదనంలో సుఖం వుంది. సుఖంలో అందముంది. ఇప్పుడామెకు స్టీలు బిందె ఆకర్షించటం లేదు. బంగారమా, వెండా? ఒట్టి ఇనుం. కనిష్టి లోహం. కూతురు అతన్ని పెళ్ళి చేసుకుంటుందా? అడిగే ధైర్యం లేదు.

వసుధ ఒంటరిపోరాటంతో విసిగిపోయింది. అందుకే భవిష్యత్తును కుదువ బెట్టడానికి నిశ్చయించుకుందామె. వస్తుమార్పిడి లోకంలో ఏదీ ఊరికే లభిస్తుందని ఆమె ఎప్పుడూ అనుకోలేదు. త్యజించడానికి జాత్యాహంకారం లేదిప్పుడూ. వైవాహిక బంధనంలో భద్రతేదో వున్నదన్న సంప్రదాయ భావన ఆమెని వేధించింది ఇంతకాలమూ. అది త్యజించేసిందామె. దారిద్ర్యం మనిషి మనసు కుదింప చేస్తుంది. ప్రపంచాన్ని అసహ్యించుకునేట్టు చేస్తుంది అని తెలుసుకుందామె. తల్లి వెచ్చగా పడుకుంటే తృప్తిగా నిట్టూర్చింది ఆమె వంక చూసి వసుధ. దారిద్ర్యం మనుషుల్ని వివశుల్ని చేస్తుంది. ★

"నూరిపోస్తోంది"

కొండబాబు

వనజకు సంతోషంగా ఉంది తన పెద్దమ్మను చూడబోతున్నందుకు. ఆటో మరికాస్త వేగంగా వెళితే బాగుండని పించింది. తన ఆత్రానికి తనే నవ్వుకుంది. ఎక్కడో ఉత్తరాదిన ఉద్యోగం చేస్తోంది వనజ. అయిదేళ్ళవుతోంది పెద్దమ్మను చూసి- అదీ శ్రీకాంత్ అన్నయ్య పెళ్ళిలో. పెద్దమ్మకు శ్రీకాంత్ అన్నయ్యొక్కడే కొడుకు. దీపావళికి ఇంటికి రావడంలో పెద్దమ్మను చూడాలనుకోవడం కూడా ఒకటి. చిన్నతనంలో ఆమె తనను పెంచింది. అందుకే వచ్చీ రాగానే పెద్దమ్మ వాళ్ళింటికి బయలుదేరింది. ఆటో దిగి లోపలకు వెళుతుండగానే పెద్దమ్మ ఎదురయ్యింది.

వనజను చూసి ఆమె పెద్దమ్మ, పెదనాన్న సంతోషించారు. పెద్దమ్మ, పెదనాన్న చిక్కిపోయి ఉండటాన్ని వనజ గమనించింది. వారి మొహాల్లో మునుపటి వెలుగులు లోపించడాన్నీ గుర్తించింది.

భోజనాలయ్యాక అదే విషయం గురించి అడిగింది వనజ.

ఒక్కసారిగా పెద్దమ్మ కళ్ళల్లోంచి నీళ్ళు రాలాయి. ఏడుస్తూ చెప్పిందామె.

"మీ అన్నా వదినలు మా బోగోగులు పట్టించుకోవడం లేదమ్మా ఇంతకుముందు నెలనెలా ఎంతో కొంత పంపేవాడు. ఇప్పుడు పంపకపోతేపోయె. పోతే పోనీ నెలకోసారి వచ్చి మా వేడివెచ్చ చూడొద్దూ!" అంటూ ప్రశ్నించింది.

విషయం తెలిసి వనజ ఆవేదనగా చూస్తుండిపోయింది.

"అయినా మీ అన్నయ్యదేముందిలే అమ్మా.. మీ వదిన వాడికి నూరిపోస్తోంది. ఇంక వాడేం చూస్తాడు మమ్మల్ని?" అంది మళ్ళీ ఆమె.

"అదేంటి పెద్దమ్మా.. అన్నయ్య చూస్తానంటే వదిన వద్దంటుందా?" "లేదమ్మా.. వాడు మంచోడే.. మీ వదినే అన్నీ నూరిపోస్తోంది"

వనజకు ఆ కుటుంబంలో అవగాహనాలేమి, బాధ్యతారాహిత్యం అర్థమయింది.

"పెద్దమ్మా.. అన్నయ్యకు మనసుంటే ఎవరు ఎంత నూరిపోస్తే ఏమి? అయినా ఏం నూరిపోస్తుంది. మీ వైపు ఏమైనా అలాంటి పరిస్థితులు ఉన్నాయా?" అంటూ మెల్లగా సర్దిచెప్పే ప్రయత్నం చేసింది.

★ ★ ★

ఇలా నూరిపోయడం గురించి ఇళ్ళల్లో వింటుంటాం. నూరడం అంటే తెలుసు. కారం నూరడం, పొడి నూరడం - ఇలా, అంతేకాదు పళ్ళు నూరడం, కత్తి నూరడం కూడా వింటుంటాం.

ఇక్కడ పై సంభాషణలో 'నూరిపోయడం' అని వచ్చింది. గిట్టని వారి గురించి చెడుగా చెప్పి ప్రభావితం చేయడం 'నూరిపోయడం'గా వ్యవహారంలో ఉంది. ఇది ఎలా ఏర్పడింది?

ఒక కాని విషయాన్ని ఎవరన్నా పదేపదే చెప్పి ప్రభావితం చేస్తే "ఎందుకండీ అలా నూరిపోస్తారు?" అని విసుక్కుంటాము. ఎవరన్నా ఊరికే వగబడితే, "కారాలు మిరియాలు నూరుతున్నారు!" అంటాం. ఎవరైనా వేపుకు తింటూవుండే, మనుష్యుల్ని "నూరుకు తాగుతున్నాడండీ!" అని అంటాం. పోట్లాటకు తలపడుతున్న వారిని చూచి "ఎవరిపైనండోయ్ ఈ కత్తినూరడం?" అంటాము. నూరు అనే క్రియతో చేరిన నానుదులన్నీ స్థూలంగా ఇలాంటి అర్థాన్నే తెలుపుతాయేమో!

తిక్కన కాలానికి "నూరు" పదానికి మామూలుగా రాచు, నలచు, మెదుపు అనే అర్థాలు మాత్రమే వున్నాయి.

"నన్ను దనంబుగా నలుగు
నూరియు చందన మట్లు రాచియున్"

అని తిక్కన మెదుపు అనే అర్థంలోనే వాడాడు. (భారతం-విరాటపర్వం)

ప్రబంధకాలానికి 'నూరు'కు రాచు, మెదుపు అనే అర్థాలతో పాటు మరొక వింత అర్థం కూడా అబ్బింది. "మదను దమ్ముల నూరె, హిమంబు పేరె" (మనుచరిత్ర-3వ అశ్వాసం) అనే ప్రయోగంలో నూరడం తర్వాత జరిగే పనికే ప్రాధాన్యం. అమ్ముల నూరాడు అని అర్థం.

కోపం పెల్లుబికినప్పుడు వాయి బిగునుకుపోయి, వళ్ళు పటపటలాడుతాయి; కరకరలాడుతాయి. పళ్లు రాచి, పదును పెట్టినట్టే కనిపిస్తుంది. పళ్ళను ప్రధానంగా వాడే మృగాలకు కరచిన కొద్దీ పళ్ల పదునవుతూ వుంటాయి. అందుకోసమే "కోరలు నూరడం" "పళ్లు నూరడం"అనే వాడుక వచ్చింది. "కోరలు నూరిపై వచ్చు భూదార పతులనైన"-హరిశ్చంద్ర నలోపాఖ్యానం.

వైద్యశాస్త్ర సంబంధంలో "నూరు" మరొక అర్థంలో వాడుకకు వచ్చింది. ఇప్పుడు ఇంజక్షన్‌ల వల్ల మందులు నూరడమో, నూరి తాగడమో, నూరిపోయడమో పట్టణాలలో అలవాటు తప్పిందేమోకాని, గ్రామాలలో నేటికీ మందు చాదడం, నూరడం, రోగికిపోయడం మామూలు. ఇలా నూరి తాగడం అన్ని రోగాలను హరించడమన్న మాట. ఇది క్రమంగా ఏమి దుర్మార్గం చేసినా చెల్లే-మందులు తరచు రోగికి నయించని రుచిలో వుంటాయి గనుక-కర్కోటకులకు వాడడం అలవాటయి, విజయనగర రాజ్యం కాలానికి ఇతరుల దుండగాలు హెచ్చాయి కాబోలు, సాహిత్యానికి ఎక్కింది

"నూరక త్రావు నీతడక
నుంగొను నంతటిలో
మనుష్యులన్" - శ్రీకాళహస్తి మహత్యం

"నూరక త్రావు వానికే"
జనం భయపడతారని
హరిశ్చంద్రోపాఖ్యానం ప్రయోగం.

పసిపిల్లలకు ఉగ్గులో కొన్ని ఔషధాలు నూరి పోస్తారు. మందు నూరిపోయడం, తర్వాత ఆ మందు ఒంటబట్టి రోగికి గుణం ఇవ్వడం, ఫలితంగా మరికొన్ని అర్థాలు "శ్రద్ధగా వినేవరకు పురి ఎక్కించడం, ఫలితం ఎలా వున్నా పాఠం చెప్పడం, చెప్పడంలో శ్రద్ధ చూపడం" అనేవి పుట్టుకు వచ్చాయి. ఇవి చాలా తర్వాతి పరిణామాలు.

"తనయులకు, మనుషులకును,
తన నేరుపు నూరిపోసి తాల్చిన సుర్గం
బునభరము వారి బూనిచి,-(కాకుత్స విజయం)

ఇలా "నూరు" వైద్య శాస్త్రసంప్రదాయంతో పెనవేసుకొని శ్రద్ధగా చెప్పు, పురి ఎక్కించు, హింసించు అనే అర్థాలలో వాడుకయింది. ఈ పదం గురించి ఇంతగా నూరిపోస్తారా? అని అనుకోకండేం! ★

పాఠక స్పందన

జోక్స్ ఉండాలి

నవంబర్ 11 ప్రజాశక్తి ఆదివారంలో 'హాస్యపు జల్లు - నవ్వుల విల్లు' చాలా బాగుంది. పాత జోక్స్ అయినప్పటికీ మరలా ఒకసారి కడుపుబ్బ నవ్వుకున్నాం. మన ఆదివారం అనుబంధంలో జోక్స్ శీర్షికను కూడా ప్రవేశ పెట్టమని అడుగుదామనుకుంటున్న సమయంలో ఈ హాస్యపు జల్లు నన్నెంతగానో ఆనందపరిచింది. వారానికి కనీసం రెండు జోక్స్ అయినా ప్రవేశ పెట్టమని మనవి.

- బోను వెంకటేశ్వరరావు, తాడేపల్లి, గుంటూరు జిల్లా

మరీ క్లుప్తంగా వుంది

నవంబర్ 4 ప్రజాశక్తిలో ప్రచురించిన 'ప్రకృతి అందాలకు నిలయం సింహాచలం' వ్యాసం పర్యాటకులకు, భక్త జనులకు అత్యంత ఉపయోగకరంగా వుంది. అయితే వ్యాసం క్లుప్తంగా వుంది. దేవాలయ నిర్మాణానికి, కారకులైన విజయనగర రాజ్య పాలకుల గురించి ప్రస్తావించి వుంటే ఎంతో సమంజసంగా వుండేది. జీవనశైలి శీర్షికలో 'బలమున్న వాడిదే ప్రపంచమా' అన్న విషయాన్ని వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా వివరించారు. అద్వానీ, ఆంథ్రాక్స్ గురించి వివరిస్తూ అద్వానీగారి కాషాయం ఆంథ్రాక్స్ కన్నా పవర్ ఫుల్ అని చదివి నవ్వకుండా వుండలేకపోయాం.

- ఆనందగజపతిరావు, తెట్టంగి, శ్రీకాకుళం జిల్లా.

ఏటేటా బాలలదినోత్సవాలు: అయినా ఏం ప్రయోజనం ఫోటో : ఎస్. భరత్ భూషణ్, హైదరాబాద్

HAYWARDS

5000

THE ORIGINAL

DARTING KIT